www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
ఆదివారం

వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 032, మార్చి 2024
సంపుటి: 5 సంచిక: 284, పేజీలు: 12, వెల: రూ.5/-

బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు
కావలెను
తెలంగాణ రాష్ట్రంలో వెలుతురు తెలుగు దిన పత్రిక, యందు పని చేయుటకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
86398 40328
రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, హైదరాబాద్, నల్లగొండ, సూర్యపేట, యాదాద్రి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట. జిల్లా కేంద్రాల్లో ఉండి పనిచేసేవారికి ప్రాధాన్యత

ఇంటికి శ్రీకారం!

11 నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం.. ఐదో గ్యారంటీ అమలుకు నిర్ణయం

- సొంత ఇల్లు లేని అర్హులందరికీ ప్రయోజనం
- తొలి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల నగదు
- లేని వారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల సాయం
- వెంటనే విధి విధానాలు తయారు చేయండి
- లబ్ధిదారు ఇష్టప్రకారమే ఇంటి నిర్మాణం..
- కానీ ఒక వంట గది, టాయ్‌లెట్ తప్పనిసరి
- డబుల్ బెడ్ రూం తరహా తప్పులు జరగొద్దు
- ఇళ్ల పథకంపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 2 (వెలుతురు):
పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు.. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ఈ నెల 11న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈ మేరకు పథకం విధి విధానాలు, నిబంధనలను రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇంటి నమూనాలు, డిజైన్లు తయారు చేయించాలని సూచించారు. నిరుపేదల సొంతింటి కలను దశల వారీగా నెరవేరుస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై శనివారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని అధికారులకు నిర్దేశించారు. లబ్ధిదారులకు ఆర్థిక సాయం ఏయే దశల్లో విడుదల చేయాలనేదానిపై నిబంధనలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ నిధులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణాలను పర్యవేక్షించే బాధ్యతలను జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో ఉన్న ఇంజినీరింగ్ విభాగాలకు అప్పగించాలని.. గూడు లేని పేదల సొంతింటి కలను దశల వారీగా నెరవేర్చడమే తమ సంకల్పమని సీఎం పేర్కొన్నారు. తొలి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇవ్వాలని గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. స్థలం లేని అర్హులైన పేదలకు స్థలమిచ్చి రూ. 5 లక్షలు, స్థలం ఉన్నవారికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

ప్రజా పాలన దరఖాస్తులకు తొలి ప్రాధాన్యం

ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా చూడాలని అప్రమత్తం చేశారు. సొంత జాగాలో కట్టుకునే వారికి ఉపయోగపడేలా వివిధ నమూనాలు, డిజైన్లను తయారుచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. లబ్ధిదారులు వారి ఇష్టప్రకారమే నిర్మాణం చేసుకున్నప్పటికీ వంట గది, టాయ్‌లెట్ తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. కాగా, ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొన్న ఆరు హామీల్లో నాలుగింటి అమలును ఇప్పటికే ప్రారంభించారు. ఇళ్ల నిర్మాణ పథకానికీ శ్రీకారం చుడితే ఐదో హామీనీ పట్టాలెక్కించినట్లు అవుతుంది. సమీక్షలో మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, గృహ నిర్మాణ శాఖ అధికారులు ఈశ్వరయ్య, బలరాం పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో రేపు ప్రధాని మోదీ పర్యటన..

- ట్రాఫిక్ ఆంక్షలు..

ఆదిలాబాద్, (వెలుతురు):
ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ఆదిలాబాద్‌లో పర్యటించ నున్నారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానితో కలిసి కార్యక్రమంలో పాల్గొంటారు. కాగా మోదీ పర్యటన నేపథ్యంలో ఆదిలాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సభ జరిగే ఇందిరా స్టేడియం వైపు రెండు రోజులు రాకపోకలు నిలిపివేశారు.

ప్రధాని మోదీ ఆదిలాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కచ్‌కంటి నుంచి ఆదిలాబాద్ పట్టణానికి రాకపోకలను మళ్లించారు. పాత సాత్నాల రహదారి నుంచి ఆదిలాబాద్‌కు దారి మళ్లించారు. కేఆర్‌కే కాలనీవాసులు పట్టణంలోకి వచ్చేందుకు మావల పోలీస్ స్టేషన్ మీదుగా తిరుమల పెట్రోల్ బంక్ వైపు రాకపోకలు సాగించాలి. అలాగే పట్టణంలో ఆది, సోమవారాల్లో సభాస్థలి, హెలిప్యాడ్, తదితర ప్రాంతాల్లో డ్రోన్లను పూర్తిగా నిషేధించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రధాని సభకు వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను వినాయక చౌక్ వద్ద గల మధుర జిన్నింగ్, గౌతమ్ మోడల్ స్కూల్ వద్ద పార్కింగ్ చేయాలని సూచించారు. సభకు వచ్చే బస్సులను స్థానిక డైట్ కళాశాల మైదానం, రామ్‌లీలా మైదానం, టీటీడీసీ ఎదురుగా ఉన్న ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలని పోలీసులు పేర్కొన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ కష్టానికి ఫలితం దక్కింది

- రక్షణశాఖ భూముల అప్పగింతపై కేటీఆర్

హైదరాబాద్,మార్చి2(వెలుతురు):
అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి పదేళ్ల పాటు ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు బీఆర్ఎస్ చేసిన సుదీర్ఘ పోరాటం ఫలించడం సంతోషంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారి, హైదరాబాద్-నాగపూర్ జాతీయ రహదారి రూట్లలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇవ్వడానికి కేంద్రం పచ్చజెండా ఊపడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీ సాధించిన విజయమని గుర్తుచేశారు. గత ఏడాది జూలై 31న జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం వీటిపై నిర్ణయం తీసుకుందని,

మిగతా.. 2లో

ముంబై బాంబు పేలుళ్ల కీలక సూత్రధారి మృతి

- గుండెపోటుతో మరణించినట్లు నిఘా వర్గాల వెల్లడి

ముంబై,మార్చి2(వెలుతురు):
26/11 ముంబై బాంబు పేలుళ్ల ప్రధాన సూత్రధారి, లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ అజామ్ ఛీమా మృతి చెందినట్లు సమాచారం. పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్ లో గుండెపోటుతో ఆయన మరణించినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఆయన అంత్య క్రియలు ఫైసలాబాద్‌లోని మల్కన్‌వాలాలో పూర్తైనట్లు సమాచారం. 15 ఏళ్ల క్రితం అంటే 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడ్డారు.

మిగతా.. 2లో

మాజీ మంత్రి మల్లారెడ్డికి షాక్

- గుండ్లపోచంపల్లిలోని హెచ్ఎండీఏ లేఔట్‌లో వేసిన రహదారి తొలగింపు
- 1045 గజాల ఆక్రమణ, కళాశాలకు రోడ్డు నిర్మాణం
- నాలుగేళ్ల క్రితం అప్పటి ఎంపీ రేవంత్ రెడ్డి ఫిర్యాదు
- ఇటీవల లేఔట్ సొసైటీ సభ్యుల ఫిర్యాదుతో చర్యలు

మేడ్చల్, మార్చి2 (వెలుతురు):
మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధికారులు షాక్ ఇచ్చారు. మైసమ్మగూడ పరిధిలోని హెచ్ఎండీఏ లేఔట్ పార్కు స్థలం నుంచి మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వరకు గతంలో అక్రమంగా నిర్మించిన సీసీ రోడ్డును శనివారం తొలగించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు ఈ రహదారిపై ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు స్పందించలేదు. అయితే, లేఔట్ సొసైటీ సభ్యులు ఇటీవల సీఎంవోను ఆశ్రయించారు. దీంతో అధికారులు విచారణ చేపట్టి రహదారి, రహదారి పరిసరాల్లో నిర్మించిన కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.
మైసమ్మగూడ సర్వే నెంబర్ 523, 524లో కమలానగర్ పేరిట హెచ్ఎండీఏ లేఔట్ ఏర్పాటు చేశారు. అందులోని 3 వేల

మిగతా.. 2లో

గాజాలో ఆకలి కేకలు..

- ప్రజల పరిస్థితి మరింత దయనీయం
- గాజా వాసులను ఆదుకునేందుకు అమెరికా ముందుకు
- ఆహార ప్యాకెట్లను గాజాలోకి జారవిడుస్తామని వెల్లడి

వాషింగ్టన్,మార్చి2(వెలుతురు):
ఇజ్రాయెల్ దాడులతో గాజాలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మానవతా సాయం కోసం ఎదురు చూస్తున్న అమాయకులపై ఐడీఎఫ్ కాల్పులు జరపడం యావత్ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆకలితో అల్లాడుతున్న

మిగతా.. 2లో

పదేళ్ల బీఆర్ఎస్ కష్టానికి
ఫలితం దక్కింది

మొదటిపేజీ తరువాయి..

దానికి అనుగుణంగా కేంద్రం ఆమోదం తెలపడం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. గతంలోనే రక్షణశాఖ తమ ఆధీనంలోని 33 ఎకరాలను కేటాయించిందని, ఇప్పుడు మరో 150 ఎకరాలను కూడా అప్పగించేందుకు ముందుకు రావడంతో స్కైవేల నిర్మాణానికి ఉన్న అన్ని అడ్డంకులు తొలగిపోయాయని కేటీఆర్ వెల్లడించారు. ఈ రెండు రూట్లలో రక్షణ శాఖ భూములు ఉండటం వల్ల ఇంతకాలం రోడ్ల విస్తరణ సాధ్యం కాకపోవడం, దశాబ్దాల పాటు ప్రభుత్వాలు ఫ్లైఓవర్ల నిర్మాణానికి చొరవ తీసుకోకపోవడంతో.. ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇంతకాలం ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. అందుకే 2014 లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ రెండు మార్గాల్లో ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం అనేక కీలక ప్రణాళికలు రూపొందించామని, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అన్ని నిరంతర సంప్రదింపులు జరిపామని తెలిపారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతి సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తోపాటు.. తాను, ఇతర మంత్రులు, ఎంపీలు ఢిల్లీ పెద్దలను కలిసి వినతిపత్రాలు అందజేశామని, ప్రతి సందర్భంలో వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అన్ని రకాల ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, వారు లేవనెత్తిన ప్రశ్నలకు ఎప్పటికప్పుడు సమాధానాలు అందిస్తూ ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు. హైదరాబాద్‌లోని రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో ఇక ఆయా రూట్లలో వచ్చి వెళ్లే ప్రజలకు పూర్తిగా ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తీరిపోతాయని కేటీఆర్ సంతోషం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు గత బీఆర్ఎస్ పదేళ్ల పాటు చేసిన పోరాటంలో భాగస్వాములైన అధికారులకు, యంత్రాంగానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఏ ఒక్కరి వల్లనో ఇది సాధ్యం కాలేదని, ఇది సమిష్టి విజయమని స్పష్టంచేశారు. ఎల్బీనగర్ తో పాటు.. ఇతర రూట్లలో ఇలాంటి అడ్డంకులు లేకపోవడంతో%్రా% గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో.. యుద్ధప్రాతిపదికన అనేక ఫ్లైఓవర్ల నిర్మాణాలు పూర్తిచేయగలిగామని గుర్తుచేశారు.తమ పాలనలో మెరుపు వేగంతో నిర్మించిన ఫ్లైఓవర్లు, అండర్ పాస్ ల వల్ల హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ సమస్యలు శాశ్వతంగా తీరిపోయాయని కేటీఆర్ స్పష్టంచేశారు. తాజాగా జేబీఎస్ నుంచి శామీర్ పేట, ప్యారడైజ్ నుంచి కండ్లకోయ రూట్లలో రెండు ఫ్లై ఓవర్లకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించిన నేపథ్యంలో.. ఇక రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్మాణాలను అత్యధిక ప్రాధాన్యతా క్రమంలో పెట్టుకుని పనులు చేపట్టాలని కోరారు. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించిన నేపథ్యంలో.. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. వీటి వల్ల హైదరాబాద్ నలుదిశలా విస్తరించడంతో పాటు.. ప్రతి రూట్‌లోనూ ప్రగతిపథంలో దూసుకుపోవడానికి మార్గం సుగమమవుతుందని వెల్లడించారు. ఇన్నాళ్లకు తమ పోరాటాన్ని గుర్తించి దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వ పెద్దలకు కేటీఆర్ ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

ముంబై బాంబు పేలుళ్ల కీలక సూత్రధారి మృతి

మొదటిపేజీ తరువాయి..

కొబాలా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ఎంటరైనన ఈ ముఠా తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ సహా అనేక ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి అజామ్ ఛీమా కీలక సూత్రధారిగా గుర్తించారు. దాడుల్లో పాల్గొన్న ఉగ్రవాదులకు అజామ్ శిక్షణ ఇచ్చినట్లు అమెరికా నిఘా వర్గాలు వెల్లడించాయి. దీంతో అతని పేరును మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ జాబితాలో చేర్చింది. 26/11 పేలుళ్ల ఘటన మాత్రమే కాకుండా ఇతర బాంబు పేలుళ్లకు కూడా అజామ్ సూత్రధారిగా వ్యవహరించారు. 2006లో ముంబై రైళ్లలో జరిగిన బాంబు పేలుడు వెనుక అతని హస్తం ఉందని అప్పట్లో తేల్చారు. ఈ పేలుళ్లలో 188 మంది ప్రాణాలు కోల్పోగా.. 800 మంది దాకా తీవ్రంగా గాయపడ్డారు.

మాజీ మంత్రి మల్లారెడ్డికి షాక్

మొదటిపేజీ తరువాయి..

చదరపు గజాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. ఈ స్థలం మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు ఆనుకొని ఉంటుంది. దీంతో అప్పట్లో మంత్రిగా ఉన్న మల్లారెడ్డి.. లేఔట్ సొసైటీ సభ్యులను సంప్రదించి 60 అడుగుల రోడ్డు నిర్మాణం కోసం పార్కు స్థలం ఇవ్వాలని అడిగారు. బదులుగా పక్కన ఉన్న సర్వే నెంబర్ 522లోని తన స్థలాన్ని ఇస్తానని ప్రతిపాదించారు. దీనికి సొసైటీ సభ్యులు తిరస్కరించారు. దీంతో మల్లారెడ్డి.. ఓ రోజు రాత్రికి రాత్రే తన సొంత ఖర్చులతో పార్కు మధ్య నుంచి 60 అడుగుల వెడల్పు, 90 అడుగుల పొడవున రహదారి నిర్మించారు. అంతేకాక, రోడ్డు కోసం తీసుకున్న 1045 చదరపు గజాలకు బదులుగా సర్వే నెంబర్ 522లోని 1210 చదరపు గజాల స్థలాన్ని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై సొసైటీ వాసులు అప్పట్లో ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయం రాగా ఆయన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నాలుగేళ్లుగా తొక్కిపెట్టారు. సొసైటీ సభ్యులు ఇటీవల సీఎంవోను ఆశ్రయించగా అధికారుల్టు రహదారి, రహదారి పరిసరాల్లో నిర్మించిన కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

ఇది ప్రభుత్వ కక్ష సాధింపు : ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆరోపించారు. హెచ్ఎండీఏ అనుమతితోనే తాను రోడ్డు వేసినట్లు స్పష్టం చేశారు.

గాజాలో ఆకలి కేకలు..

మొదటిపేజీ తరువాయి..

గాజావాసులను ఆదుకునేందుకు అమెరికా ముందుకొచ్చింది. విమానాల ద్వారా ఆహార ప్యాకెట్లను గాజాలోకి జారవిడుస్తామని అధ్యక్షుడు బైడెన్ మీడియాకు వెల్లడించారు.

క్లిష్ట పరిస్థితుల్లో గాజాకు మానవతా సాయం ఎంతో అవసరం. అందించేందుకు అమెరికా సిద్ధంగా ఉంది" అని బైడెన్ పేర్కొన్నారు. సముద్ర మార్గాన పెద్ద మొత్తంలో సహాయం అందించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. 'రెడీ టూ మీల్స్' ప్యాకెట్లను మిలటరీ విమానాల ద్వారా ఎయిర్‌డ్రాప్ చేయనుంది. ఈ ఆహార పంపిణీ నిరంతర ప్రక్రియ అని వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు తెలిపారు. జోర్డాన్, ఫ్రాన్స్ సహా ఇతర దేశాలు ఇప్పటికే గాజాలోకి ఆహార పొట్లాలను జారవిడిచాయి. మానవతా సాయం ఫలాలు అందరికీ అందాలంటే గాజా-ఈజిప్ట్ సరిహద్దులోని రఫా చెక్‌పోస్టు తెరుచుకుంటేనే అది జరుగుతుందని.. లేదంటే ఈ చర్య అంతగా ప్రభావం చూపకపోవచ్చని మరొక అమెరికా అధికారి అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా.. గురువారం తెల్లవారుజామున మానవతా సాయం కోరుతూ ట్రక్కుల వద్ద గుమిగూడి ఉన్న వారిపై ఇజ్రాయెల్ విచక్షణా రహితంగా కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. ఎంతో మంది తీవ్రంగా గాయపడ్డారు. చిన్నారులు తీవ్ర పోషకాహారం లోపంతో బాధపడుతున్నారని ఐరాస అందోళన వ్యక్తం చేస్తోంది. ఆహార కొరత ఏర్పడి రోజుల తరబడి పస్తులు ఉంటున్నారు. ఆకలికి తాళలేక పశువుల దాణానే ఆహారంగా తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరం. ఈ సంక్షోభాన్ని నివారించాలంటే రోజుకు 500 ఫుడ్ ట్రక్కులు గాజాలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. కానీ, జనవరిలో రోజుకు 150.. ఫిబ్రవరిలో 97 ట్రక్కులు మాత్రమే గాజాలోకి ప్రవేశించాయి.

హైదరాబాద్‌లో దారుణం..

మ్యాన్‌హెూల్లోకి దిగి ముగ్గురు మృతి

హైదరాబాద్,మార్చి2(వెలుతురు):

మార్చి 1న హైదరాబాద్‌లోని కుల్సుంపురా వద్ద మ్యాన్‌హెూల్‌ను శుభ్రం చేస్తుండగా ఊపిరాడక ముగ్గురు పారిశుధ్య కార్మికులు మృతి చెందిన ఘటన నగరంలో కలకలం రేపింది. మృతులను ఎం శ్రీనివాస్ (40), వి. హన్మంత్ (42) ఎం. వెంకటేశ్వర్ రావు (40) గా గుర్తించారు. కుల్సుంపురా సబ్‌ఇన్‌స్పెక్టర్ బి. మన్మోహన్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 1న శ్రీనివాస్ మ్యాన్‌హెూల్ శుభ్రం చేయాడానికి కవర్ తెరిచాడు. బ్యాలెన్స్ తప్పి అందులో పడిపోయాడు. శ్రీనివాస్‌ను కాపాడేందుకు తోటి కార్మికులు హన్మంత్, వెంకటేశ్వర్‌రావు మ్యాన్‌హెూల్‌లోకి దిగారు. అయితే వారు విషవాయువు పీల్చి స్పృహతప్పి పడిపోయారు. దీంతో వీరు ముగ్గురు ప్రాణాలు కొల్పోయారు. కాగా.. వారిని ఆదుకునేందుకు ప్రయత్నించిన మరో కార్మికుడు జీవన్ రాజ్ విషవాయువు పీల్చడంతో అస్వస్థతకు గురయ్యాడు. బాధితులు అయ్యప్ప ఇన్‌ఫ్రా కాంట్రాక్టు ఏజెన్సీ రోజువారీ వేతనంపై పని చేస్తున్నారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ అయ్యప్ప ఇన్‌ఫ్రా తమ కార్మికులకు శ్వాస మాస్క్‌లు అందించడంలో విఫలమైందని, ఇది ముగ్గురు వ్యక్తుల మరణానికి దారితీసిందని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పారిశుధ్య కార్మికుల మృతిపై కాంట్రాక్టు ఏజెన్సీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కంటోన్మెంట్ భూములు
రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగింత!

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
రక్షణశాఖ భూమిని బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ

హైదరాబాద్,మార్చి2(వెలుతురు):

తెలంగాణ ప్రజలకు మరో కానుక ప్రకటించింది. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి, తిరుమలగిరి ప్రాంతాల్లో ఇక ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రోడ్లను విస్తరించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వానికి భూములు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తెలంగాణలో ప్రజాసౌకర్యం కోసం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని 175 ఎకరాల రక్షణశాఖ భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా.. 44వ నెంబరు జాతీయ రహదారి (కామారెడ్డి మార్గంలో), ఒకటో నెంబరు రాష్ట్ర రహదారి (సిద్దిపేట మార్గంలో) ఎలివేటెడ్ కారిడార్లు, టన్నెళ్ల నిర్మాణం ద్వారా ప్రజలకు చాలా సౌకర్యం కలగనుంది. మౌలికవసతుల కల్పన ద్వారా ప్రజాజీవనాన్ని సులభతరం చేసేందుకు గత పదేళ్లుగా ప్రధానమంత్రి మోదీ దేశ ప్రజలకు అందిస్తున్న గ్యారంటీకి ఇదొక ఉదాహరణ అంటూ కొనియాడారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. కంటోన్మెంట్ బోర్డు భూములు ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు కేంద్ర మంత్రి. అసలు జంటనగరాల్లో కంటోన్మెంట్ కలహం ఈ నాటిది కాదు. ఏళ్లుగా అక్కడి ప్రజలు నరకం చూస్తున్నారు. ఎప్పుడూ రోడ్లు మూస్తారో తెలియదు. ఎప్పుడు తెరుస్తారో తెలియదు. వాళ్లు చెప్పిందే శాసనం. చేసిందే శాసనం అన్నట్టుగా ఉంటుంది

పరిస్థితి. కంటోన్మెంట్ రోడ్లు తెరిస్తే భాగ్యం.. లేదంటే చుట్టుపక్కల జనాల దౌర్భాగ్యం. కంటోన్మెంట్ రహదారులు తెలిచి ఉంటే%్రా% ఎర్లీ జర్నీ%్రా% లేదంటే లేట్ జర్నీ. దీనికి అలవాటు పడిపోయారు జనం. గతంలో కంటోన్మెంట్ ఏరియాపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య మాటల తూటాలు సైతం పేలాయి. దాదాపు 10వేల ఎకరాలు విస్తరించిన కంటోన్మెంట్ ఏరియాలో మూడు వేల ఎకరాల స్థలంలో సాధారణ ప్రజలు నివాసం ఉంటున్నారు. మిగతా ఏడు వేల ఎకరాల స్థలం ఆర్మీ, రైల్వే, కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలో ఉంటుంది. రోజు లక్ష మంది వరకు కంటోన్మెంట్ రోడ్ ద్వారా ప్రయాణం చేస్తుంటారు. నగరం నడిబొడ్డున ఉన్నా%్రా% అభివృద్ధికి మాత్రం చాలా ఉన్నామని కంటోన్మెంట్ పరిసర ప్రజలు చెబుతున్నారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. కంటోన్మెంట్ పరిధిలోని

1000 అమృత్ భారత్ రైళ్ల తయారీ

రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ,మార్చి2(వెలుతురు):

రానున్న కొన్నేళ్లలో భారతీయ రైల్వే దాదాపు 1000 అధునాతన 'అమృత్ భారత్ రైళ్లను తయారుచేయనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అలాగే గంటకు గరిష్ఠంగా 250 కి.మీ. వేగంతో నడిచే రైళ్లను రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నట్లు తెలిపారు. 'పీటీఐ' వార్తా సంస్థతో మాట్లాడుతూ ఈ వివరాలు చెప్పారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా-హావ్‌డా నగరాలను కలుపుతూ.. దేశంలోనే తొలిసారి నదీగర్భంలో నిర్మించిన మెట్రో మార్గాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 6న ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు."భారతీయ రైల్వే ఏటా 700 కోట్ల మందిని వారి గమ్యస్థానాలకు చేర్చుతోంది. ప్రయాణాల విషయంలో ఒకరికి రూ.100 ఖర్చవుతుండగా.. రూ.45 మాత్రమే వసూలు చేస్తున్నాం. అమృత్ భారత్ రైళ్లు.. కేవలం రూ.454 ఖర్చుతో

1,000 కి.మీ. ప్రయాణాన్ని అందిస్తాయి" అని రైల్వే మంత్రి తెలిపారు. వచ్చే ఐదేళ్లలో 'వందే భారత్' రైళ్ల ఎగుమతి ప్రారంభమవుతుందన్నారు. "యువతలో 'వందే భారత్' బాగా ప్రాచుర్యం పొందింది.

ప్రతీవారం ఓ రైలు పట్టాలెక్కుతోంది. రాబోయే కొన్నేళ్లలో 400 నుంచి 500 వరకు ఈ రైళ్లను తయారుచేస్తాం" అని వెల్లడించారు.కోల్‌కతా 'ఈస్ట్-వెస్ట్ మెట్రో కారిడార్ (మెట్రో లైన్-2)'లో భాగంగా హుగ్లీ నదికి తూర్పు తీరంలో మహాకరణ్, పశ్చిమతీరంలో హావ్‌డా మెట్రోస్టేషన్‌లు నిర్మించారు. ఈ రెండింటిని కలుపుతూ నదీ మట్టానికి 32 మీటర్ల లోతులో, 520 మీటర్ల పొడవునా మెట్రో మార్గాన్ని నిర్మించారు. ఈ మార్గం ప్రారంభంతో కోల్‌కతాలోని టెగోరియా స్టేషన్ నుంచి హుగ్లీ నదికి అవతలి హావ్‌డా మైదాన్ వరకు మెట్రో సేవలు అందుబాటులోకి వస్తాయి. భూఉపరితలానికి 33 మీటర్ల దిగువనున్న హావ్‌డా మెట్రో స్టేషన్.. దేశంలోనే అతిలోతైన భూగర్భ మెట్రో స్టేషన్‌గా గుర్తింపు పొందింది.

ప్లేస్టోర్ నుంచి భారత్ ట్రెండింగ్ యాప్‌ల తొలగింపు

న్యూఢిల్లీ,మార్చి2(వెలుతురు):

దేశంలోని పది పాపులర్ యాప్‌లకు గూగుల్ గట్టి షాక్ ఇచ్చింది. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఆ యాప్‌లను తొలిగించింది. ఈ యాప్‌లు గూగుల్ ప్లేస్టోర్ బిల్లింగ్ విధానాన్ని అనుసరించడం లేదని వెల్లడించింది. దేశంలో రెండు లక్షలకు మందికి పైగా యాప్ డెవలపర్‌లు ప్లేస్టోర్ బిల్లింగ్ విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపింది. అయితే ఈ పది యాప్‌లు తమ సర్వీసుల కోసం గూగుల్ ప్లే స్టోర్‌కు ఇంకా నగదు చెల్లించలేదని గూగుల్ తన బ్లాగ్‌లో రాసుకొచ్చింది.గూగుల్ తీసుకున్న నిర్ణయంపై ఇన్ఫోఎడ్జ్ వ్యవస్థాపకుడు సంజీవ్ బిఖ్ చందానీ మాట్లాడుతూ.. భారత్ ప్రత్యేకమైన ప్లేస్టోర్‌నుఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత్ మార్కెట్ పై ఆధిపత్యం చెలాయిస్తున్న గూగుల్ ప్లే స్టోర్‌కు పోటీగా డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా మొబైల్ అప్లికేషన్ స్టోర్ ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.ఈ చర్య తర్వాత కుకు ఎఫ్ఎం సీఈవో లాల్ చంద్ బిను గూగుల్‌ని విమర్శిస్తూ ఎక్స్‌లో ఇలా రాసుకొచ్చారు. "గూగుల్ వ్యాపారం విషయంలో పరమ చెత్త కంపెనీ. వారు భారతీయ స్టార్టప్ సిస్టమ్‌ను కంట్రోల్ చేస్తున్నారు. 2019లో25 రోజుల పాటు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మమ్మల్ని ప్లేస్టోర్ నుంచి గూగుల్ తొలగించింది. ప్లేస్టోర్‌లో యాప్ లేకుండా మా టీమ్ ప్రతిరోజూ ఆఫీసులో పని చేసేటప్పుడు ఆ వాతావరణం ఎలా

ఉంటుందో ఊహించండి." అని చెప్పుకొచ్చారు. షాదీ.కామ్ ఫౌండర్ అనుపమ్ మిట్టల్ కూడా ఎక్స్‌లో స్పందిస్తూ ఇలా రాసుకొచ్చారు.. "ఈ రోజు భారతీయ ఇంటర్నెట్ చరిత్రలో చీకటి రోజు. గూగుల్ తన ప్లే స్టోర్ నుంచి అనేక పెద్ద యాప్‌లను తొలగించింది." అని అన్నారు.ప్లే స్టోర్ నుంచి యాప్‌లను గూగుల్ ఎందుకు తొలగిస్తారు.. ఇన్-యాప్ చెల్లింపులపై గూగుల్ 11-26 శాతం సర్వీస్ ఫీజు వసూల్ చేస్తుంది.

దీనిపై దేశ స్టార్టప్ కంపెనీల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఇన్-యాప్ చెల్లింపులపై 11-26 శాతం వసూలు చేసే వ్యవస్థను తొలగించాలని మన దేశానికి సంబంధిత అధికారులు కొందరు గతంలో గూగుల్‌ను కోరారు. ఈ వ్యవహారంపై గూగుల్ కోర్టును ఆశ్రయించింది. కానీ ఈ ఘటన కారణంగా ఆ యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ నుంచి తొలగించలేదు. దేశీయ యాప్ డెవలప్పర్లు గూగుల్ ప్లే స్టోర్ బిల్లింగ్ విధానాన్ని సవాలు చేస్తూ గతంలో మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే 2024 ఫిబ్రవరి 9నన జరిగిన విచారణలో ఈ యాప్‌లను ప్లే స్టోర్‌లో సేవ్ చేయడానికి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేసింది. ఈ కోర్టు తీర్పుల తర్వాత గూగుల్ ఫీజు వసూలు చేయడానికి లేదా యాప్స్‌ను తొలగించడానికి అనుమతి పొందింది.

పాత స్కీం పునరుద్ధరణకై
రైల్వే ఉద్యోగుల సమ్మె సైరన్

మే1నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్న ఉద్యోగులు

న్యూఢిల్లీ,మార్చి2(వెలుతురు):

సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు రైల్వే సర్వీస్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయి. అలాంటి ప్రయాణికులను తమతమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేస్తూ.. ప్రయాణికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా గాని.. ఎక్కడ ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా..రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ సేవలను అందిస్తున్నారు. అయితే వారి సమస్యలను పరిక్షించాలని కోరుకుంటూ గతకొంతకాలంగా పాత స్కీంని పునరుద్ధరించాలనే అప్పీల్‌ను ప్రభుత్వం ముందు ఉంచారు. అయినా సరే కేంద్రం తమ సమస్యలను పరిష్కరించలేదని రైల్వే ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించేందుకు రెడీ అవుతున్నారు. రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీంని పునరుద్ధరించకపోతే మే నుండి అన్ని రైళ్ల సర్వీసులనూ నిలిపివేస్తామని రైల్వే ఉద్యోగ, కార్మిక సంఘాల ఐక్య వేదిక జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (జెఎఫ్ఆర్ఒపిఎస్) కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. జెఎఫ్ఆర్ఒపిఎస్ కోర్ కమిటీ సమావేశంలో మే 1, 2024 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం నుండి ఓపీఎస్ కోసం నిరవధిక సమ్మెను చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు కన్వీనర్, ఆల్ ఇండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా తెలిపారు. అంతేకాకుండా ఈ సమ్మెలో ప్రతి ఒక్కరూ కూడా భాగస్వామ్యం కావాలంటూ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నూతన పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్) స్థానంలో నిర్వచించబడిన హామీతో కూడిన పాత పెన్షన్

స్కీంను పునరుద్ధరించాలని ఎంతోకాలంగా రైల్వే ఉద్యోగులందరూ కోరుతున్నా ప్రభుత్వం మాత్రం ఏం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇప్పుడు ప్రత్యక్ష చర్యకు దిగడం మినహా..మరో మార్గం లేదని జెఎఫ్ఆర్ఒపిఎస్ కన్వీనర్, ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. జెఆఫ్ఆర్ఒపిఎస్ ఆధ్వర్యంలో వివిధ ఫెడరేషన్ల ప్రతినిధులు సంయుక్తంగా ఈనెల 19న అధికారికంగా రైల్వే మంత్రిత్వ శాఖకు సమ్మె నోటీసు అందజేయనున్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మేడే నాటి నుంచి దేశవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని ఆయన అన్నారు. ఈ సమ్మెలో రైల్వే ఉద్యోగులు, కార్మికులతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు, సంఘాలు కూడా పాల్గొంటాయని ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మిశ్రా తెలిపారు. సమ్మె నోటీసును ఇవ్వడానికి అన్ని రాజ్యాంగ సంస్థలు తగు చర్యలు తీసుకోవాలని,, అన్నిరకాల సన్నాహాలు చేయాలని జెఆఫ్ఆర్ఒపిఎస్ కోరింది. ఒపిఎస్ కార్మికుల ప్రయోజనాల కోసం ఉద్దేశించిందని, నూతన పెన్షన్ పథకం ఉద్యోగుల, కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోదని మిశ్రా విమర్శించారు.ఈ సమ్మెలో ప్రభుత్వ సంఘాలు భాగం కానున్నాయని పేర్కొన్నారు. కార్మికుల ప్రయోజనాలన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు శివగోపాల్ మిశ్రా వివరించారు.

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ సంస్థ అయిన రైల్వేలో సమ్మె అనడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాలనుకునే ప్రయాణికులందరూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏదేమైనా రైల్వే ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని రైల్వే ప్రయాణికులు, ప్రజలు కోరుకుంటున్నారు.

బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకల్లో సర్వాయిపాపన్న మోకుదెబ్బ (గౌడ సంఘము)రాష్ట్ర కమిటీ

భువనగిరి వెలుతురు మార్చి 02:
యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ని ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో భువనగిరి మాజీ ఎం పి బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిచారు.ఈ కార్యక్రమంలో సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడసంఘము నాయకులు బూర నర్సయ్య గౌడ్ గారితో కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జక్కే వీరస్వామిగౌడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్సం సోమన్న గౌడ్ రాష్ట్ర కోశాధికారి రేగటి నాగరాజు గౌడ్ బీసీ నాయకులు ఎన్ కుమార్ ముదిరాజ్ మరియు సంఘము జిల్లా మండల నాయకులు మరియు సోమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెలుతురు 02:

తెలంగాణ బిసి విద్యవంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు సామాజిక సేవలో నిరంతరమైన సేవసేసిన దివంగత వంగ రాములు గౌడ్ సంస్మరణ సభ శనివారం రోజున సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులు తెలపడం జరిగింది. వారి సేవలను కొనియాడడం జరిగింది. మీ అంబాల నారాయణ గౌడ్ గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు

భారతీయ జనతా పార్టీ భువనగిరి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలు

వెలుతురు భువనగిరి మార్చి 02: మాజీ పార్లమెంట్ సభ్యులు భారతీయ జనతా పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలు భువనగిరి పట్టణంలోని మెన్ ఆర్ గార్డెన్లో ఘనంగా నిర్వహించారు నల్గొండ, రంగారెడ్డి, భువనగిరి యాదాద్రి, సూర్యాపేట జిల్లా రాష్ట్ర నాయకులు తదుపరి కార్యకర్తలు బీసీ సంఘం నాయకులు బహుజన నాయకులు పార్టీలకు అతీతంగా శనివారం రోజున ఘనంగా నిర్వహించారు, ఈ వేడుకల భాగంగా బిజెపి చండూరు మండలము మరియు మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు, దర్శనం వేణు, అయితగోని అశోక్ గౌడ్, కాసాల జనార్దన్ రెడ్డి, బిజెపి చండూరు మండల ప్రధాన కార్యదర్శి నకిరేకంటి లింగస్వామి గౌడ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పందుల సత్యం, తడకమల్ల శ్రీధర్, బోడ ఆంజనేయులు, మాధగోని నాగార్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ భువనగిరి అభ్యర్థిగా బూర నర్సయ్య గౌడ్

వెలుతురు చండూర్ మార్చి 02:

భారతీయ జనతా పార్టీ భువనగిరి అభ్యర్థిగా బూర నర్సయ్య డాక్టర్ గౌడ్ ని ప్రకటించినందుకు భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి మరియు రా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గారికి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి గారికి జాతీయ కార్యదర్శి బండి సంజయ్ గారికి వారి ఎన్నికకు సహకరించిన అందరికీ అలాగే తెలంగాణ పార్లమెంట్ అభ్యర్థులను ప్రకటించిన జాతీయ పార్టీకి మరియు రాష్ట్ర పార్టీకి రాష్ట్ర ఇంచార్జ్ లకు వారి ఎన్నికకు సహకరించినటువంటి అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాం చండూరు బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నకిరేకంటి లింగస్వామి గౌడ్

నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించాలి : టీయూటీఎఫ్

హైదరాబాద్ వెలుతురు మార్చి 02:
టీయూటీఎఫ్ రాష్ట్ర శాఖ పక్షాన తెలంగాణ రాష్ట్ర రెండో పీఆర్సీ కమిషన్ కమిటీ చైర్మన్ శ్రీ ఎన్. శివశంకర్ (రిటైర్డ్ ఐపీఎస్)గారిని కలిసి వేతన సవరణకు సంబంధించి తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం తరపున ప్రతిపాదనలు సమర్పించడమైనది.
ప్రతిపాదనలలో ముఖ్య అంశాలు:-

ప్రస్తుతం మాదిరిగానే మాస్టర్ స్కేల్ విధానాన్ని కొనసాగించాలని, 80 స్టేజీలు 32 గ్రేడ్లతో పే స్కేలు ఉండాలని తెలియజేయనైనది.

ప్రస్తుత మూల వేతనమునకు 2023 జూలై నాటికి గల డిఏ 33.76% మరియు 40 శాతం ఫిట్మెంట్తో కలిపి నూతన వేతనాలు నిర్ణయించాలని టీయూటీఎఫ్ ప్రతిపాదించడం జరిగినది.

కనీస వేతనం 33000 ,గరిష్ట వేతనము 2,99,480 గ నిర్ణయించాలని ప్రతిపాదించడం జరిగింది.

ఎస్జిటిలకు 57010- 175150, స్కూల్ అసిస్టెంట్ కు 73820-210260, ప్రధానోపాధ్యాయులకు 95570-245720 స్కేలు ప్రతిపాదించడం జరిగింది.

ఇంటి అద్దె సిలింగ్ లేకుండా హైదరాబాద్ కు 27%, కార్పొరేషన్లకు 18.5% , జిల్లా కేంద్రాలకు జనాభా సంఖ్య తో నిమిత్తం లేకుండా 17%, మున్సిపాలిటీలకు 14 శాతం, గ్రామాలకు 13 శాతం చొప్పున నిర్ణయించాలి.

కారుణ్య నియామకాలకు అర్హులు లేనిచో ఆయా కుటుంబాలకు 10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి.

ప్రతిష్టాత్మకమైన నగదు రహిత హెల్త్ స్కీమును ప్రవేశ పెట్టాలని,అట్టి హెల్త్ స్కీమును ఎయిడెడ్/ మోడల్/ రెసిడెన్షియల్ /కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులకు వర్తింపజేయాలి.

కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ స్కేల్ లో మినిమం పే ను వేతనంగా నిర్ణయించాలని కోరడం జరిగింది.

ఉపాధ్యాయులకు సంవత్సరానికి 20 ఈఎల్స్,30 అర్ధ వేతన సెలవులను ఇవ్వాలి.

ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ కింద 5/ 10 /15 /20 /25 సంవత్సరాలకు ఒకసారి పదోన్నతి కల్పించాలి. గ్రాట్యూటి 24 లక్షలకు పెంచాలి. 01.09.2004 తరువాత నియామకమైన ఉద్యోగస్తులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.

వయసు సడలింపుచే ఉద్యోగంలో చేరిన వారు 15/20 సంవత్సరాల సర్వీస్ ను మాత్రమే చేస్తున్నారు.కావున సర్వీస్ తో సంబంధం లేకుండా వారి చివరి వేతనంలో 50% వేతనమును సర్వీస్ పెన్షన్ గా మంజూరు చేయాలి.

పిఆర్సి కమిషన్ చైర్మన్ ను కలిసిన వారిలో టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రఘునందన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జి.డేవిడ్, ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సోహెల్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు

భువనగిరి వెలుతురు మార్చి 02:

భువనగిరి మాజీ పార్లమెంటు సభ్యులు భారతీయ జనతా పార్టీ నాయకురాలు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గారి జన్మదిన సందర్భంగా వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది

యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా మహిళా నాయకురాలు బొమ్మగాని రాజమణి భువనగిరి కౌన్సిలర్ నల్ల మాస సుమ జంగం కవిత వైజయంతి దొంతిని సుమిత్ర రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు తదితరులు



సంపాదకీయం..

సమస్యల పరిష్కారంలో కానరాని చిత్తశుద్ధి!

బిజెపి పాలనలో ధరల పెరుగుదల, పన్నుల వాయింపు తప్ప మోడీ వల్ల కలిగిన లాభమేమిటో బిజెపి నేతలు చర్చించాలి. అదేపనిగా స్వామిభక్తి ప్రదర్శించి డబ్బా కొట్టడం మానుకోవాలి. గ్యాస్, పెట్రోలు ఉప్పులు పప్పులు, బియ్యం ధరలు, జిఎస్టీ రూపంలో పడుతున్న పన్నులు తదితర సమస్యలపై చర్చించ డంలో బిజెపి శ్రేణులు పూర్తిగా విఫలం అయ్యాయి. గ్యాస్, పెట్రో ధరలు కూడా ఇష్టం వచ్చినట్లుగా పెంచుతున్నారు. ఇందులో కిటుకేమిటంటే ...ప్రతిసారీ ఎన్నికలు అయ్యాక మెల్లగా పెంచడం అలవాటు చేసుకున్నారు. దీనినే దొంగదెబ్బతీయడం అంటారు. వేదాలు వల్లిస్తున్న బిజెపి నేతలు ఇలా దొంగదెబ్బ తీయడం అలవాటు చేసుకుంది. ఏ పని చేయకున్నా..జిఎస్టీ వాతలు, ధరల పెంపులో ఆరితేరింది. సమస్యల ను పరిష్కరించకుండా నాన్చివేయడంలోనూ దానిని మించిన పార్టీ మరోటి ఉండదు. దేశంలో ధరలు పెంచాల్సి వచ్చినప్పుడు ఎంత కటువుగా ఉంటున్నారో సమస్యలను పరిష్కరించే విషయంలోనూ అంతే కటువుగా ఉంటే మంచిది. సమస్యలను సమస్యలుగా చూడడం బిజెపి అలవాటు చేసుకోవాలి. పెట్రో, గ్యాస్ ధరలు సామాన్యులకు అందుబాటులోకి రావాలి. నదీజలాలు ప్రజలకు అందాలి. ఈ విధానం అవలంబించ కుంటే దేశం మరింతగా వెనక్కిపోతుందని గుర్తించాలి. విభజన సమస్యలు,నీటి పంపకాలు, విద్యుత్ సంకెళ్లు ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి నేతలు అమోఘమైన తెలివి తేటలతో రాజ్యం ఏలుతున్నారు. ఇంతగా దోఖా చేస్తున్న వీరు తెలుగు రాష్ట్రాల్లో పాగా వేయాలన్న లక్ష్యంతో దూకుడు పెంచారు. మరి వీరు సమస్యలపై మాట్లాడకుండా ఎదురుదాడితో వస్తున్నారు. కేవలం రాష్ట్రాల పాలనపై దుమ్మెత్తి పోయడం ద్వారా అధికారంలోకి రావడమే వీరి ప్రధాన ఎజెండగా మారింది. పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచడమే కాదు...దేశంలో నీటి సమస్యలను, విద్యుత్ సమస్యలను తీర్చడంలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. ఈ యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీనీటి కొరతకు సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని వస్తామని చెప్పిన మోడీ అందులో పూర్తిగా విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేధిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జలవిధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినియోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయరాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణ పూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు అప్పర్ భద్రకు అనుమతి ఇవ్వడంతో ఇప్పుడు రాయలసీమ ఎడారి అవుతుందన్న ఆందోళన వస్తోంది. అప్పర్ భద్రకు నిధులు కూడా కేటాయించారు. ఈ క్రమంలో ఎగువన కృష్ణాకు వరదలు వస్తే తప్ప దిగువున ఉన్న తెలుగు రాష్ట్రాలకు నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని ముమ్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థవంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదు. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా, రాష్ట్రాల వారీగా పునఃపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్ధాలకు అడ్డుకట్ట వేయాలి. నదీజలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని నదుల అనుసంధానానికి పూనుకోవాలి. ఆయా రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టును కేంద్రం పరిశీలించి జాతీయ జలవిధానం అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న కృష్ణానీటిని వాడుకునే సందర్భంగా ఇటీవల కృష్ణా యాజమాన్య బోర్డు తీర్పుతో అటు తెలంగాణ, ఇటు ఎపి కొంత అసహనం వ్యక్తం చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీరు ఎటు ఎంత పోతున్నదన్న ప్రశ్న ఉత్పన్నం కాలేదు. కానీ విభజన తరవాత ఇప్పుడు లెక్కలు పక్కాగా తీయడంతో తెలంగాణ వాటా దక్కించుకునే స్థితి వచ్చింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పిమ్మట సమస్యమరింత జటిలం అయ్యింది. కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాల్లో కొత్త వాటాదారు వచ్చినపుడు నదీ జలాల వాటాదారులందరికీ దామాషాగా తిరిగి తమతమ హక్కులెంతవరకో పునర్నిర్వచించాల్సి ఉంది.

అయితే ఇక్కడ ఆ న్యాయన్ని పాటించకుండా పాత రాష్ట్రంలో ఉన్న వాటాను ఇద్దరు పంచుకోవాలని చెప్పడం సరికాదు. ఎగువ రాష్ట్రాలను విడిచిపెట్టి, దిగువ రాష్ట్రాలను పాత లెక్కల్లోనే తేల్చుకోమనడం అన్యాయం కాక మరోటి కాదు. దీనిని పంచుకోవాల్సి వస్తే ట్రిబ్యునల్ అవసరమే లేదు. నిజానికి ఈ పంచాయితీలను కేంద్రం తెంచాలి. కానీ కేంద్రం గోడవాటం పిల్లిలాగా వ్యవహరిస్తోంది.

బిఆర్ఎస్‌కు, బిజెపిలకు చెక్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కేవలం మూడు నెలలే అవుతోంది. విపక్ష పార్టీల సవాళ్లను స్వీకరిస్తూనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నాల్లో సిఎం రేవంత్ రెడ్డి బృందం నిరంతరంగా కృషి చేస్తోంది. ఆడంబరాలకు పోకుండా, అనవసర ఖర్చులు చేయకుండా ఉన్నంతలో సమస్యలను పరిష్కరించడం ఎలా అన్నదిశగా పయనిస్తోంది. చేపడుతున్న కార్యక్రమాలకు మంచి స్పందన వస్తుండడంతో ఇకనేరుగా ప్రజల్లోకి వెళ్లాలని పిపిసి అధ్యక్షుడు రేవంత్ యోచిస్తున్నారు. ఈ క్రమంలో గడపగడపకూ బిఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాలను చేరవేయాలన్న ఆలోచనలో ఉన్నారు. దీనికి అనుగుణంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నేరుగా ప్రజల్లోకి వెళ్లడం ఉత్తమమని భావిస్తున్నట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా ప్రాజెక్టుల

అక్రమాలు, గత పాలకుల అవినీతి తదితర అంశాలను జోరుగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు చర్చిస్తున్నారు. అలాగే పదేళ్ల బిజెపి పాలనలో జరిగిన నష్టాలను కూడా లెక్కించే పనిలో ఉన్నారు. దీంతోపాటే కాంగ్రెస్ నేతలందరినీ ఒక్కతాటిపైకి తెచ్చే యత్నం కూడా చేయాలన్న సంకల్పంతో ఉన్నారు. ఈ క్రమంలోఅధికార బిర్ఎస్, బీజేపీలకు ధీటుగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు వేగవంతం చేసేందుకు కాంగ్రెస్ నేత పావులు కదుపుతున్నారు. అధికారంలోకి రావడానికి పార్టీకి కలిసొచ్చిన అంశాలను ముందుకు తీసుకుని వెళ్లడం ముఖ్యమని భావిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా అవతరించేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. ఈ పరిస్థితుల్లో క్షేత్ర స్థాయిలో క్యాడర్ ఉన్న కాంగ్రెస్‌లో కదలికను తీసుకువచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో కదలిక తీసుకుని రావాలని సిఎం అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచే ఈ ప్రయత్నం ఉంటుందనీ చెబుతున్నారు. 6న బహిరంగ సభ నిర్వాహించే అవకాశాలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో బిఆర్ఎస్‌కు ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకోవడమే ఉత్తమమని పలువురు నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేపట్టే యోచనలో సిఎం రేవంత్ ఉండగా... ముఖ్యనేతల భాగస్వామ్యం ఉండాలంటూ తెరపైకి డిమాండ్లు వస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో అంతా ఉమ్మడి పోరాటమనే భావన రావాలని చూస్తున్నారు. టీపీసీసీలో ఏకాభిప్రాయం రాకుంటే కెసిఆర్‌ను ఎదుర్కోవడం కష్టమని, దీనిని అలుసుగా తీసుకుని బిఆర్ఎస్ విమర్శలు గుప్పించ గలదని బావిస్తున్నారు. జోరుగా ప్రచార కార్యక్రమాలు చేపడితేనే కార్యకర్తల్లో ఉత్సాహం, పార్టీలో కదలికా వస్తుందని నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ నేతలంతా కలిసి కట్టుగా ఉన్నారన్న సంకేతం జనంలోకి పంపేందుకు ముఖ్యనేతలు అందరూ ఎవరికి ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో వారు పాదయాత్ర చేపట్టాలన్న వాదననూ కొందరు నేతలు తెస్తున్నారు.

చంద్రయాన్-3 ఆవిష్కరణలు

భారత్ పంపిన చంద్రయాన్- 3 మిషన్ స్పేస్ క్రాఫ్ట్‌లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు చంద్రుడిపై 10 రోజుల పాటు డేటా, ఫోటోల సేకరణ జరిపి వాటిని పరిశీలన కోసం భూమికి పంపాయి. ల్యాండర్- రోవర్‌లు పని చేయడానికి అవసరమైన బ్యాటరీలు ఛార్జ్ అవడానికి సూర్యరశ్మి అవసరం. దక్షిణ ధ్రువంపై పగటి సమయం ముగియడంతో గత ఏడాది సెప్టెంబర్ తొలి వారంలో విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లను ఇస్రో స్లీప్ మోడ్‌లోకి పంపింది. తిరిగి సెప్టెంబర్ 22వ తేదీన సూర్యోదయం అయ్యే సమయాన రెండూ తిరిగి యాక్టివ్ అవుతాయని ఇస్రో శాస్త్రవేత్తలు ఆశించారు. ల్యాండర్

చంద్రుడిపై దిగిన క్షణం నుంచి విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు తీసిన చిత్రాలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇస్రో సోషల్ మీడియా వేదికగా ప్రజలకు అందజేసింది. ఈ చిత్రాలు చాలా మంది భారతీయుల్లో సరికొత్త ఆసక్తిని రేకెత్తించాయి.

కొంత మంది మాత్రం ఈ సమాచారం ప్రాముఖ్యత ఏంటి, అవి ఎందుకు ఉపయోగపడతాయని ఆన్‌లైన్‌లో పరిశోధనలు ప్రారంభించారు. దీంతో నాసా పూర్వపు శాస్త్రవేత్త, ఢిల్లీకి చెందిన స్పేస్ ఎడ్యుకేషన్ సంస్థ కో ఫౌండర్ మిలా మిత్రా జాతీయ మీడియా సంస్థలతో మాట్లాడుతూ అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు. ప్రజ్ఞాన్ రోవర్‌ను స్లీప్ మోడ్‌లోకి పంపే కొన్ని గంటల ముందు ప్రజ్ఞాన్ రోవర్ 100 మీటర్లు (328 అడుగులు) పైగా ప్రయాణించింది. ఇంకా కొనసాగుతోంది అని ఇస్రో ట్వీట్ చేసింది. ప్రజ్ఞాన్ సెకనుకు 1 సెంటీ మీటర్ వేగంతో 6 చక్రాలతో చాలా దూరమే ప్రయాణించింది. దీని ప్రాముఖ్యాన్ని మిత్రా వివరిస్తూ, ఎవరూ ఎక్కువగా అన్వేషించని దక్షిణ ధ్రువ ప్రాంతంలో సంచరిస్తూ, బిలాల్లో పడిపోకుండా సురక్షితంగా రోవర్ ప్రయాణం చేసింది అని వెల్లడించారు. ఈ సందర్భంగా రోవర్‌కు అమర్చిన చక్రాలకు సంబంధించిన ప్రత్యేక అంశాలను మిత్రా వివరించారు. రూకర్ బూగీ అని పిలిచే మెకానిజాన్ని ఇందులో వినియోగించారు. అంటే ఆరు చక్రాలు ఒకేసారి కదలవు. దీని వల్ల రోవర్‌పైకి కిందకు కదిలేందుకు వీలవుతుంది. కానీ, ఒకవేళ లోతైన బిలంలో పడిపోతే పైకి రాలేకపోవచ్చు. అందువల్ల రోవర్‌ను నేలపై ఉన్న బిలాల చుట్టూ వెళ్లేలా చేయడం, లేదంటే దిశ మార్చుకునేలా చేయడం ముఖ్యం. కమాండ్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తలు రోవర్‌కు అమర్చిన కెమెరాల ద్వారా, అక్కడ నేలపై ఏముందో గమనిస్తూ రోవర్‌ను ముందుకు నడిపించారు. రోవర్ ఆటోమేటెడ్ కాదు. అది పంపే చిత్రాలను ఆధారం చేసుకుని, కమాండ్ సెంటర్ నుంచి నియంత్రించారు. రోవర్ పంపే ఫోటోలు కమాండ్ సెంటర్‌ను చేరుకోవడంలో కాస్త ఆలస్యం అవుతుంది.

ఎందుకంటే ప్రజ్ఞాన్ రోవర్ సమాచారాన్ని మొదట విక్రమ్ ల్యాండర్‌కు పంపుతుంది. ల్యాండర్ దానిని ఆర్బిటర్‌లోకి పంపుతుంది. ఆర్బిటర్ భూమికి చేరవేస్తుంది అని ఆమె తెలిపారు. కాబట్టి, ఆదేశాలు రోవర్‌ను చేరే సమయానికి అది బిలానికి కొన్ని అడుగుల దూరంలో మాత్రమే ఉంది.అయితే ప్రజ్ఞాన్ రోవర్ రెండు బిలాల మధ్య నుంచి సురక్షితంగా ప్రయాణం చేసి, కమాండ్ సెంటర్‌కు వేగంగా సమాచారం పంపిందని మిత్రా వివరించారు. ల్యాండర్ విక్రమ్‌కు అమర్చిన ప్రోబ్ చంద్రుడి ఉపరితలంపై ఉన్న మట్టితో పాటు, 10 సెంటీమీటర్ల లోతులో ఉన్న మట్టిని కూడా పరిశీలించింది. ఆ తరువాత తొలి దశ సమాచారాన్ని సేకరించి కమాండ్ సెంటర్‌కు పంపింది. ఈ సమాచారంలో చంద్రుడి ఉపరితలంపైనా, నేలలోపలఉన్న ఉష్ణోగ్రతల్లో గణనీయమైన వ్యత్యాసాలు కనిపించాయి. ఉపరితలంపై ఉష్ణోగ్రత 60 డిగ్రీలు ఉండగా, లోతుకు వెళ్లే కొద్దీ భారీగా పడిపోయింది.80 మిల్లీమీటర్ల లోతున ఉష్ణోగ్రత -10 డిగ్రీలకు పడిపోయింది. చంద్రుడిపై ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని నాసా ఇంతకు ముందే ప్రకటించింది.

ఆ ప్రకారం పగటిపూట చంద్రుడి భూమధ్య రేఖ సమీపాన ఉష్ణోగ్రత 120 డిగ్రీల సెల్సియస్, రాత్రి వేళ -130 డిగ్రీలు సెల్సియస్ పడిపోతుంది. శాశ్వతంగా సూర్యరశ్మి పడని బిలాల్లో ఉష్ణోగ్రత 250 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుంది. ఉష్ణోగ్రతల్లో ఉన్న ఈమార్పు చాలా కీలకమైనది మిత్రా అన్నారు. లూనార్ రిగోలిత్గా పిలిచే ఈ చంద్రుడి మీది మట్టిని మంచి ఇన్సులేటర్‌గా చెప్పవచ్చని అన్నారు. దీని ద్వారా ఏం తెలుసుకోవచ్చంటే వేడి, చలి, రేడియేషన్లను నిరోధించేందుకు ఈ మట్టిని ఉపయోగిస్తూ స్పేస్ కాలనీలను నిర్మించవచ్చు. అంతేకాకుండా, నేలలోపల నీటి ఉనికి ఉందనడానికి ఇది ఒక సూచన అని అన్నారు.చంద్రుడి దక్షిణ ధ్రువపు ఉపరితలంలో ఉన్న మూలకాల ఉనికిని తెలుసుకునేందుకు రోవర్ లేజర్ డిటెక్టర్‌ను అమర్చారు. ఈ లేజర్ డిటెక్టర్ ద్వారా ఉపరితలంలో అల్యూమియం, కాల్షియం, ఐరన్, క్రోమియం, టైటానియం, మాంగనీస్, సిలికాన్, ఆక్సిజన్ మూలకాలు ఉన్నాయని గుర్తించారు. అన్నిటికన్నా ముఖ్యమైనది సల్ఫర్ ఉనికిని నిర్ధారించడమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తొలిసారిగా చంద్రుడి ఉపరితలంలో సల్ఫర్ ఉనికిని గుర్తించామని ఇస్రో పేర్కొంది. చంద్రుడిపై సల్ఫర్ ఉనికి గురించి 1970లలోనే తెలుసు. అయితే, రోవర్ చంద్రుడి నేలపై ఉన్న ఖనిజం లేదా స్ఫటికంలోని భాగంలో ఉన్న సల్ఫర్‌ను కాకుండా, చంద్రుడి ఉపరితలంపైనే సల్ఫర్ ఉన్నట్లు గుర్తించడం అద్భుతమైన విషయంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మట్టిలో సల్ఫర్ ఉనికిని కనుక్కోవడం వివిధ కోణాలలో కీలకమైన అంశం. సాధారణంగా అగ్నిపర్వతాలనుంచే సల్ఫర్ వెలువడుతుంది. దీనిని బట్టి మనకు చంద్రుడి ఆవిర్భావం, భౌగోళిక పరిస్థితులు, పరిణామక్రమంపై సమాచారం తెలుస్తుందిఅని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇది మాత్రమే కాకుండా సల్ఫర్ కనిపించడమంటే చంద్రుడి ఉపరితలంపై నీటి ఉనికికి ఒక సూచిక.సల్ఫర్ సహజ ఎరువు. ఇక్కడ మరో మంచి విషయం ఏంటంటే చంద్రుడిపై సహజంగా మొక్కలు పెరగడానికి సల్ఫర్ పని కొస్తుంది.

ప్రకంపనలను రికార్డు చేసి విశ్లేషించే సామర్థ్యం ఉన్న ఇల్సా అనే పరికరాన్ని విక్రమ్ ల్యాండర్‌లో అమర్చారు. ఇది విక్రమ్ ల్యాండర్‌తో పాటు, రోవర్ కదలికలు, కార్యకలాపాల సమాచారాన్ని కూడా విశ్లేషిస్తుంది. చంద్రుడి నేలలోని మార్పులను గమనించే ఇల్సా పరికరం ఒక విశేషమైన ఘటనను రికార్డు చేసింది. అదే చంద్రుడిపై ప్రకంపనలకు ప్రధాన కారణం.

ఈ సంఘటనకు చాలా ప్రాధాన్యత ఉంది.దీనికి చాలా వివరణలు, విశ్లేషణలు కూడా చాలా ఉండొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బహుశా అంతరిక్ష శిథిలాలు, గ్రహకలం, ఉల్క వంటివి చంద్రుడి ఉపరితలాన్ని బలంగా ఢీ కొట్టడం వల్ల ఈ ప్రకంపనలు ఏర్పడి ఉండొచ్చు. లేదంటే సహజంగానే ఏర్పడి ఉండవచ్చు. 1970ల తర్వాత నమోదైన తొలి ప్రకంపనగా దీన్ని భావించవచ్చు. చంద్రుడి ఉపరితలం కింద ఏముంది? భౌగోళిక స్థితి ఎలా ఉంది? అన్న విషయాలను పరిశోధించేందుకు ఇది ఉపయోగపడవచ్చు.

రష్యా ఊహకు అందనంతగా

ఉక్రెయిన్ ప్రతిఘటన!

రెండేళ్లయినా రష్యా అడపాదడపా తన దాడులను ఇంకా కొనసాగిస్ఊతనే ఉంది. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముగింపు పలికి ప్రజలను స్వేచ్ఛగా బతికించడంలో రష్యా ముందుకు రావడం లేదు. అందుకే ఉక్రెయిన్ కూడా గట్టిగానే జవాబిస్తూ వస్తోంది. ఉక్రెయిన్‌పై దాడి ఇంత భయంకరంగా ఉంటుందని బహుషా రష్యా కూడా ఊహించి ఉండదు. ఒకటి రెండురోజుల్లో సునాయాసంగా ఉక్రెయిన్‌ను ఆక్రమించుకోవచ్చన్న పుతిన్ అంచనాలు తలకిందుల య్యాయి. రెండేళ్లు దాటినా ఉక్రెయిన్‌ను దారికి తెచ్చుకోలేక పోయింది. రష్యా దాడులకు ధీటుగా ఏడాదిగా ఉక్రెయిన్ ఎదురుదాడి చేస్తూనే ఉంది. తన దేశ అస్థిత్వాన్ని కాపాడుకుంటూనే రష్యాను గట్టిగా ఢీకొంటోంది. మరోవైపు అమెరికా తదితరదేశాలు కూడా మద్దతును పెంచుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంతో నష్టపోతున్న దేశాలు కూడా మెల్లగా గొంతువిప్పి రష్యా తీరును ఎండగడుతున్నాయి. రష్యాలో కూడా ఈ యుద్ధం పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. మరోవైపు రష్యా సైనికులు వేలల్లో మరణిస్తున్నారు. ఈ క్రమంలో మెల్లగా ప్రపంచ దేశాలన్నీ ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. అలాగే సైనిక సాయం అందించేందుకు ముందుకు వస్తున్నాయి. పరిస్థితులు చేజారుతాయన్న భయంతో ఆయా దేశాలు కొంత వెనకడుగు వేస్తున్నాయి. లేకపోతే ఈ పాటికి ఉక్రెయిన్‌కు మద్దతుగా అనేక దేశాలు యుద్ధరంగంలోకి దిగేవే. అలాగే ఆర్థిక ఆంక్షల కారణంగా రష్యా ఆర్థిక వ్యవస్థ కూడా కుదేలవుతోంది. అణుబాంబు బూచి చూపుతున్న పుతిన్ ..ప్రపంచంలో తన ప్రతిభను పూర్తిగా కోల్పోయారు. ఆయా దేశాలు ఇప్పుడు పుతిన్‌ను చూసి ఏవగించుకుంటున్నాయి. పుతిన్ కూడా బహుశా
యుద్ధం ఇంత దారుణంగా ఉంటుందని ఊహించి ఉండరు.ఒకటి రెండురోజుల్లో ఉక్రెయిన్ దారికి వస్తుందని కదనరంగంలోకి దిగి ఉంటారు. కాకపోతే అంత ఈజీ కాదని ఇప్పుడు తెలిసి ఉంటుంది. మరోవైపు తమ లక్ష్యం పూర్తయ్యేదాకా సైనిక ఆపరేషన్ కొనసాగుతుందని రష్యా ప్రకటించింది.

అడపాదడపా దాడులతో భయపెడుతూనే ఉంది. అయితే పరిస్థితులు ఎలా ఉన్నా ఉక్రెయిన్ మాత్రం బాగా దెబ్బతింది. దీన్ని పునర్నించుకోవడం ఇప్పట్లో సాధ్యం అయ్యే పనికాదు. తమను ఒంటరి చేయొద్దని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రపంచ దేశాలను ఇప్పటికే వేడుకున్నారు. ఉక్రెయిన్‌కు ఇయు సాయం కావాలని కోరారు. అణు యుద్ధం వచ్చే ప్రమాదముందని, దీనిని ఎదుర్కొనేందుకు అణు దళాలు అప్రమత్తంగా ఉండాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. మూడో ప్రపంచ యుద్ధం తప్పదని అంతా భావించారు. కానీ అది రాష్యాకు కూడా ప్రమాదమని రష్యాన్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇకపోతే పుతిన్ మరింత పట్టుదలగా ఉక్రెయిన్‌ను దెబ్బతీయాలని చూస్తున్నారు. పౌరులు చనిపోతున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. అందుకే ప్రధాన నగరాలను స్వాధీనం చేసుకునే క్రమంలో వరుస రాకెట్ దాడులు, పేలుళ్లతో ఉక్రెయిన్ రగులుతోంది. పశ్చిమ దేశాల నుంచి పొంచివున్న ప్రమాదాలను తిప్పికొట్టే క్రమంలో తనను తాను రక్షించు కునేందుకు అవసరమైన ప్రధాన లక్ష్యాన్ని చేరుకునే వరకూ ఉక్రెయిన్‌లో చేపట్టిన ప్రత్యేక సైనిక ఆపరేషన్ కొనసాగుతుందని రష్యా రక్షణ శాఖ మంత్రి తెలిపారు. పశ్చిమ దేశాల నుంచి పొంచివున్న సైనిక పరమైన ముప్పు నుంచి రక్షించు కోవడమే రష్యా ముందున్న ప్రధానలక్ష్యం. మా దేశంపై పోరాడేందుకు పశ్చిమ దేశాలు ఉక్రెయిన్ ప్రజానీకాన్ని పావుగా వాడుకోవాలని చూస్తున్నాయి.

ఈ దుర్మార్గాన్ని సహించం. ఈ ముప్పును తిప్పికొట్టేదాకా ఆపరేషన్ కొనసాగుతుందని తెలిపారు. అయితే ఏడాదిగా ఇప్పటికే ఇరు దేశాలు ఎంతో నష్టపోయాయి. ఉక్రెయిన్‌లో తక్షణమే యుద్ధాన్ని నిలిపేయాల్సిన అవసరం ఉంది. ఇరుదేశాల నాయకులు శాంతిమార్గం పట్టాలి. పుతిన్‌ను ప్రపంచం ఏకాకి చేయాలని బైడెన్ పిలుపు ఇచ్చారు. అప్పటి వరకు ఉక్రెయిన్ బిక్కుబిక్కుమంటూనే పోరాడుతోంది. ఇది ఎంతకాలం అన్నది చూడాలి. రష్యా కూడా ఇది ఎంత తొందరగా యుద్ధాన్ని ముగిస్తే అంతమంచిదే.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ పార్టీ
యువ నాయకుడు శ్రీశైలం యాదవ్

శంకర్‌పల్లి, మార్చి 2 (వెలుతురు): శంకర్‌పల్లి మండల పరిధిలోని మాసాని గూడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువ నాయకుడు శ్రీశైలం యాదవ్ శనివారం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. సునీత మహేందర్ రెడ్డి మరియు భీమ్ భరత సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 11 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో సరైన గుర్తింపు లేనందు వల్లనే కాంగ్రెస్ పార్టీలో చేరానని శ్రీశైలం యాదవ్ తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, తన కష్టానికి తగిన విలువ గుర్తింపు ఆ పార్టీలో లేనందు వల్లనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. ఏ పార్టీలో ఉన్న ప్రజల సమస్యల పరిష్కారం దిశగా తన అడుగులు ముందుకు వెళ్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, సీనియర్ నాయకులు ధర్మన్న గారి వెంకట్ రెడ్డి, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడుని కోల్పోవడం బాధాకరం
డాక్టర్ చెరుకు సుధాకర్

రామన్నపేట, వెలుతురు న్యూస్: యాదాద్రి జిల్లా రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన గడ్డం స్వామి అనే ఉద్యమకారుడు ఇటీవల కాలంలో మరణించడం బాధాకరమని స్వామి మరణం తీరని లోటని ఆయన సంతాప సభలో మాట్లాడుతూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు అర్పించిన తెలంగాణ ఉద్యమకారుడు సామాజికవేత్త ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ చెరుకు సుధాకర్ శనివారం

లక్ష్మాపురం గ్రామంలో గడ్డం స్వామి సంతాప సభలో మాట్లాడుతూ అన్నారు. ఉద్యమ కారుడు గడ్డం స్వామి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విరోచితమైన పోరాటాలు చేసిన వ్యక్తిని డాక్టర్ చెరుకు సుధాకర్. కొనియాడారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశాడు.

ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు రాష్ట్ర నాయకులు ఎస్కే చాందు. ఉద్యమకారుల ఫోరం రామన్నపేట మండల అధ్యక్షులు నోముల శంకర్..సురేష్ గడ్డం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నేలరాలిన మరో గీతన్న
మారని గీత కార్మికుల బతుకులు
గాలికి వదిలేసిన సేఫ్టీ మోకుల కథ
ప్రాణాలు కోల్పోయిన కల్లు గీత కార్మికుడు
కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రాయగిరి కిష్టయ్య

రామన్నపేట, వెలుతురు న్యూస్: రామన్నపేట మండలంలోని సర్నేనిగూడెం గ్రామ నివాసి నీల నరసింహ 62 వయసు వృత్తిలో భాగంగా కల్లుగీయటానికి తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం జరిగింది.మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించడం జరిగింది. నర సింహకు భార్య ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రాగిరి కృష్ణయ్య సందర్శించి మృతుని కుటుం బానికి తక్షణమే 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజు మండల అధ్యక్షుడు ఎర్ర రవీందర్ కార్యదర్శి పులి బిక్షం మండల నాయకులు గంగాదేవి అంజయ్య,ఆకిటి శ్రీనివాస్, తనీషా కోరారు.

ప్రాచీన శివాలయ బ్రహ్మోత్సవాల ప్రచార రథం ప్రారంభం..

వెలుతురు న్యూస్ నారాయణపూర్:
ప్రాచీన ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ప్రచార రథాన్ని ప్రారంభించారు...అనంతరం పూజా కార్యక్రమాలు శివాలయ అధ్యక్షులు పాలకుర్లా యాదయ్య గౌడ్ విచ్చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర కు గ్రామ గ్రామ ల నుండి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పాలకుర్లా గిరి గౌడ్, శివాలయ ప్రధాన కార్యదర్శి పాలకుర్లా సతీష్ గౌడ్,కమిటీ సభ్యులు సురపల్లి జోహార్, సోమన బోయిన కృష్ణ కుమార్ యాదవ్,పాలకుర్లా వెంకటేష్, బద్దం లింగస్వామి,చిలివేరు అంజయ్య, అచ్చిని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకతాటిపైకి తుర్కయంజాల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు
అభివృద్ధికి కృషి చేయాలి
చైర్‌పర్సన్ అనురాధ రెడ్డి

తుర్కయంజాల్,వెలుతురు:
తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కృషి చేయాలని చైర్పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూరు గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైస్ చైర్ పర్సన్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 5వ తేదీన నిర్వహించే కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు గైర్హాజరు అవ్వడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం ఒకరిపై ఒకరు మాట్లాడుకోవడం సహజమని, పార్టీ కౌన్సిలర్లు ఒక తాటిపై కి వచ్చి అభివృద్ధి చేయాలన్నారు.

మున్సిపాలిటీనీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు నాలుగు సంవత్సరాలు ఎంతగానో కృషి చేశారని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్రెడ్డి రామిరెడ్డి, వైస్ చైర్ పర్సన్ హరిత ధనరాజ్ గౌడ్, టిపిసిసి కార్యవర్గ సభ్యులు కొత్త కురుమ శివకుమార్, ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, కౌన్సిలర్లు కాకుమాను సునీల్, కంబాలపల్లి ధనరాజ్, నారని కవిత గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంట గోపాల్ రెడ్డి, మేతరి దర్శన్, గుండా ధనరాజ్, రేవల్ల యాదగిరి, బొక్క వంశి రెడ్డి, గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో ఘనంగా ఏఐఎంఐఎం
66వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

జహీరాబాద్, 02 మార్చి, వెలుతురు :
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పునరుద్ధరణ జరిగి 66 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు ముహమ్మద్ అత్తర్ అహ్మద్ ఆధ్వర్యంలో జహీరాబాద్ గెస్ట్ హౌస్ ఎదుట పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మజ్లిస్ పార్టీ 66 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ హఫ్రజ్ అబ్దుల్ వాహెద్ ఒవైసీ న్యాయవాది, మాజీ అధ్యక్షులు మరియు సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ సీనియర్ పార్ల మెంటేరియన్, మాజీ అధ్యక్షులు మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీని బలోపేతం, విజయవంతం చేయడంలో ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ జాతీయ అధ్యక్షులు హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ 'ల యొక్క అపూర్వమైన త్యాగాలను, పనితీరును ప్రజలకు తెలియజేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మజ్లిస్ పార్టీ అటు పార్లమెంట్ లో ఇటు తెలంగాణ శాసనసభలో కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు. మజ్లిస్ ఇత్తెహాద్ ముస్లిమీన్ పార్టీ విజయం కోసం, సభ్యుల ఆరోగ్యం కోసం ఈ సందర్భంగా ప్రార్థించారు. బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల చేతులను బలోపేతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్ని కలలో మజ్లిస్ పార్టీ అభ్యర్థుల విజయానికి మరియు ముఖ్యంగా హైదరాబాద్ స్థానానికి బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీకు భారీ మెజారిటీతో గెలిపించి బాబా సాహెబ్ అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగాన్ని కాపాడే శక్తిని కల్పించాలని కోరారు. ఈ కార్య క్రమంలో మాజీ పురపాలక సంఘం వైస్ చైర్మన్ అజ్మత్ పాషా, ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, సంయుక్త కార్యదర్శులు ఆమెర్ బిన్ అబ్దుల్లా, షోయెబ్, షేక్ ఇలియాజ్, వివిధ వార్డుల అధ్యక్షులు షఫి, ముజీబ్, రహిమ్, అయ్యూబ్, సయ్యద్ మ్నెహ్సిన్, యూనుస్, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు భే ఖాతర్...
జోరుగా అక్రమ మట్టి రవాణా
దిశానిర్దేశం లేని అనుమతి పత్రాలతో మట్టి తరలిస్తున్న వ్యాపారులు
చోద్యం చూస్తున్న అధికారులు
సమాచారం ఉన్నా స్పందించని వైనం

కొల్చారం, 2 మార్చి 2024(వెలుతురు న్యూస్):
కలెక్టర్ ఆదేశాలను భే ఖాతరు చేసి మట్టి అక్రమ రవాణా చేస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన మండలాధికారులు చేష్టలుడిగి చోద్యం చూస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. మెదక్ జిల్లా కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని 30/29 సర్వేనెంబర్ గల భూమి నుండి పాపన్నపేట మండలం నాగ్సన్ పల్లి గ్రామ శివారు ప్రాంతమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాత ఆలయ ప్రాంగణానికి శుక్రవారం అర్ధరాత్రి నుండి శనివారం మధ్యాహ్నం వరకు యతేచ్ఛగా అక్రమ మట్టి రవాణా కొనసాగింది. ఈ విషయమై కొల్చారం తహసిల్దార్ గఫర్ మియాను ప్రశ్నించగా తలా తోక లేని అనుమతి పత్రాలను



చూయిస్తూ ఈ విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చిందని, వెంటనే తగిన చర్య తీసుకుంటానని చెప్పి, ఎటువంటి చర్యలు లేకుండా మట్టి తరలించిన వాహనాలను వదిలివేయడం కొసమెరుపు. అనుమతి పత్రాన్ని పరిశీలించి చూడగా 1000 మిలియన్ టన్నుల మొరం తవ్వుకొనవచ్చునని, అనుమతించిన పరిమాణం పూర్తి కాగానే వారం లోపల సంబంధిత బిల్లులతో సహా అనుమతి పత్రాన్ని వాపసు చేయాలని ఉన్నప్పటికీ, మట్టిని ఎక్కడికి తరలించాలి, ఏ వాహనాలకు అనుమతి ఉంది, ఏ సమయంలో మట్టి తవ్వాలి అన్న వివరాలు ఏవీ లేవు.

ఇదిలా ఉండగా అనుమతి పొందిన వాహనాలు ప్రతి ట్రిప్పు తూకం వేయించిన వే బిల్లులు ఏవీ లేకపోవడం గమనార్హం. శు క్రవారం అర్ధరాత్రి నుండి మట్టిని తరలిస్తున్నా ఇప్పటివరకు ఎంత పరిమాణంలో మట్టిని తరలించారు అన్న లెక్క పత్రం అధికారుల దగ్గర లేకపోగా మట్టి తరలించిన వాహనాలను ఎటువంటి చర్యలు లేకుండా వదిలివేయడం పలు అనుమానాలకు దారితీస్తోంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

రామన్నపేట యాదాద్రి జిల్లా,వెలుతురు న్యూస్:
నకిరేకల్ నియోజకవర్గం రామన్నపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వ ర్యంలో ఆరు గ్యారంటీలు అమలులో బాగంగా మరో రెండు పథకాలు గృహ జ్యోతి, 200 యూనిట్స్ ఉచిత కరెంట్ మరియు ఐదు వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ అమలు చేసినందుకు, నిరుద్యోగులకు డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించిన సందర్భంగా మండల కేంద్రంలో సుభాష్ సెంటర్ దగ్గర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి కాంగ్రెస్ మండల నాయకులు పాలాభిషేకం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకట రాజిరెడ్డి ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, మండల కాంగ్రెస్ నాయకులు ఆకవరపు మధుబాబు, మహమ్మద్ నాజర్ ,రాయిని రమేష్ ,సాల్వేర్ లింగం, అయ్యాడపు నర్సిరెడ్డి ,ఆముదా లక్ష్మణ్, గర్దాసు సురేష్, జిల్లా వెంకటేశం, కోట సుధాకర్, బషీర్ దౌల కృష్ణ, గొలుసుల ప్రసాద్, కొమ్ము శేఖర్ ,సొల్లేటి పాండురంగ చారి బైరగోని రమేష్, గంగాపురం

శంకర్, పల్లెపు రవి, బట్టే సంతోష్ కుమార్, మోటి మహేష్, కేసుదాసు, ఉదయం ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శిగా ఐలబోయిన రమేష్ యాదవ్ నియామకం

హైదరాబాద్ వెలుతురు మార్చి 02:
అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శిగా ఐలబోయిన రమేష్ యాదవ్ ను నియమించారు. హైదరాబాద్ లోని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి రాజబోయిన లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు బద్దుల బాబురావు యాదవ్ లు నియామక పత్రాన్ని రమేష్ యాదవ్ కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమేష్ యాదవ్ సేవలను గుర్తించి జాతీయ కార్యదర్శిగా నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో రాష్ట్ర యువత అధ్యక్షునిగా యాదవ జాతికి అభివృద్ధి కోసం రమేష్ యాదవ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల రాజేందర్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మల్లేష్ యాదవ్, శ్రీహరి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, నగర అధ్యక్షులు మహేందర్ యాదవ్, యాదవ నాయకులు ప్రశాంత్ యాదవ్, మణి యాదవ్, శ్రీ రాములు యాదవ్, అయిలయ్య యాదవ్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బీరంగూడ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ నూతన ఉత్సవ కమిటీ

బీరంగూడ వెలుతురు మార్చి 02:
అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ నూతన ఉత్సవ కమిటీ ఏర్పాటైన సందర్భంగా దేవాలయ కమిటీ ఛైర్మన్ బి సుధాకర్ యాదవ్



గారికి, పాలకమండలి సభ్యులు అరుణ నరేందర్ రెడ్డి, నిర్మల రమేష్ యాదవ్, గొల్ల మల్లేష్ యాదవ్, ఆశగారి లక్ష్మణ్, లక్ష్మీకాంతరావు, చంద్రశేఖర్, కుమ్మరి మహేష్, గోక మహిపాల్ రెడ్డి, దీపక్ గౌడ్, ఎల్వర్తి మల్లేష్ యాదవ్, బోయిని పెద్దులు, జనుముల శ్రీనివాస్, కుంచం ఎల్లయ్య గార్లకు శుభాకాంక్షలు తెలిపి వారిని సన్మానించిన పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ గారు

హైదరాబాద్ వెలుతురు మార్చి 02:
శనివారం రోజున మన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారు షరే గేట్ లో ని రేషన్ షాప్ తానికి చేసారు..షాప్ నెం: 496 యజమాని దీన్ అలీ నే ప్రశ్నంచారు, రేషన్ కార్డ్ హెూల్డర్స్ కి రావాలిసిన సరుకులు సక్రమంగా అందుతునాయ లేధా అంటే నెలలో 15 రోజుల రేషన్ షాప్ తెరచి ఉంచుతునరా లేధా, అంటే, సెంట్రల్ గవర్నమెంట్ ఈస్తున సాన బియ్యం ఇస్తున్నారా అంటే అద్దెగారు, రేషన్ షాప్ ఓనర్ గాథ సమాచార కాలంలో అపుడు సాన బేయం రావటం లేదు అనే చెప్పాడు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మన్సూర్, సయ్యద్, ముజఫర్, అబ్దుల్లా, మహేష్, అనీష్, అభిషేక్, హితేష్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

"రెండు వందల యూనిట్లు ఫ్రీ కరెంట్" అమలు

లబ్ధిదారులకు జీరో కరెంటు బిల్లులు అందజేసిన కాంగ్రెస్ నాయకులు

కొల్చారం 2 మార్చ్ 2024(వెలుతురు న్యూస్):
మండల కేంద్రమయిన కొల్చారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు వందల యూనిట్లు ఫ్రీ కరెంట్ పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారు మల్లేశం గౌడ్ ఇతర కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగా జీరో బిల్లును అందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ ముందు 6 గ్యారంటీలకు మాటిచ్చి ఇప్పుడు వాటిని అమలుపరుస్తూ మాట నిలబెట్టుకున్నదన్నారు.
గత పాలకులు ఇచ్చిన హామీలను పదేళ్లు అధికారంలో ఉండి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని,
గోర్రెలు, బర్రెలు, చాపల చెరువులు అంటూ నిరుద్యోగులను విస్మరించిన గత ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు తెలంగాణ ప్రజలకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ మాట నిలుపుకున్నారన్నారు. రేవంత్ రెడ్డి తాను ప్రమాణస్వీకారం చేసిన లాల్ బహదూర్ స్టేడియంలోనే నిరుద్యోగులకి నియమాక పత్రాలు అందజేసి గొప్ప మనసు చాటుకున్నారు.
ఉద్యోగులకి ఒకటో తారీకు నాడే జీతాలు వేసి కాంగ్రెస్ పార్టీ గొప్పతనాన్ని చాటుకున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు గెలిపించుకుని, తెలంగాణ గలాన్ని వినిపించి, సోనియా గాంధీకి కానుక ఇవ్వడానికి ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవన్న గారి శేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, అంసన్పల్లి మాజీ సర్పంచ్ మండ శ్రీనివాస్, మెదక్ ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఆది నాగేశ్వరరావు, కొల్చారం గ్రామ శాఖ అధ్యక్షులు మాజీ సర్పంచ్ ఆశన్నగారి శ్రీశైలం, కొల్చారం మండలం మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు సయ్యద్ అక్రం, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ బాలరాజ్, గంధం కృష్ణ, ఎలక్ట్రికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా బి బి పాటిల్

జహీరాబాద్, 02 మార్చి, వెలుతురు :
ఉమ్మడి మెదక్ జిల్లా జహీరాబాద్ ఎంపీ బిజెపి అభ్యర్థిగా బిబి పాటిల్ ను అధిష్టానం ప్రకటించింది. దీంతో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారో అనే దానిపై తెరపడింది. బి బి పాటిల్ 1955, నవంబర్ 1న హనుమాబాయ్ పాటిల్, బస్వాత్ రావు పాటిల్ దంపతులకు నిజామాబాద్ జిల్లా, సిర్పూర్ గ్రామంలో జన్మించారు. మహారాష్ట్రలోని పరభానీలోని మరాత్వాడా అగ్రికల్చర్ కాలేజీలో బిఎస్సీ అగ్రికలర్చర్ చదివిన పాటిల్ వ్యవసాయ, వ్యాపారరంగాల్లో పనిచేశారు.

రాజకీయ జీవితం ప్రారంభం :

2014లో తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరిన పాటిల్, ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాడు. 2014 మే నెలలో జహీరాబాద్ నియోజకవర్గం నుంచి 16 లోక్‌సభకు పోటీచేసి కాంగ్రెస్ పార్టీకి చెందిన సురేష్ కుమార్ షెట్కార్‌ను ఓడించి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2014, సెప్టెంబరు 1న రోడ్డు రవాణా – హైవేలు షిప్పింగ్ మంత్రిత్వ శాఖ కన్సల్టేటివ్ కమిటీ, హెూం వ్యవహారాలపై స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నియమించబడ్డారు.

అనంతరం 2019 మే నెలలో జరిగిన 17వ లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున పోటీ చేసి సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్ రావు పై 6166 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. 2019, సెప్టెంబరు 13న వ్యవసాయ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నియమించబడ్డారు. 2019, అక్టోబరు 9న పార్లమెంట్ సభ్యుల కమిటీ, ఆర్థిక మంత్రిత్వ శాఖ–కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా కూడా నియమించబడ్డారు. చాల రోజుల నుంచి వారు పార్టీ మారుతున్నారనే ఊహగానాలు ఉన్న క్రమంలో బీబీ పాటిల్ 2024 మార్చి 1న బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఢిల్లీలోని బీజేపీ జాతీయ కార్యాలయంలో కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. అదేవిదంగా శనివారం సాయంత్రం బీజేపీ అధిష్టానం ప్రకటించిన మొదటి జాబితాలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా వారు చోటు దక్కించుకొన్నారు.

శ్రీ శివాయ గురవేనమః
మాఘశుద్ధచరుర్ధశి మహాశివరాత్రి

ఆరోజు భక్తులందరూ కూడా పరమశివుని అత్యంత భక్తియుతంగా ఆరాధించే సుదినం సుభదినం

పౌరాణికంగాను.కథాసాహిత్యంలోను శివ భక్తుల ప్రాధాన్యంతో ఎంతో పరమపవిత్రంగాభావించే పండగలలో శివరాత్రి ఒకటి

శివుని లింగాకారంలో ఉపాసించడం పూజించడం మన సంప్రదాయం

లింగ అనేశబ్దానికి చిహ్నం అని అర్థం పరమాత్మ కు ప్రతీకగాఅర్చింపబడుతూ ఉంది

లీనంగమయతేతిలింగం అని వ్యుత్పత్తి

శివం అంటే మంగళం కళ్యాణం శ్రేయస్సు అనే అర్థాలు .పరమేశ్వరుడు మంగళ ప్రదాత

శివఅంటే పరమేశ్వరుడు శివా అంటే పార్వతి అమ్మవారు

భక్తులకు అంబతో కలిసిసాంబుడై దర్శనమిస్తాడు

అందుకే సాంబశివుడు అంటారు.

నిరాకారుడు నిరాకారుడు సమస్త జగత్తు దేనిలో లీనమై ఉన్నదో అదే శివలింగం

అంతే కాక శివుడు పంచభూతాలలో లింగ రూపమై వెలశాడు

మాఘకృష్ణచతుర్దశ్యాం
మాదిదేవో మహానిశి
శివలింగతమోద్భూతః
కోటిసూర్య సమప్రభః

మాఘశుద్ధచతుర్దశి అర్ధరాత్రి లింగోద్భవం జరిగింది అని శాస్త్ర వచనం బ్రహ్మ విష్ణువు లకు శివగీతను ఈరోజునే ఉపదేశించాడు శివగీత ఉపదేశకాలమే లింగోద్భవకాలం అని చెబుతారు పెద్దలు

మ అఘ అంటే పాపంలేని మాసం మఘ అంటే యజ్ఞం శివుడు చేసే యజ్ఞం లయం .జీవులను సృష్టినుండి తప్పించే వాడు. లయకారకుడు అందుకే మొక్ష ప్రదాత అని అర్థం

మనకు ప్రతీనెల శివరాత్రి వస్తుంది. కృష్ణపక్షచతుర్దశిని మాసశివరాత్రి అంటారు..

అన్ని పవిత్రమైవే.శివారాధన కుతగినవే

మాఘమాసంలోని చతుర్దశి నాడు వచ్చే మహాశివరాత్రి విశేషం ఏమిటంటే అన్ని పండగలు పగటిపూట జరుపుతున్నారు

మహాశివరాత్రి ప్రధానంగా రాత్రి పూటజరుపుకోవడం విశేషం. ఆద్యంతరహితానికి సంకేతం శివలింగం ఈశివలింగా ర్చన వల్ల శివాభిషేకం చేయడం వల్ల అపారమైన అజ్ఞాన తమస్సు నశిస్తుంది.

సూర్యాదిజ్యోతిర్మండలకే మూలకాంతియైన బ్రహ్మ జ్యోతి శివలింగం అలాంటి ఆ లింగార్చన చేసే పరమపవిత్ర పుణ్య కాలమే శివరాత్రి.

శివప్రీత్యర్థంశివరాత్రే శివపూజాం కరిష్యే అని మహాదేవుని మనసులో ధ్యానించి రోజంతా ఉపవాసం చేయడం రాత్రి జాగరణతోశివనామస్మరణతో శివగాథలతో శివశివా అంటూ గడపాలని పురాణాలు.సంధ్యాసమయంలో శివనామజపం పాపహరణం అని ఇలా శివరాత్రి రోజు గడపాలని పురాణాలు ప్రబోధిస్తూ ఉన్నాయి.

ఆది దేవుడు శివుడే విచిత్రంగా ఉన్న వేషం విభూషణాలు పాములు ఆభరణాలు కపాలకరముతో గజచర్మధారుడు స్మశాన వాసి .నెత్తిన నీళ్ళు పోసిన చాలు వరాలనిచ్చే వాడు గరళాన్నిమింగి లోకకల్యాణం గావించాడు.

అందుకే మ్రింగుమనె సర్వమంగళ మంగళసూత్రమ్ము నెంత మదినమ్మినదో అన్నాడు పోతన

సృష్టికర్త బ్రహ్మ
స్థితి కారకుడైన విష్ణువుసృష్టి పరిపాలన విధులు సర్వమంగళ కరుడైనశివుని యొక్కమూలతత్వంలో భాగాలే అంటువంటి శివుడు లింగరూపంలో భక్తులకు దర్శన మిచ్చారు కాలస్వరూపుడైన శివుడు చీకటి అనే అజ్ఞానాంధకారాన్ని తొలగించే దశలో అర్ధరాత్రి ఆవిర్భావించాడు..

శక్తి సమేతంగా పరబ్రహ్మ తత్వానికి రూపమే ఈ శివలింగం. శివుడికి మహాశివరాత్రి రోజున రాత్రి నాలుగు జాములలో రుద్రాభిషేకం చేయాలి

మొదటి జాములో శివుని పాలతో ,పద్మాలతో, ఋగ్వేదమంత్రాలతో,పులగం నైవేద్యంతో,

రెండో జాములో పెరుగుతో తులసీదళాలలో యజుర్వేద మంత్రాలతో,క్షీరాన్నంతో..

మూడవజాములో నెయ్యితో మారేడుదళాలతో సామవేద మంత్రాలతో నువ్వులతో చేసిన నైవేద్యం.

నాలుగో జామున తేనెతో నల్లకలువలతో అధర్వణవేద మంత్రాలు అన్నం నైవేద్యం.

ఈ నాలుగు జాములలో పూజచేసినా దర్శించినా సర్వశుభాలు చేకూరుతాయి.

ఉపవాసం అంటే ఆహారం మానడం కాదుభగవంతుని సన్నిధిలో నివసించడమే ఎప్పుడూ బుద్ధిని ప్రాపంచిక విషయాల నుండి మరల్చడమేఉపవాస అంతరార్థం..

మనలో ప్రవేశించిన అరిషడ్వర్గాన్ని భగవద్దత్తమైన దైవీతత్వాన్ని నిర్మూలించకుండా నిరంతరం జాగ్రదవస్థలో ఉండడమే జాగరణ

స్వధర్మ స్వగుణములను తొలగించి ఆత్మజ్యోతిని వెలిగించి చుట్టూ ఉన్న అజ్ఞానాంధకారాన్ని తొలగింపజేసుకోవడమే.జాగరణ

ధూర్జటి ఒకపద్యంలో

ఏవేదంబు పఠించెలూత భుజగంబేశాస్త్ర ముల్ సూచెతా

నేవిద్యాభ్యసనంబొనర్చెకరి చెంచే...
కాళహస్తీశ్వరా!

భోళాశంకరున్ని పూజించి మూగజీవులే ముక్తి ని పొందాయి మనం పొందలేమా అంటాడు..

భక్తకన్నప్పను శంకరాచార్యులు భక్తిఃకిన్నకరోత్యహెూ వనచరో భక్తావతంసాయతే

నిశ్చలమైన భక్తి ఎంతో గొప్పది ఆటవికుడైన తిన్నడిని భక్తి అగ్రస్థానంలో నిలిపింది

మహాశివరాత్రి పర్వదినం శివపంచాక్షరి శివనామస్మరణతో గడపడం వల్ల సర్వశుభాలు చేకూరును.ధూర్జటి కాళహస్తీశ్వరా శతకంలో

పవిపుష్పంబగు...,
కాళహస్తీశ్వరా!!

రకరకాలుగా శివనామస్మరణలో రహస్యం తెలిపారు. శివరాత్రి రోజున ఏకబిల్వం అర్పించి పూజించాలి.

అలంకారప్రియుడు విష్ణువు
అభిషేకప్రియుడు శివుడు
చెంబెడు నీళ్ళు విభూది బిళ్వదళం ఇచ్చిన చాలు
ఎన్నో పుణ్యక్షేత్రాలలో ...శివారాధన విశిష్టత ఉంది.

స్కంధపురాణంలో కాశీక్షేత్రమహత్యం లో ఎన్నో విశేషాలు మహాశివరాత్రి గురించి చెప్పబడినవి

కన్నప్ప సాక్ష్యం..

కాళహస్తిలోని శివదర్శనం చేసిన ఎన్నో పాపాలు హరిస్తాయి

ఆ పరమేశ్వరుడు శుభంకరుడు భక్తవశంకరుడు శంకరుని పూజలో అపమృత్యు అరిష్టాలు గ్రహబాధలు పటాపంచలు ఐపోతాయి..

ఆమహాశివుని ఫాల భాగంలో నేత్ర రూపంలో అగ్ని
శిరోభాగాన శీతాంశుడు చల్లని కిరణం
కంఠంలో దారుణగరళం
హృదయభాగంలో కరుణామృతం

మెడలో సర్పహారం ఇలా భిన్న కోణాలు శివునిలో మనకు గోచరిస్తాయి..

మరొక్క విషమేమిటంటే

ధక్షిణభారతంలో శివాలయాలు ఎక్కువగా ఉంటడం విదేశాల్లో నుండి సైతం శివనామస్మరణ విశిష్టత దర్శన ప్రాశస్త్యాన్ని గుర్తించడం ఆచరించడం కాశీవంటి క్షేత్రాలలో మనం చూస్తూనే ఉన్నాం

కైలాస శిఖరం చూసినా మానస సరోవరం చూసిన పెద్దలు వారివారి. అనుభవాలు వివిధ కావ్యాలలో కథాకథనాలలో పుస్తకాలలో శివమయం చేశారు అంతటి ప్రశస్తి పొందినది శివారాధన..

తెలంగాణాలో సుప్రసిద్ధ శైవక్షేత్రాలలు వేములవాడ కాళేశ్వరం సిద్ధిపేటలో కోటిలింగాలు మొదలైన క్షేత్ర దర్శనాలు విశేషంగా జరగటం మనందరి అదృష్టం

సర్వం శివమయం జగత్
హరహర మహాదేవ

మంచినీళ్ళ సరస్వతీ రామశర్మ
సిద్ధిపేట
9963219641

ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి జిల్లా, (వెలుతురు):
పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండ బాధ్యతగా పని చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక ధరణి దరఖాస్తుల పరిశీలన, ప్రభుత్వ భూములు రక్షణపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరించాలి అనే విషయం పై ఆర్డీఓలకు, తహసీల్దార్లకు, ధరణి ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువు లోపల పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి ఆన్లైన్ లోనే కాకుండా ఫైల్స్ రూపంలో కూడా నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తిస్థాయిలో కలెక్టరేట్‌కు సమర్పించాలని అన్నారు. ప్రభుత్వం పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకై మార్చి 1వ తేదీ నుండి 9వ తేదీ వరకు పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినందున, చాల బాధ్యతతోపాటు వేగవంతంగా ఈ స్పెషల్ డ్రైవ్‌ను పూర్తి చేయాలన్నారు.
ప్రతి మండలంలోని గ్రామాల వారీగా ప్రభుత్వ భూముల వివరాలు ప్రతి తహసీల్దార్ వద్ద ఉండాలని, ధరణి దరఖస్తులను అందుబాటులో ఉన్న రికార్డుల ద్వారా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. మాడ్యూల వారీగా ప్రతి ఒక్కఱు అవగాహన కలిగి ఉండాలని, మీకు ప్రతి దరఖాస్తును పరిష్కరించేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ధరణి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ గొప్ప నాయకులు పీవీ నర్సింహారావు

తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్,మార్చి2(వెలుతురు): దేశం గర్వించదగ్గ గొప్ప నాయకులు మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహా రావు అని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల పీవీ నర్సింహా రావుకు భారతరత్న ప్రకటించిన సందర్భంగా శనివారం బేగంపేటలోని పీవీ నర్సింహారావు భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పీవీ నర్సింహా రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పీవీ ఫోటో ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడం దేశానికే గర్వకారణం అన్నారు. పీవీ నర్సింహా రావుకు భారతరత్న ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా లభించిన గౌరవం భారతరత్న అని పేర్కొన్నారు. మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ఎంతో విశేషమైన సేవలు అందించారని గుర్తుచేశారు.
ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధి అభివృద్ధిలోకి తీసుకొచ్చిన ఘనత కూడా పీవీకే దక్కుతుందన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రశంసలు అందుకున్నారని తెలిపారు.దేశ ప్రధానమంత్రిగా పని చేసిన ఏకైక తెలుగు వ్యక్తి కూడా పీవీ నర్సింహా రావు అన్నారు. దేశంలో 17 భాషలు మాట్లాడ గలిగే ఒకే ఒక్కరు పీవీ అన్నారు. విద్య, ఉద్యోగ, వైద్య రంగాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. తన పరిపాలన దక్షతతో ప్రపంచ దేశాలలో భారతదేశ ఖ్యాతిని చాటి చెప్పారని, అలాంటి మహనీయుడికి భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తాము అనేక సార్లు డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం కూడా నర్సింహా రావు శతజయంతిని సంవత్సరం పాటు ఎంతో గొప్పగా నిర్వహించి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా తెలిపారు. మరణించిన తర్వాత కూడా ప్రజల మనసుల్లో కొందరు మాత్రమే నిలిచిపోతారని, అందులో పీవీ నర్సింహారావు ముందు వరుసలో ఉంటారని అన్నారు.
ఈ కార్యక్రమంలో పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, పీవీ కుమారుడు ప్రభాకర్ రావు, కార్పొరేటర్ టి.మహేశ్వరి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, శేఖర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, శేఖర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే వారిని తమిళనాడు నుంచి పోటీ చేయించండి

బీజేపీకి అన్నాడీఎంకే సవాలు..!

తమిళనాడు,మార్చి2(వెలుతురు):
సార్వత్రిక ఎన్నికలుసమీపిస్తున్న వేళ తమిళనాడు రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు జోరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కొన్ని మాసాల క్రితం ఎన్డీయే కూటమి నుంచి వైదొలగిన అన్నాడీఎంకే.. బీజేపీని టార్గెట్ చేస్తూ ఘాటు విమర్శలు చేసింది. తమిళనాడులో గెలుస్తామంటూ బీజేపీ నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కేపీ మునుస్వామి ఎద్దేవా చేశారు. తమిళనాడులో గెలుస్తామన్న నమ్మకముంటే కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జైశంకర్‌ను రాష్ట్రం నుంచి పోటీ చేయించాలని సవాల్ విసిరారు.
తమిళనాడులో బీజేపీ మంచి ఫలితాలు సాధిస్తుందన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఆ నమ్మకముంటే తమిళనాడుకు చెందిన కేంద్ర సహాయ మంత్రి ఎల్ మురుగన్‌ను రాజ్యసభకు ఎందుకు పంపారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించాల్సిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిచే పరిస్థితి లేనందునే ఆయన్ను రాజ్యసభకు పంపారని చెప్పారు. అయితే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో బీజేపీ గెలుస్తుందని ప్రచారం చేస్తూ ప్రజలను మోసగించాలని చూస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలకు దమ్ముంటే.. తమిళనాడుకు చెందిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, తమిళనాడులో పుట్టి పెరిగిన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ను

తమిళనాడు నుంచి పోటీ చేయించాలని సవాల్ చేస్తున్నట్లు చెప్పారు. తమిళనాడులోని ఏ లోక్‌సభ నియోజకవర్గం నుంచైనా వారిని పోటీ చేయించొచ్చని అన్నారు. తమిళనాడులో గెలుస్తామన్న నమ్మకం బీజేపీ నేతలకు ఉంటే తన సవాలును స్వీకరించాలన్నారు. ద్రవిడ గడ్డ తమిళనాడులో బీజేపీ గెలిసే అవకాశమే ఉండదన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీకి తమిళనాడు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కాగా లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే విజయం సాధిస్తే రాష్ట్రాన్ని దేవుడు కూడా కాపాడలేరని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడపాడి పళనిస్వామి అన్నారు. కావేరీ నదిపై మేకెదట్టు వద్ద కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవడంలో స్టాలిన్ సర్కారు విఫలం చెందిందని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రైతుల పరిస్థితి దారుణంగా మారుతోందన్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి డీఎంకేకి గట్టిగా బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కావేరీ డెల్టా రైతుల ప్రయోజనాల పరిరక్షణ అన్నాడీఎంకేతోనే సాధ్యమన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి కావేరీ నదీ జలాలు విడుదల చేయించే దమ్ము స్టాలిన్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. తమిళనాడులోని 39 లోక్‌సభ నియోజకవర్గాలు, పుదుచ్చేరిలోని 1 స్థానానికి మరో రెండు మాసాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి, అన్నాడీఎంకే, బీజేపీ మధ్య గట్టిపోటీ నెలకొంటోంది. ఇటీవల అన్నాడీఎంకేకి చెందిన పలువురు మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. తమిళనాడులో పర్యటించిన ప్రధాని మోదీ.. బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

మలుపులు తిరుగుతోన్న మహారాష్ట్ర రాజకీయాలు

శరద్ పవార్ విందుకు సీఎం ఏక్‌నాథ్ దూరం..!

శరద్ పవార్ ఆహ్వానాన్ని తిరస్కరించిన ఏక్‌నాథ్ షిండే

మహారాష్ట్ర,మార్చి2(వెలుతురు):
లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహారాష్ట్ర రాజకీయాలు కీలక మలుపులు తిరుగుతోంది. ఎన్సీపీ (శరద్ పవార్) అధినేత శరద్ పవార్ తన రాజకీయ ప్రత్యర్థుల కోసం విందు ఆహ్వానం పంపారు. అయితే ఈ విందుకు హాజరుకాలేనంటూ శరద్ పవార్ ఆహ్వానాన్ని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే తిరస్కరించారు. ఈ విందుకు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో పాటు డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, పవార్ మేనల్లుడు అజిత్ పవార్‌లను పవార్ ఆహ్వానించారు. పుణె జిల్లాలోని బారామతిలో ఈ నెల మార్చి 2న(శనివారం) జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం ఏక్‌నాథ్ షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్‌లు హాజరుకానున్నారు. బారామతి లోక్‌సభ నియోజకవర్గానికి ప్రస్తుతం శరద్ పవార్ కుమార్తె సుప్రియ సూలే ప్రాతినిధ్యంవహిస్తున్నారు. మళ్లీ ఆమె అక్కడి నుంచి పోటీ చేయాలని ఆమె భావిస్తున్నారు. అయితే బారామతి నుంచి ఎన్డీయే కూటమి తరఫున తన భార్య సునేత్ర పవార్‌ను బరిలో నిలిపే యోచనలో అజిత్ పవార్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వారు బారామతికి వస్తున్న వేళ.. శరద్ పవార్ విందు ఆహ్వానం పలకడం మహారాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బారామతి ఎంపీ హోదాలో సుప్రియ సూలే, రాజ్యసభ సభ్యుడైన తాను కూడా బారామతిలో జరిగే అధికారిక కార్యక్రమంలో పాల్గొంటామని శరద్ పవార్ తెలిపారు.
ఆ కార్యక్రమం అనంతరం బారామతిలోని తన నివాసంలో విందుకు రావాలని షిండే, ఫడ్నవీస్, అజిత్‌లకు శరద్ పవార్ ఆహ్వాన లేఖలు పంపారు. ముఖ్యమంత్రి షిండే తొలిసారిగా బారామతి పర్యటనకు వస్తున్నందున ఈ విందును ఏర్పాటు

చేస్తున్నట్లు తెలిపారు. అయితే ముందుగా షెడ్యూల్ చేసిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున విందుకు హాజరుకాలేనని సీఎం షిండే శుక్రవారంనాడు స్పష్టంచేశారు.
అజిత్ పవార్‌తో కలిసి ఎన్సీపీ ఎమ్మెల్యేలు పలువురు బీజేపీ-శివసేన కూటమి ప్రభుత్వంలో చేరడం తెలిసిందే. కేంద్ర ఎన్నికల సంఘం కూడా అజిత్ పవార్ వర్గానికే ఎన్సీపీ అధికార చిహ్నం గడియారంను కేటాయించింది.
అటు మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ కూడా అసెంబ్లీలో అజిత్ పవార్ వర్గాన్నే అసలైన ఎన్సీపీగా గుర్తించారు. దీనిపై శరద్ పవార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా బారామతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి తాను మళ్లీ పోటీ చేయనున్నట్లు సుప్రియ సూలే ప్రకటించుకున్నారు. ఆ మేరకు ఆమె శుక్రవారంనాడు తన వాట్సప్ స్టేటస్ పెట్టుకోవడం మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికలలో విధులు నిర్వహించు సిబ్బంది వివరాలు అందించాలి

- జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి జిల్లా, (వెలుతురు):
రానున్న పార్లమెంటు ఎన్నికలలో విధులు నిర్వహించుటకు వివిధ శాఖలల సిబ్బందికి సంబంధించి పూర్తి వివరాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక ఆర్డీఓలు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో విధులు నిర్వహించుటకు ఆయా శాఖల ద్వారా అందించే సిబ్బంది వివరాలు పూర్తి స్థాయిలో అందించాలని సూచించారు. సిబ్బందికి సంబంధించిన ఇంటి చిరునామాలు, ఎపిక్ కార్డుల వివరాలు తప్పనిసరిగా అందించాలని, ఇంకా వివరాలు అందించని శాఖల వారు వెంటనే జిల్లా పరిశ్రమల శాఖ వారికి అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ఆర్డీఓలు సూరజ్ కుమార్, రవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, డీసీసీఓ ధాత్రి దేవి, ఎల్. డి. ఎమ్. కుసుమ, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య నౌకలే లక్ష్యంగా హూతీ తిరుగుబాటుదారుల దాడులు

నీట మునిగిన తొలి వాణిజ్య నౌక

న్యూఢిల్లీ,మార్చి2(వెలుతురు):
వాణిజ్య నౌకలే లక్ష్యంగా యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు దాడులకు తెగబడుతోన్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 18న బాబ్-అల్-మండెబ్ జలసంధి వద్ద దాడికి గురైన ఓ వాణిజ్య నౌకతాజాగా ఎర్ర సముద్రంలో మునిగిపోయింది. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన ఈ జలమార్గంలో నెలలతరబడి సాగుతోన్న దాడుల్లో మునిగిపోయిన మొదటి ఓడ ఇదే. యెమెన్ ప్రభుత్వం, ప్రాంతీయ సైనిక అధికారి ఈవిషయాన్ని

ధ్రువీకరించారు.బలీజ్ దేశపు జెండాతో వెళ్తున్న 'ఎంవీ రూబీమర్'పై దాడి జరిగిన 12 రోజులకు సిబ్బంది వదిలిపెట్టేశారు. దాన్ని ఓడరేవుకు తరలించేందుకు ప్రణాళికలూ రూపొందించారు. అయితే.. నౌక క్రమంగా ఉత్తరం వైపు కొట్టుకుపోయి నీట మునిగింది. ఇదిలాఉండగా.. ఎర్ర సముద్రంలో హూతీలు దాడులను ఆపకపోవడంతో అగ్రరాజ్య సంకీర్ణ సేనలు ఇటీవల నాలుగోవిడత వైమానిక దాడులను చేపట్టాయి. అమెరికా, బ్రిటన్ యుద్ధ విమానాలు మొత్తం ఎనిమిది ప్రదేశాల్లోని 18 లక్ష్యాలను ధ్వంసం చేశాయి.

కోరుట్లలో గుండెపోటుతో ఏఎస్సై మృతి

జగిత్యాల,మార్చి2(వెలుతురు): జగిత్యాల జిల్లాలో విషాదం నెలకొంది. కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న లోకిని రాజేందర్ (53) గుండెపోటుతో మరణించాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం విధులు పూర్తి చేసుకుని రాజేందర్ ఇంటికి వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో ఛాతి నొప్పి రావడంతో స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న రాజేందర్.. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు.లోకిని రాజేందర్ కానిస్టేబుల్‌గా పోలీసు వృత్తిలోకి వచ్చారు. నిబద్ధతతో పనిచేసిన ఆయన.. అంచెలంచెలుగా ప్రమోషన్లు అందుకుంటూ ఏఎస్సై స్థాయికి చేరుకున్నారు. రాజేందర్ మృతి పట్ల మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, ఎస్సై కిరణ్, పోలీస్ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృత దేహానికి నివాళులర్పించారు.

కేసీఆర్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్,మార్చి2(వెలుతురు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తనకు రాజ్యసభ సభ్యునిగా తిరిగి అవకాశం ఇచ్చి ఆదరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. శనివారం నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి కుటుంబ సమేతంగా వెళ్లిన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజుకు శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్ వారిని ఆశీర్వదించారు.

భద్రాద్రి ఎఇవోపై విచారణకు ఆదేశాలు

భద్రాద్రి కొత్తగూడెం,మార్చి2(వెలుతురు): అవినీతి ఆరోపణలపై భద్రాద్రి రామాలయ ఏఈవో శ్రావణ్ కుమార్‌పై విచారణ చేపట్టారు. భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో వసతి గదుల నిర్మాణం అనుమతుల కోసం తమ వద్ద నుండి దేవస్థానానికి చెందిన ఏఈవో రూ.17లక్షలు తీసుకున్నారంటూ ఇటీవల ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన ట్రస్ట్ సభ్యులు.. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషర్‌కు, దేవస్థానం ఈవోకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నివేదికలు పంపాలంటూ దేవస్థానం అధికారులను.. జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. దీంతో ఆలయ ఈవో రమాదేవి.. అంతర్గత విచారణ ప్రారంభించారు. అనంతరం నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. దాతల నుండి డబ్బు తీసుకునే ఆరోపణలపై ఏఈవో శ్రావణ్ కుమార్‌ని వివరణ కోరుతూ దేవస్థానం ఈఓ రమాదేవి మెమో జారీ చేశారు.

పదేళ్లుగా రాష్ట్రంలో నియంతృత్వ పాలన: హరగోపాల్

హైదరాబాద్,మార్చి2(వెలుతురు):
రాష్ట్రంలో గత పదేళ్లలో నియంతృత్వ పాలన సాగిందని పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. అణచివేత లక్ష్యంగా పాలన సాగిందన్నారు. ప్రజాస్వామ్య, పౌర హక్కులను అణిచివేసే విధంగా దాడులు జరిగాయన్నారు. ఉపా చట్టం రాష్ట్రంలో ఉపయోగించినట్లుగా ఎక్కడ జరగలేదన్నారు. ఈ చట్టం కింద 200 మందిపై కేసులు నమోదు చేశారని తెలిపారు. పదేళ్లలో విద్యారంగం పూర్తిగా విధ్వంసమైందని.. ఇన్నేళ్ల తర్వాత స్వేచ్ఛగా సభలు పెట్టుకునే అవకాశం రావడం గొప్ప విషయమన్నారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు చదువును దూరం చేసేలా వర్శిటీలను గత సర్కార్ దెబ్బతీసిందన్నారు ప్రొఫెసర్ వెంకట నారాయణ. ప్రజాస్వామ్య వాదులు సెక్రటరియట్ లో పదేళ్ల తర్వాత అడుగు పెట్టామన్నారు పీపుల్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు రవిచందర్ అన్నారు.

గురుగ్రాం సైబర్ నేరగాళ్ల చేతివాటం

స్కామర్ల చేతిలో రూ. 2.5 కోట్లు పోగొట్టుకున్న డాక్టర్

న్యూఢిల్లీ,మార్చి2(వెలుతురు):
దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గురుగ్రామ్‌కు చెందిన డాక్టర్ సైబర్ నేరగాళ్ల చేతిలో భారీగా మోసపోయారు. స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్ పేరుతో సైబర్ నేరగాళ్ల చేతిలో గురుగ్రాం కేంద్రీయ విహార్ సొసైటీకి చెందిన డాక్టర్ పునీత్ సర్దానా ఏకంగా రూ. 2.5 కోట్లు నష్టపోయారు. ఈ ఏడాది జనవరి 4న ఆన్‌లైన్ వేదికగా స్టాక్ మార్కెటింగ్ ఇన్వెస్ట్ మెంట్ ప్లాన్‌కు సంబంధించిన ప్రకటన ఆయనను ఆకట్టుకుంది. ఆన్‌లైన్ స్టాక్, ఐపీఓ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా భారీ లాభాలను సంపాదించ వచ్చని నేరగాళ్లు డాక్టర్ పునీత్ సర్దానాను నమ్మించారు.. ప్రకటనలో ఇచ్చిన ఫోన్ నెంబర్‌కు ఆయన కాల్ చేయడంతో కాలర్ ఆయనకు వాట్సాప్ ద్వారా లింక్ పంపారు. ఆపై షేర్ల కొనుగోలు కోసం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సైబర్ నేరగాళ్లు డాక్టర్ సర్దానాను కోరడంతో ఆయన అలాగే చేశారు. యాప్ పనితీరుపై సంతృప్తి చెందిన సర్దానా ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించారు. మొదట రూ. 50,000 ఖర్చు చేసి షేర్లు కొనుగోలు చేశారు. ఇక తొలిగా తన పెట్టుబడులు మెరుగైన రాబడి ఇవ్వడంతో ఆపై ఓ ఐపీఓలో పెట్టుబడి పెట్టారు. ఇక యాప్‌లో తన అకౌంట్ బ్యాలెన్స్ భారీ లాభాలతో ఏకంగా రూ. 3.19 కోట్లు చూపింది. తన లాభాలను విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా విత్‌డ్రాయల్స్ కు అనుమతించలేదు. తన ఫండ్స్ కు యాక్సెస్ లేకపోవడంతో డాక్టర్ సర్దానా స్కామర్లను కాంటాక్ట్ అయ్యాడు. విత్‌డ్రాయల్ ప్రక్రియ సాఫీగా సాగాలంటే అదనపు డబ్బును సెక్యూరిటీ డిపాజిట్స్ కింద వెచ్చించాలని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన బాధితుడు పలు లావాదేవీల్లో రూ. 1.36 కోట్లు ట్రాన్స్ ఫర్ చేశారు. ఆపై బాధితుడు పలుమార్లు సంప్రదించినా స్కామర్లు అందుబాటులో లేకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

పంజాబ్‌లో ఆప్ కార్యకర్త దారుణ హత్య

కారులో వెళ్తుండగా ఒక్కసారిగా తుపాకులతో దాడి!

అమృత్‌సర్,మార్చి2(వెలుతురు):
పంజాబ్‌లో అధికార పార్టీ ఆప్‌కు చెందిన ఓ కార్యకర్తను గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్త గురుప్రీత్ సింగ్‌పై శుక్రవారం (మార్చి 1) పంజాబ్‌లోని తరన్ తరన్‌లో గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. గుర్‌ప్రీత్ సింగ్ అలియాస్ గోపీ చోహాల్ కోర్టు కేసు విషయమై కపుర్తలా వైపు కారులో వెళ్తుండగా.. ఒక్కసారిగా దుండగులు బుల్లెట్ల వర్షం కురిపించారు. ఈ ఘటన గోయింద్వాల్ సాహిబ్ రైల్వే క్రాసింగ్ వద్ద జరిగింది. దాడిలో గురుప్రీత్ సింగ్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. కోర్టుకు బయల్దేరిన గుర్‌ప్రీత్ సింగ్ కారును దుండగులు వెంబడించారు. ముగ్గురు వ్యక్తులు మరో కారులో ఆయనను ఫాలో చేశారు. సింగ్ ఫతేబాద్, గోయిందాల్ సాహిబ్ మధ్యలోని రైల్వే క్రాసింగ్ వద్ద గురుప్రీత్ సింగ్ కారు ఆపు చేయగానే దుండగులు కూడా అతని కారు వెనకే తమ కారును కూడా ఆపారు. ఆనంతరం అతడిపైకి ఐదు సార్లు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి, అనంతరం పరారైనట్లు అక్కడి స్థానిక మీడియా సంస్థలు వెల్లడించాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా కారులో ఉన్న గుర్‌ప్రీత్ సింగ్ అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. దుండగులను పట్టుకునేందుకు పలు బృందాలను ఏర్పాటు చేశామని, ముమ్మర గాలింపు చర్యలు చేపట్టినట్లు ఓ పోలీస్ అధికారి తెలిపారు. శత్రుత్వాల వల్ల హత్య జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని అధికారి తెలిపారు. కాగా AAP కహదూర్ సాహిబ్ ఎమ్మెల్యే మంజీందర్ సింగ్ లాల్‌పురాకు మృతుడు గుర్‌ప్రీత్ సింగ్ సన్నిహితుడు. చోలా చోహ్లా సాహిబ్ బ్లాక్‌కు ఆయన ఇటీవల ఆహార సరఫరా ఇంచార్జ్‌గా నియమితులయ్యారు. ఇంతలో ఆయన హత్యకు గురికావడంతో స్థానికంగా కలకలం రేగింది. ఇదే మాదిరి ఈ ఏడాది జనవరి 15న కూడా మరో ఆప్ నేత హత్యకు గురయ్యాడు. తరన్ తరణ్ జిల్లాలోని ఝబల్ ప్రాంతంలోని సెలూన్‌లో మరో స్థానిక ఆప్ నాయకుడు సోనూ చీమాను గుర్తు తెలియని వ్యక్తులు తుపాకులతో కాల్చి చంపారు.

ఇంకో తొమ్మిది మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజిందర్ రాణా

న్యూఢిల్లీ,మార్చి2(వెలుతురు):
కనీసం తొమ్మిది మంది పార్టీ శాసనసభ్యులు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని అనర్హత వేటు పడిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజిందర్ రాణా స్పష్టం చేశారు. కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ శిబిరానికి తిరిగి రావాలనుకుంటున్నారని హిమాచల్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖూ చేసిన వాదనలను రాణా కొట్టిపారేశారు. సుఖూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నారని రాణా ఆరోపించారు రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేసిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో రాజిందర్ రాణా కూడా ఒకరు. ఆ తర్వాత స్పీకర్ రాణాపై అనర్హత వేటు వేశారు. కాంగ్రెస్ సభ్యుల క్రాస్ ఓటింగ్‌తో ఈ ఎన్నికల్లో బీజేపీ ఒక సీటును కైవసం చేసుకుంది క్రాస్ ఓటింగ్ నిర్ణయాన్ని రాణా సమర్థించుకుంటూ తాము హిమాచల్ ప్రదేశ్ ప్రజల గౌరవాన్ని నిలబెట్టడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. హిమాచల్‌ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించే అభ్యర్థులెవరూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు లేరా అని రాణా ప్రశ్నించారు. తమ నిర్ణయం వ్యక్తిగతమైనదని, మరొక బహిష్కృత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇందర్ దత్ లఖన్‌పాల్ పేర్కొన్నారు. లఖన్‌పాల్ మాట్లాడుతూ, "కొందరు ఇప్పుడు మమ్మల్ని తిరుగుబాటుదారులు లేదా దేశద్రోహులు అంటారు. కానీ మేము కాదు. మేము మా మనస్సాక్షి ప్రకారం నడుచుకున్నాము. ఇది మా వ్యక్తిగత నిర్ణయం" అని అన్నారు. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం ఉందని బీజేపీ పేర్కొంది. అయితే ఈ భావనను ముఖ్యమంత్రి సుఖూ తోసిపుచ్చారు. మరోవైపు సుఖూ, "కాంగ్రెస్‌లో 80 శాతం శాసనసభ్యులు కలిసి ఉన్నారు. చిన్న విషయాలకు పార్టీలో అసమ్మతిని ఆపాదించారు. సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తే పరిస్థితి చక్కబడుతుంది" అని అన్నారు. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలతో చర్చలు జరపాలని ఉద్ఘాటించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, గత 14 నెలలుగా రాష్ట్రంలో నిజాయితీ, పారదర్శక పాలన అందించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని, సమన్వయ కమిటీ ఏర్పాటుతో పరిస్థితి మెరుగుపడుతుందని సుఖూ విశ్వాసం వ్యక్తం చేశారు. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలలో సుధీర్ శర్మ, రవి ఠాకూర్, రాజిందర్ రాణా, ఇందర్ దత్ లఖన్‌పాల్, చైతన్య శర్మ, దేవిందర్ కుమార్ భుట్టో ఉన్నారు. బడ్జెట్‌పై ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా చర్యలు తీసుకున్నారు. పార్టీ విప్‌ను దిక్కరించి నందుకు స్పీకర్ ఈ చర్యను చేపట్టారు. స్పీకర్ నిర్ణయంపై అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టులో అప్పీల్ చేయనున్నట్టు ప్రకటించారు.

నిర్లక్ష్యమా..! మొండితనమా..!

- అభ్యర్థుల ఎంపికలో అర్థం కాని జగన్ వైఖరి
- ఇన్చార్జిలే అభ్యర్థులు అని చెబుతూనే మళ్లీ మార్పులు
- గందరగోళంలో మంగళగిరి వైసీపీ శ్రేణులు

అమరావతి,(వెలుతురు): సీఎం జగన్ ప్రత్యర్థుల ఎత్తుగడలను పసిగట్టలేరని కొందరు అంటారు. అయితే అందులో నిజమెంతో తెలియదు కానీ, ప్రస్తుతం ఆయన నియోజకవర్గాల ఇన్‌చార్జీ విషయంలో వ్యవమరిస్తున్న తీరు మాత్రం అనుమానాలకు తావిస్తోంది . ఎడాపెడా నియోజకవర్గ ఇన్‌చార్జీలను ఇష్టానుసారం మారుస్తున్న తీరుపై సొంత పార్టీల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఈ వ్యవహారం జగన్ వ్యతిరేక మీడియాకు కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్లు అవుతోంది. బలంగా ఉన్న జగన్ వ్యతిరేక మీడియా గోరంతలను కొండతలు చేసి చూసుతోంది. అదే సమయంలో టీడీపీ, జనసేనలో అంతర్గత వ్యతిరేకతను మాత్రం ఎలివేట్ చేయడం లేదు.

దాదాపు ఫైనల్ అని చెప్పి...ఏపీలో వైసీసీ నియోజకవర్గ ఇన్‌చార్జి అభ్యర్థి అని జగన్ ఇప్పటికే ప్రకటించారు. ఇలా ఇప్పటికే సగం నియోజకవర్గాల ఇన్‌చార్జీలను మార్చారు. కొందరిని పక్క నియోజకవర్గాలకు బదిలీ చేయగా, ఇంకొందరిని తప్పించారు. కొందరికి ఎంపీ సీట్లు, కొందరు ఎంపీలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇంతరవకు బాగానే ఉంది. అయితే ఇన్‌చార్జిని ప్రకటించిన వారం పది రోజులకే మళ్లీ మార్చడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశం అవుతోంది. ఇలా ఇప్పటికే పది మంది వరకు ఇన్‌చార్జీలను మార్చారు

ఖర్చు పెట్టకున్నాక మార్పు..
నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసుకోమని చెప్పాక నేతలు పోటీకి సద్దమవుతున్నారు. ఇందుకోసం భారీగా ఖర్చు పెడుతున్నారు. క్యాడర్‌ను మచ్చిక చేసుకుంటున్నారు. ఇంతలోనే తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి పిలుపు వస్తోంది. అన్నీ సెట్ చేసుకున్నాక.. నిన్ను వేరే నియోజకవర్గానికి మారుస్తున్నాం.. అక్కడ పనిచేసుకోండి అని సూచిస్తున్నారు. దీంతో అభ్యర్థులతోపాటు క్యాడర్‌లో అయోమయం కలుగుతోంది. ఒకసారి ఇచ్చిన వారిని మార్చేస్తే వాళ్లు అలగడం, ఇవన్నీ కలిసి ఓ ప్రహసనంగా మారుతున్నాయి. దీంతో ప్రతిపక్ష అనుకూల మీడియా దీనిని హైలేట్ చేస్తోంది..

అన్నీ తెలిసి మొండిగా..రాజకీయాల్లో ప్రజల అండ ఎంత అవసరమో మీడియా మద్దతు కూడా అంతే ఉండాలి. జగన్ తనకు ప్రజల అండ ఉందని భావిస్తున్నారు. కానీ మీడియా సపోర్టు పెద్దగా లేదు. సొంత మీడియా ఉన్నా.. దానిని ఎవరూ పట్టించుకోవడం లేదు. అయినా జగన్ అస్సలు జాగ్రత్త పడడం లేదు. వెళ్లిపోతే పోండి. ఎవరు ఎలా రాసుకుంటే నాకేంటి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అన్నీ తెలిసి కూడా ఇలా ఇష్టానుసారం అభ్యర్థులను మార్చడం విమర్శలకు తావిస్తోంది. జనంలోనూ గందరగోళం ఏర్పడుతోంది..

క్యాడర్‌లో అయోమయం.. ఇష్టానుసారం ఇన్‌చార్జీలను మారుస్తుండడంతో క్యాడర్ కూడా ఎవరికి మద్దతు తెలుపాలో తెలియక గందరగోళంలో ఉంటోంది. టికెట్లు ఇచ్చే వరకు తమ నియోజవర్గ ఇన్‌చార్జి పోటీ చేస్తాడా లేదా అన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు మంగళగిరి నియోజకవర్గమే మంచి ఉదాహరణ. అక్కడ టీడీపీ నుంచి లోకేష్ పోటీ చేయనున్నారు. ఇక జగన్ గతంలో ఆళ్ల రామకృష్ణారెడ్డిని బరిలో నిలిపి లోకేష్‌ను ఓడించారు. ఇప్పుడు మరో ఇన్‌చార్జిని నియమించారు. సర్వే ఫలితాలు అతనికి అనుకూలంగా లేవని ఇప్పుడు ఓ మహిళను ఇన్‌చార్జిని చేశారు. ఇలా మార్చడంపై స్థానికంగానూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అభ్యర్థులు అంతంత మాత్రమే.. జగన్ ఒక్కటే ఆలోచన చేస్తున్నట్లు కనిపిస్తోంది. జనం తనను చూసే తన పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాడన్న ధీమాతో ఉన్నారు. కేసీఆర్ కూడా తెలంగాణలో ఇలాగే వ్యవహరించారు. అభ్యర్థులపై ఎంత వ్యతిరేకత ఉంటే ఏంటి.. తనను చూసి ఓట్లు వేస్తారు అనుకున్నారు. కానీ 2023 ఎన్నికల్లో దెబ్బ తగిలింది. ఇప్పుడు జగన్ కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తున్నారు. ఇది మొదటికే మోసం తెస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు..

రిలాక్స్‌గా చంద్రబాబు..!

- షర్మిల, సునీత చేత జగన్ కు వ్యతిరేకంగా మాట్లాడిన్నారనే ఆరోపణలు
- జగన్ ను ఇరుకున పెట్టేందుకు ఏ అవకాశాన్ని జార విడువని బాబు



అమరావతి,(వెలుతురు): గత ఎన్నికల్లో చంద్రబాబుకు ఎదురైన పరిణామాలన్నీ.. ఇప్పుడు జగన్ ఫేస్ చేయక తప్పదు. అంతలా పట్టు బిగిస్తున్నారు చంద్రబాబు. ఒక్క మాటలో చెప్పాలంటే అష్టదిగ్బంధం చేస్తున్నారు. తాను మాత్రం ప్రశాంతంగా ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్నారు. ఎన్నికల ముంగిట కలిసి వచ్చిన ఏ చిన్న అంశాన్ని సైతం విడిచిపెట్టడం లేదు. తనకు అనుకూలంగా మలుచుకోవడంలో సక్సెస్ అవుతున్నారు. ఒకవైపు అనుకూల మీడియా ద్వారా దూరం జరిగిన వర్గాలను దగ్గర చేసుకుంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే జగన్ నిర్వీర్యం చేయాలని భావిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు తన రెక్కలు తెగినట్టే.. జగన్ ను చేయాలని భావిస్తున్నారు.ముందుగా జగన్ కుటుంబంలో చీలిక తేవడంలోచంద్రబాబు పాత్ర ఉందన్న అనుమానాలు ఉన్నాయి.షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరిక, ఆమెకు పిసిసి పగ్గాలు అందడం వెనుక చంద్రబాబు హస్తము ఉందన్నది వైసిపి నేతల ఆరోపణ. అందుకు తగ్గట్టుగానే షర్మిల జగన్ పై విమర్శలకే పరిమితమవుతున్నారు. చంద్రబాబు విషయంలో తగ్గినట్టు కనిపిస్తున్నారు. మరోవైపు వివేక హత్య కేసు విషయంలో సునీత వెనుక చంద్రబాబు ఉన్నారన్నది ఎక్కువమంది అనుమానం. ఇంతవరకు న్యాయపోరాటం చేసిన ఆమె.. ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని భావిస్తున్నారు. జగన్కు వ్యతిరేకంగా ప్రచారం చేయడం ప్రారంభించారు. నేరుగా ఢిల్లీ వెళ్లి నేషనల్ మీడియాతో మాట్లాడారు. వైసీపీకి ఓటు వేయొద్దని ఏపీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ పరిణామాలన్నీ జగన్ కు వ్యతిరేకంగా మారిపోతున్నాయి. అవి ఎలాగూ చంద్రబాబుకు ఫేవర్ గా మారుతాయి. మరోవైపు సీట్ల సర్దుబాటుకు సంబంధించి పవన్ కళ్యాణ్ తో ఎటువంటి పేచి లేకుండా పూర్తి చేయడంలో చంద్రబాబు సక్సెస్ అయ్యారు. జనసేనకు 24 అసెంబ్లీ స్థానాలకు పరిమితం చేశారు. వాస్తవానికి 40 కు పైగా అసెంబ్లీ స్థానాలు పొత్తులో భాగంగా కేటాయించాల్సి ఉంటుందని ప్రచారం జరిగింది. అటు ముఖ్యమంత్రి పదవి షేరింగ్ విషయంలో కూడా పవన్ పట్టుబడతారని విశ్లేషణలు ఉండేవి. సీట్ల సర్దుబాటు విషయంలో పెద్ద పెద్ద వివాదాలు నడుస్తాయని ప్రచారం జరిగింది. ఓట్ల బదలాయింపు సక్రమంగా జరగదని కూడా అంచనాలు ఉండేవి. కానీ వాటన్నింటికీ చంద్రబాబు కంటే పవన్ బాధ్యత తీసుకున్నారు. చంద్రబాబు వరకు ఎటువంటి సమస్య రాకుండా అన్ని బాధ్యతలు పవన్ తీసుకోవడం విశేషం. మరోవైపు బిజెపితో పొత్తు విషయంలో సైతం చంద్రబాబు విజయం సాధించారు. అసలు టిడిపి తో పొత్తు వద్దని భావించిన బిజెపి అగ్ర నేతలను పవన్ తో ఒప్పించారు. వీలైనంతవరకు తక్కువ సీట్లు కేటాయించేలా పావులు కదిపారు. అందులో కూడా కొంత సక్సెస్ అయ్యారు. అన్నింటికీ మించి బిజెపితో పొత్తు ద్వారా జగన్ కు ఎలక్షన్ క్యాంపెయినింగ్ లోఇబ్బందులు పెట్టాలని చంద్రబాబు భావిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు తనకు ఎదురైన ఇబ్బందులను తెరపైకి తెచ్చి.. జగన్ పై అప్లై చేయాలని భావిస్తున్నారు. మొత్తానికైతే ఎన్నికల ముంగిట కలిసొస్తున్న పరిణామాలతో చంద్రబాబు ప్రశాంతంగా ఉన్నారు.

టీడీపీలో చేరిన వేమిరెడ్డి కుటుంబ సభ్యులు

పసుపు కండువా కప్పిన టీడీపీ అధినేత చంద్రబాబు

అమరావతి,(వెలుతురు): నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. టీడీపీ అధినే త చంద్రబాబు రా కదలిరా సభ కోసం నెల్లూరు వచ్చారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీ లో చేరారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన అర్ధాంగి వేమిరెడ్డి ప్రశాంతిలకు చంద్రబాబు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆత్మీయ స్వాగతం పలికారు. రాష్ట్రం బాగు కోసం కలిసి పనిచేద్దాం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి కుటుంబం చంద్రబాబును సత్కరించి వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించింది. కాగా, వేమిరెడ్డి కుటుంబంతో పాటు నెల్లూరుకు చెందిన పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు, పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. నెల్లూరు పీవీఆర్ కన్వెన్షన్ లో ఈ కార్యక్రమం జరిగింది. చంద్రబాబు స్పందిస్తూ... రాజకీయాల్లో అజాతశత్రువు వంటి వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అని కొనియాడారు. ప్రజాసేవకు మారు పేరు వేమిరెడ్డి... ప్రజలకు సేవ చేయాలన్న ఏకైక ఉద్దేశంతోనే ఆయన రాజకీయాల్లోకి వచ్చారు అని తెలిపారు. ఆయన రాకతో నెల్లూరులో సునాయాసంగా గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు కార్పొరేషన్ మొత్తం ఖాళీ అయిపోతుందని అన్నారు. పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నామని చెప్పారు. రాజకీయాలకు గౌరవం తెచ్చే వ్యక్తులకు టీడీపీ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని చంద్రబాబు ఉద్ఘాటించారు. టీడీపీలో చేరిన సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... తన పరిధి మేరకు ప్రజలకు ఎల్లప్పుడూ సేవ చేస్తూనే ఉంటానని చెప్పారు. మరింత మందికి సేవ చేయాలన్న ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. టీడీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో మీ అందరి మద్దతు నాకు అవసరం అని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలకు ఉపయోగపడే మరిన్ని మంచి పనులు చేస్తానని స్పష్టం చేశారు.

నెల్లూరు వైసీపీలో లుకలుకలు..!

- ఒకరి తర్వాత మరొకరు పార్టీకి గుడ్ బై
- ఒకప్పుడు జగన్‌కు వీర విధేయులే నేడు శత్రువులు

అమరావతి,(వెలుతురు): వైసీపీకి విశేష ఆదరణ ఉన్న జిల్లాల్లో నెల్లూరు ఒకటి. వైసీపీ ఆవిర్భావం నుంచి ఈ జిల్లాలో పార్టీకి ఏకపక్ష విజయాలు దక్కుతున్నాయి. గత ఎన్నికల్లో అయితే దాదాపు పార్టీ స్వీప్ చేసింది. అటువంటి జిల్లాలో ప్రస్తుతం వైసీపీ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. పార్టీలో విభేదాలు, సీనియర్లు పార్టీని వీడటంతో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పార్టీని వీడారు. తాజాగా పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి సైతం శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు . దీంతో ఆ పార్టీ విషమ పరిస్థితిని ఎదుర్కొంటోంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి జగన్ కు అత్యంత విధేయుడు. అటువంటి నాయకుడిని చేజేతులా దూరం చేసుకున్నారు. అటు ఆనం రామనారాయణరెడ్డి సీనియారిటీని గౌరవించలేదు. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వయసుకు తగ్గ గౌరవం ఇవ్వలేదు. ఈ పరిణామాలతో కలత చెందిన ఒక్కో నాయకుడు పార్టీని వీడుతూ వచ్చారు. వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి విషయంలో కూడా పార్టీ తప్పటడుగులు వేసింది. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కు ఇచినంత విలువ కూడా.. వేం రెడ్డికి దక్కకపోవడంతో ఆయన పార్టీ వీడాల్సి వచ్చింది. ఆయనతో పాటు చాలామంది నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. నెల్లూరు సిటీలో అనిల్ కుమార్ యాదవ్ కు అనుకూలంగా లేకపోవడంతో.. ఆయన మార్పు అనివార్యంగా మారింది. ఆయనకు నరసరావుపేట ఎంపీ స్థానానికి పంపించారు. కానీ నెల్లూరు అసెంబ్లీ సీటును డిప్యూటీ మేయర్ ఖలీల్ కు ఖరారు చేశారు. ఈ నిర్ణయాన్ని వేంరెడ్డి వ్యతిరేకించారు. మరో డిప్యూటీ మేయర్, అనిల్ బాబాయ్ రూప్ కుమార్ యాదవ్ కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ జగన్ వినలేదు. దీంతో అటు వేమిరెడ్డి, ఇటు రూప్ కుమార్ యాదవ్ తో పాటు నెల్లూరు కార్పొరేషన్ లో మెజారిటీ కార్పొరేటర్లు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు.దీంతో నెల్లూరు అసెంబ్లీ స్థానంలో ఓటమి తప్పదు అన్న సంకేతాలు వస్తున్నాయి. గత ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పని చేస్తే కేవలం 700 ఓట్లతో అనిల్ గట్టెక్కారు. మరోవైపు సీనియర్లుగా ఉన్న ఆదాల ప్రభాకర్ రెడ్డి, మానుగుంట మహీధర్ రెడ్డి సైతం పార్టీని పెడతారని తెలుస్తోంది. మహీధర్ రెడ్డిని తప్పించి కొత్త అభ్యర్థిని కందుకూరులో తెచ్చారు. దీంతో మహీధర్ రెడ్డి మనస్థాపంతో ఉన్నారు. అటు నెల్లూరు రూరల్ లో సైతం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి అనుకూలంగా ఉండడంతో ఆదాల ప్రభాకర్ రెడ్డి సైతం పునరాలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వేంరెడ్డి లాంటి నమ్మకమైన నేత వైసీపీని వీడుతుండడంతో.. ఆయనను చాలామంది నేతలు అనుసరించనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికైతే నెల్లూరు జిల్లా వైసీపీలో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. ఈ తరుణంలో విజయ్ సాయి రెడ్డి జానియర్లతో ఎలా నెట్టుకోస్తారో చూడాలి.

రక్తహీనతతో బాధపడుతున్నారా? ఈ 10 పండ్లతో సమస్య పరార్..

భారతదేశంలో ఆందోళన కలిగించే అతి పెద్ద కారణాలలో రక్తహీనత ఒకటి. అనేక సర్వేల ప్రకారం, మిలియన్ల మంది భారతీయ యువతులు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎర్ర రక్త కణాల ప్రధాన విధి ఊపిరితిత్తుల నుండి శరీర కణాలకు ఆక్సిజన్‌ను రవాణా చేయడం. =దీజలలో హిమోగ్లోబిన్ అనే ప్రోటీన్ ఉంటుంది. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలు మెయింటెయిన్‌లో ఉంటాయి. ఆహారంలో చేర్చడానికి కొన్ని ఆహార వనరులు జంతువుల మాంసం, చేపలు, పౌల్ట్రీ, గుడ్లు, బీన్స్, కాయధాన్యాలు, ఆకుపచ్చ ఆకు కూరలు. విటమిన్ సి ఉన్న ఆహారాలు శరీరంలో ఐరన్ శోషణను పెంచుతాయి. ఐరన్ సాధారణంగా జామ, క్యాప్సికమ్, బెర్రీలు, నారింజ, టమోటాలు, మొలకెత్తిన చిక్కుళ్ళు వంటి తాజా పండ్లు, కూరగాయలలో కనిపిస్తుంది. అధిక హిమోగ్లోబిన్ స్థాయిలు మన ఆరోగ్యానికి చాలా అవసరం. మన ఆహారంలో పండ్లను చేర్చుకోవడం వల్ల సహజంగా హిమోగ్లోబిన్ ఉత్పత్తిని పెంచుకోవచ్చు. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచే సామర్థ్యానికి ప్రసిద్ధి చెందిన 10 పండ్లు ఇక్కడ ఉన్నాయి. ? యాపిల్ పండు: ఐరన్, విటమిన్ సి పుష్కలంగా ఉన్న యాపిల్స్ ఐరన్ కోసం ఎంతగానో సహాయపడతాయి. హిమోగ్లోబిన్ పెరిగేలా చేస్తాయి.

- దానిమ్మ: ఐరన్, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లతో నిండిన దానిమ్మ ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది.
- అరటిపండ్లు: ఐరన్, విటమిన్ B6 సమృద్ధిగా ఉన్న అరటిపండ్లు హిమోగ్లోబిన్ సంశ్లేషణలో సహాయపడతాయి. మన రక్తం ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుంది.
- కమల పండు: నారింజలో విటమిన్ సి ఉంటుంది. ఇది ఐరన్ శోషణను సులభతరం చేస్తుంది. హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది.
- జామ పండు: విటమిన్ సి, ఐరన్ అధికంగా ఉండటం వల్ల, ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు, హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడానికి బేరిపండు సహకరిస్తుంది.
- స్ట్రాబెర్రీలు: స్ట్రాబెర్రీలో విటమిన్ సి, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఇది ఇనుమును గ్రహించడంలో సహాయపడుతుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది.
- పుచ్చకాయ: అధిక నీటి శాతం, ఐరన్, విటమిన్ సి పుష్కలంగా ఉన్న పుచ్చకాయ పండ్లు హిమోగ్లోబిన్ ఉత్పత్తిని పెంచుతాయి. రక్త పరిమాణాన్ని నిర్వహిస్తాయి.
- కివి పండ్లు: విటమిన్ సి కంటెంట్ ఉన్న కివి పండు ఐరన్ పెంచడంతో సహాయపడుతుంది. అలాగే హిమోగ్లోబిన్ ఉత్పత్తికి మద్దతు ఇస్తుంది.
- ద్రాక్ష: ఐరన్, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే ద్రాక్ష పండు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. హిమోగ్లోబిన్ ఏర్పడటానికి దోహదం చేస్తుంది.
- నేరేడు పండు: ఐరన్, విటమిన్ సి పుష్కలంగా ఉన్న నేరేడు పండ్లు హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడానికి, మొత్తం రక్త ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

నిమ్మ రసం తాగుతున్నారా? ఈ సైడ్ ఎఫెక్ట్స్ తెలుసుకోండి!

వేసవి కాలం వచ్చిందంటే నిమ్మకాయలకు గిరాకీ పెరుగుతుంది. సమ్మర్ సీజన్‌లో నిమ్మకాయ నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. వేసవిలో శరీరానికి కావల్సిన నీరు అందించడంతోపాటు, జీర్ణ సమస్యలను తొలగించడం, బరువు నియంత్రణలో కూడా సాయం చేస్తుంది. కానీ నిమ్మ నీరు ఎక్కువగా తాగితే దుష్ప్రభావాలు ఉంటాయని మీకు తెలుసా?

నిజానికి నిమ్మలో ప్రోటీన్, కొవ్వు, కార్బోహైడ్రేట్లు, పొటాషియం వంటి ఖనిజాలు , ఫోలేట్ వంటి పోషకాలతో తోపాటు సీ విటమిన్ అధికంగా లభిస్తుంది. నీటికి రుచిని ఇవ్వడంతో పాటు, నిమ్మ రసం చర్మానికి మెరుపు నిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కానీ మోతాదు మించి తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమంటున్నారు ఆరోగ్య నిపుణులు.

నిమ్మరసం- సైడ్ ఎఫెక్ట్స్

- గుండెల్లో మంట వస్తుంది. మోతాదు మించితే పెప్టిక్ అల్సర్ వచ్చే ప్రమాదం, గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి (% + జు = ణ %) ఉన్నవారు నిమ్మరసం ఎక్కువగా తీసుకోవడం మానుకోవాలి. అలాగే సిట్రస్ పండ్ల తరచుగా తీసుకొంటే మైగ్రేన్, తలనొప్పి పెరుగుతాయి.
- డీహైడ్రేషన్ తలెత్తే ప్రమాదం ఎక్కువే. ఎందుకంటే లెమన్ వాటరతో మూత్రం అధికమై, శరీరంలోని నీరు బయటకు పోతుంది. దీంతో ఎలక్ట్రోలైట్లు , సోడియం వంటి మూలకాలు కూడా బయటకు వెళ్ళిపోతాయి. అతిగా సేవిస్తే పొటాషియం లోపం ఏర్పడుతుంది.
- విటమిన్ సీ మోతాదు ఎక్కువై, రక్తంలో ఐరన్ లెవల్స్ పెరుగుతాయి. కొన్ని సందర్భాల్లో అంతర్గత అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులోని సిట్రిక్ యాసిడ్, ఆక్సలేట్ ఎక్కువగా తీసుకోవడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం.
- ఎసిడిటీ వస్తుంది.
- ఎముకలపై ప్రతికూల ప్రభావం పడుతుంది.
- టాన్సిల్ సమస్య ఉన్నవారు నిమ్మరసానికి దూరంగా ఉండాలని, ఇది గొంతునొప్పి దారితీస్తుందని పలు అధ్యయనాల ద్వారా తెలుస్తోంది
- నిమ్మలోని సిట్రస్ వల్ల పళ్ల ఎనామిల్‌కు నష్టం. దంత సమస్యలు కూడా వస్తాయి

డ్రై ఫ్రూట్స్ తినేటప్పుడు ఈ తప్పులు చేస్తున్నారా.. అంతే సంగతి..

శ్రేష్ఠ భారతి, ఫీచర్స్

రోజువారీ పనులను చురుకుగా చేసుకునేందుకు, అలాగే బలంగా ఉండటానికి డ్రై ఫ్రూట్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. డ్రై ఫ్రూట్స్‌తో రోజు ప్రారంభించడం వల్ల రోజంతా ఎనర్జిటిక్‌గా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. నిజానికి డ్రై ఫ్రూట్స్‌లో ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరం నుండి అలసట, బలహీనతను తొలగించడంలో సహాయపడుతుంది. అలాగే ఎముకలను బలోపేతం చేసి, రోగ నిరోధక శక్తిని కూడా బలోపేతం చేసే కొన్ని డ్రై ఫ్రూట్స్ ఉన్నాయి. డ్రై ఫ్రూట్స్ తినడానికి సరైన సమయం చాలా మందికి తెలిసుండదు. కొంతమంది ఖాళీ కడుపుతో డ్రై ఫ్రూట్స్ తింటారు. దాని వల్ల లాభాలకు బదులు నష్టాలను చవిచూస్తుంటారు. డ్రై ఫ్రూట్స్ తప్పుడు పద్ధతిలో తినడం వల్ల మీ ఆరోగ్యానికి హాని కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఖాళీ కడుపుతో ఏ డ్రై ఫ్రూట్స్ తినకూడదు, దాని వల్ల కలిగే నష్టాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

కిస్మిస్.. ఎండుద్రాక్షలో షుగర్ పుష్కలంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో లేదా ఉదయాన్నే ఎండుద్రాక్ష తినడం వల్ల మీ శరీరంలో బ్లడ్ షుగర్ లెవల్స్ అకస్మాత్తుగా పెరుగుతాయి. ఇప్పటికే మధుమేహం ఉన్నవారు ఖాళీ కడుపుతో ఎండుద్రాక్ష అస్సలు తినకూడదట. దీనితో పాటు కొంతమందికి కొన్నిరకాల అలెర్జీలు కూడా వస్తాయట. అందుకే వైద్యుడిని సంప్రదించకుండా ఎండుద్రాక్ష తినకూడదని చెబుతున్నారు.

ఖర్జూరం.. ఖర్జూరం తింటే వేడి కలుగుతుంది. అందుకే వేసవి కాలంలో వీటిని తినకూడదని డైటీషియన్లు చెబుతున్నారు. అలాగే అధిక రక్తపోటు సమస్య ఉన్నవారు ఖాళీ కడుపుతో ఖర్జూరాన్ని తినకూడదు. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారు ఖాళీ కడుపుతో ఖర్జూరాన్ని తినకూడదని చెబుతున్నారు.

హీరో నుంచి చౌకైన స్కూటర్..

ఏకంగా రూ. 30 వేలు తగ్గింపు.. ధర, ఫీచర్లు చూస్తే ఇప్పుడే ఇంటికి తెచ్చేస్తారు..!

ఎలక్ట్రిక్ స్కూటర్‌ను అప్ డేట్ చేసిన తర్వాత, దానిని కొత్త రూపంలో విడుదల చేసింది. నవీకరణతో పాటు, కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ ధరను కూడా తగ్గించింది.

హీరో అప్‌డేట్‌తో పాటు విడా V1 ప్లస్‌ను భారతదేశంలో ప్రారంభించింది. ఇతర హీరో మోడళ్లతో పోలిస్తే Vida V1 Plus ధర రూ. 30 వేలు తగ్గింది. అయితే స్కూటర్ ఫీచర్లు, పనితీరు మెరుగుపడింది.

Vida V1 Plus కొత్త ధర

హీరో మోటోకార్ప్ విడుదల చేసిన ఎలక్ట్రిక్ స్కూటర్ ఎక్స్-షోరూమ్ ధర రూ.1.15 లక్షలు. ఇంతకుముందు Vida V1 ప్రో మోడల్‌ను విడుదల చేశారు. దీనితో పోల్చితే విడా వీ1 ప్లస్ ధర రూ.30 వేలు తగ్గింది. Vida V1 Plus అనేది Vida V1 ప్రో అప్ డేట్ చేసిన మోడల్.

జనవరి 2024లో అధిక విక్రయాలు..

హీరో ఎలక్ట్రిక్ స్కూటర్ల అమ్మకాలు గతేడాది జనవరి 2023తో పోలిస్తే 2024 జనవరిలో 6.46 శాతం తగ్గాయి. ఇప్పుడు కంపెనీ Vida V1 ప్రోని అప్ డేట్ చేసింది. Vida V1 ప్లస్‌ని ప్రారంభించింది. అలాగే Vida V1 Proతో పోలిస్తే Vida V1 Plus ధర రూ.30 వేలు తగ్గింది. హీరో మోటోకార్ప్ జనవరి 2024లో 1494 యూనిట్ల ద్విచక్ర వాహనాల ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించింది. అదే సమయంలో, గత ఏడాది జనవరి 2023 నెలలో 6.46 శాతం ఎలక్ట్రిక్ స్కూటర్లు అమ్ముడయ్యాయి. సెప్టెంబర్ 2023లో హీరో రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేసింది. మొదటి సారిగా, హీరో ఒక నెలలో 3000 యూనిట్లను విక్రయించింది. హీరో విడా వి1 ప్లస్ ధరను తగ్గించి, ప్రజల బడ్జెట్‌కు అనుగుణంగా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది.

Vida V1 Plus% ఫీచర్లు..

Vida V1 Plus, Vida V1 Pro రెండూ 6kW ఎలక్ట్రిక్ మోటారును కలిగి ఉన్నాయి. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ పూర్తిగా డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను కలిగి ఉంది. LED లైటింగ్, బహుళ రైడ్ మోడ్‌లు కూడా ఉన్నాయి. Vida V1 Plusలో స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ ఎంపిక కూడా అందించింది.

నేడు స్టాక్ మార్కెట్ స్పెషల్ సెషన్.. ఎందుకంటే?

స్టాక్ మార్కెట్లు సెలవు రోజు అయినా శనివారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సైట్లలో స్పెషల్ ట్రేడింగ్ జరిగింది. డిజాస్టర్ రికవరీ సైట్ పనితీరును సమీక్షించేందుకు ఈ స్పెషల్ ట్రేడింగ్‌ను నిర్వహించాయి. ఇందులో భాగంగా మొదటి ట్రేడింగ్ సెషన్ ఎన్?ఎస్?ఈ, 2వ సెషన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి సంబంధించిన రికవరీ సైట్లో నిర్వహించారు. ప్రధాన సైట్‌కు అవాంతరాలు తలెత్తితే ట్రేడింగ్ అంతరాయం ఏర్పడకుండా ఎక్స్ఛేంజీలు ఈ డిజాస్టర్ సైట్ను నిర్వహిస్తుంటాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు శనివారం నిర్వహించిన రెండు స్పెషల్ ట్రేండింగ్ సెషన్?లో భారీ లాభాలను ప్రదర్శించాయి. సెన్సెక్స్? 58 పాయింట్లు లాభపడి 73,804 వద్ద ముగిసింది. నిఫ్టీ 39 పాయింట్లు వృద్ధి చెంది 22,419కు చేరి ఆల్ టైమ్ హై రికార్డును నమోదు చేసింది. ఇక టాటా స్టీల్?, టాటా మోటార్స్, విప్రో, ఐటీసీ, ఏసియన్ పెయింట్స్?, ఎస్?బీఐ, టీసీఎస్?, భారతీ ఎయిర్?టెల్? టాప్ గెయినర్లుగా నిలిచాయి.

5 నెలల గరిష్ట స్థాయికి తయారీ రంగం

ఫ్యాక్టరీ ఉత్పత్తి, అమ్మకాలలో పదునైన పెరుగుదల, డిమాండ్? వల్ల భారతదేశ తయారీ రంగం వృద్ధి ఫిబ్రవరిలో ఐదు నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది.

కాలానుగుణంగా సర్దుబాటు చేసే మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జనవరిలో 56.5 నుంచి ఫిబ్రవరిలో 56.9కి పెరిగింది. పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) పరిభాషలో, 50 కంటే ఎక్కువ ప్రింట్ అంటే విస్తరణ అని అర్థం కాగా, 50 కంటే తక్కువ అయితే స్కోర్ సంకోచించినట్టు భావించాలి. సర్వే ప్రకారం, ఉత్పత్తి గత ఐదు నెలల్లో అత్యంత వేగంతో పెరిగింది. గత సెప్టెంబర్ నుంచి అమ్మకాలు వేగంగా పెరగడానికి 21 నెలల పాటు కొత్త ఎగుమతి ఆర్డర్లు కారణం. దేశీయ, విదేశీ డిమాండ్ రెండింటి మద్దతుతో ఉత్పత్తి వృద్ధి బలంగా కొనసాగిందని హెచ్?ఎస్?బీసీ ఆర్థికవేత్త ఇనెస్ లామ్ అన్నారు. వృద్ధి ఊపందుకున్నప్పటికీ తయారీ రంగంలో ఉపాధి పెరగలేదు. ఇన్‌పుట్ ధరల ద్రవ్యోల్బణం జులై 2020 నుంచి కనిష్ట స్థాయికి పడిపోయినందున తయారీ సంస్థల మార్జిన్‌లు మెరుగుపడ్డాయని లామ్ చెప్పారు. బలమైన దేశీయ డిమాండ్‌తో పాటు, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, బ్రెజిల్, కెనడా, చైనా, యూరప్, ఇండోనేషియా, అమెరికా తదితర దేశాల నుంచి కొత్త ఎగుమతి ఆర్డర్లు వేగంగా పెరిగాయి.

తీర్థయాత్రలు ... అంతరార్థాలు

నానా శ్రాంతాయ శ్రీరస్తి రోహిత శుశ్రుమ పాపో నృషద్వరో జన ఇంద్ర ఇచ్చరతః బాగా చరైవేతి

భారతీయ జీవనవిధానంలో తీర్థయాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. ఐతరేయ బ్రాహ్మణంలో హరిశ్చంద్రుని పుత్రుడైన రోహితునికి అతని గురువులైన పర్వత, నారదులు ఈ శ్లోకాన్ని ఉపదేశించారు. 'ఓ రోహిత! అన్ని విధాలా కష్టపడిన వానికే సంపదలు వశమౌతాయి. ఏ పనీ చేయకుండా కాలం గడిపే వ్యక్తి దోషిగా మిగిలిపోతాడు. లోకసంచారం చేసేవారికి ఇంద్రుడే మిత్రుడౌతాడు. అందుకని లోకంలో సంచరించు." అని చెప్పారు.

ఏకాంతంలో అతిథితో సంభాషిస్తున్న రామునికి దుర్వాసమహర్షి వచ్చాడని అనుమతి లేకుండా వచ్చి తెలియజేసిన లక్ష్మణునికి రాజధర్మముల ననుసరించి దేశబహిష్కారశిక్ష విధించాడు రాముడు. లక్ష్మణుడు తీర్థయాత్రలో తన శేషజీవితాన్ని గడిపాడు. అదే విధంగా ద్రౌపదితో ఏకాంతంలో ఉన్న ధర్మరాజుకు ఏకాంత భంగంచేసిన అర్జునుడు ఒక సంవత్సరకాలం నిషేధాన్ని పొంది తీర్థయాత్రలో కాలం గడిపి అపారమైన అనుభవాన్ని, ఎన్నో విశిష్ట శక్తులను సంపాదించారని మహాభారతం చెబుతున్నది. పాండవులు 12 సంవత్సరాల వనవాసకాలంలో ఎన్నో ఆశ్రమాలను దర్శించారు. ఎన్నో పవిత్ర నదీక్షేత్రాలను చూశారు. వారు ఆ సమయంలో పొందిన అనుభవాలు, జ్ఞానం, శక్తి అనంతం.

తీర్థ శబ్దానికి శాస్త్రం, యజ్ఞం, పుణ్యక్షేత్రం,

రాజనీతి ఉపాయం, ఉపాధ్యాయుడు, ఋషులు సేవించిన నదీ, తటాకాదులు, అవతారం, మంత్రి, వేదములు, అగ్ని హోత్రం ఇలా అనేక అర్థాలున్నాయి. పండితుల్ని సేవించి అరుదైన శాస్త్రాలను తెలుసుకోవటానికి, యజ్ఞాలను చూడటానికి, (యజ్ఞాల వల్ల వర్షాలు పడతాయి. కనుక యజ్ఞసంస్కృతిని ప్రోత్సహించడం కోసం), పుణ్యక్షేత్రాలను దర్శించి పునీతులు కావడం కోసం, ప్రజాహితం కోసం రాజనీతి ఉపాయాలను సంపాదించటం కోసం, గొప్ప గురువులు తారసిల్లితే వారి అనుగ్రహంతో మంచి ఆశీస్సులను పొందటం కోసం, వివిధ దేవతామూర్తులను వీక్షించడం కోసం, వేద విద్యను రక్షించడం కోసం ... తీర్థయాత్రలు చేయాలన్నమాట.

ధర్మశాస్త్రంలో చెప్పిన విధంగా తీర్థాలు జంగమ, స్థావర, మానసములని మూడు రకాలు. మహా పురుషులు, ఆచారపరాయణులు కదిలే తీర్థములట. అందుకని వీరిని జంగమ తీర్థములు అంటారు. వారి మాటలు వింటే చాలు విన్నవారికి జీవితం, మనస్సు, బుద్ధి పవిత్రతని పొందుతాయట. ఇక మానసిక తీర్థములు అంటే సత్యం, క్షమ, ఇంద్రియనిగ్రహం, సర్వభూతదయ, అంతటా ఋజుప్రవర్తన కలిగి ఉండటం, దానం, దమము, సంతోషం, బ్రహ్మచర్యం, అందరితో మధురంగా మాట్లాడటం, జ్ఞానం, ధృతి, పుణ్యం... అని బ్రహ్మాండ పురాణంలో చెప్పారు. వీటివల్ల మనస్సు శుద్ధమౌతుంది. ఇక భౌమతీర్థాలు.. నదులు, ప్రాచీనమైన చెరువులు, పుణ్యక్షేత్రాలు, ప్రాచీన దేవాలయాలు వంటివి.

మహాపురుషులను చూడటం కోసం, పైన చెప్పిన సద్గుణాలను అలవర్చుకోవాలని, దివ్య ప్రాంతాల్లో ఆ క్షేత్ర మహత్యాన్ని అనుభవించటానికి తీర్థయాత్రలు చేయాలి. ఏ వ్యక్తి అయినా ఉన్నత సంస్కారాలను పొందాలనుకున్నా, తాను చేసిన పాపాలు పోవాలనుకున్నా, మహాపురుష సందర్శనం కావాలనుకున్నా, తటాకాదులలో స్నానం చేయటం వల్ల వివిధ ఓషధీ వనాలమీదుగా ప్రవహించే వాటి ప్రభావం వల్ల పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందాలన్నా, మంచి బుద్ధి వికాసం కావాలన్నా తీర్థయాత్రలు ఉపయోగపడతాయి.

ఈ ప్రపంచంలో 'మతం' అనేదే లేని చోటు ఒకటి ఉండేది. అది వేద కాలపు భారత(ప్ర)దేశం. 'భా' అంటే 'కాంతి' లేదా 'ప్రకాశం' అనీ, 'రత' అంటే 'అంకితమైన', 'ఆసక్తి కల' అనీ అర్థాలు. భగవంతుడు కాంతి రూపుడు. భారతం' అంటే 'భగవంతుడికి అంకితమైనది' లేదా 'భగవంతుడిపై ఆసక్తి కలది' అని భావం. అలాంటి భారతదేశంలో మతం లేని భగవత్ చింతన మాత్రమే ఉండేది. అది వేద ప్రతిపాదితం. వేదంలో మతం లేదు. మతం లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించేవారు. మహర్షుల ఉపదేశాలూ, సందేశాలూ, పరిశీలనలూ, ప్రతిపాదనలూ వేదం అయినాయి.

వేదంలోకి వెళ్దాం

మొదట మూడు! తరువాత నాలుగు!!

'వేదం' అంటే విద్య లేదా జ్ఞానం అని అర్థాలు. తొలి దశలో వేదం ఒకటే. ఆపై మూడు విభాగాలై 'త్రయీ విద్య' అయింది. 'ఋక్', 'యజుర్', 'సామ' అని ఆ విభాగాలకు పేర్లు. మహాభారత కాలానికి కూడా వేదం త్రయీ విద్య గానే ఉండేది. అటు తరువాత 'అథర్వ' అన్న మరొకదానితో వేదం నాలుగు విభాగాలు లేదా శాఖలయింది. వేదం అన్నది నైతిక మార్గదర్శకాల, కర్మ కాండల, ప్రవర్తనా సూత్రాల క్రోడీకరణ కూడా! దైనందిన జీవనానికీ, అధ్యాత్మిక అభ్యాసానికీ మహర్షులు పలువురి సమష్టి ప్రయత్నమే వేద సంపుటి. 'వేద యతి యతో ధర్మాధర్మ ఇతి వేదః' ధర్మా ధర్మాలను తెలియజేసేది వేదం.

మంత్రాలు... బ్రాహ్మణాలు... ఆరణ్యకాలు... ఉపనిషత్తులు!

వేదం నాలుగు భాగాలుగా ఉంటుంది. మంత్రం, బ్రాహ్మణం, ఆరణ్యకం, ఉపనిషత్ అనేవి. మంత్ర భాగాన్ని 'సంహిత' అని కూడా అంటారు. ఈ సంహితలు అయిదు. అవి ఋక్ సంహిత, కృష్ణ యజుస్సంహిత, శుక్ల యజుస్సంహిత, సామ యజుస్సంహిత, అథర్వ సంహిత. ఇక, బ్రాహ్మణాలు అయిదు. అవి ఐతరేయ బ్రాహ్మణం, తైత్తిరీయ బ్రాహ్మణం, శతపథ బ్రాహ్మణం, షడ్వింశ బ్రాహ్మణం, గోపథ బ్రాహ్మణం. మంత్రం అన్నదానికి పలు అర్థాలున్నాయి. యజ్ఞం చేసే వాళ్లు పలికే శబ్ద సమూహం మంత్రాలే. మంత్రాలను 'ఋక్, యజుస్, సామ'లని అన్నారు. ఋక్‌లు అంటే స్తుతులు, దైవ ప్రార్థనలు. వీటిని 'సూక్తాలు' అనీ అన్నారు. వేద సాహిత్య మంతా మంత్రాలే. మంత్రం లేదా సంహిత భాగానికి వివరణలు బ్రాహ్మణాలు. యజ్ఞాలను నిర్వహించే తీరును బ్రాహ్మణాలు వివరిస్తాయి.

ఋక్‌లు, బ్రాహ్మణాలు కర్మకాండకు సంబంధించినవి. మంత్రం, బ్రాహ్మణ శాఖల తరువాత ఆరణ్యకాలు ఉంటాయి. ఆరణ్యకాలు రెండు మాత్రమే కనిపిస్తున్నాయి. అవి ఐతరేయారణ్యకం, తైత్తరీయారణ్యకం. ఆరణ్యకాలు వైరాగ్యాన్ని ఉపదేశిస్తాయి. వానప్రస్థాశ్రమంలో అరణ్యాలలో అధ్యయనం చెయ్యడం వల్ల అవి 'అరణ్యకాలు' అని అనిపించుకున్నాయి. చివరి సమన్వయం (సింథసిస్) ఉపనిషత్తులలో తెలుస్తుంది. ఉపనిషత్తులు ఆధ్యాత్మికత వైపు నడిపిస్తాయి. అందుకనే వాటిని 'బ్రహ్మకాండ' అని అన్నారు. ఉపనిషత్తులు 108 కనిపిస్తున్నా పది ఉపనిషత్తులు మాత్రమే మౌలికమైనవి, ముఖ్యమైనవి. ఆది శంకరాచార్యులు దశోపనిషత్తులకు మాత్రమే భాష్యాలు రాశారు. అవి ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరి, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకాలు. ఇవన్నీ కలుపుకొంటేనే వేద వాఙ్మయం.

ఏనాటిది ఈ వేదం?

వేదానికి మూలం, కాలం ఇప్పటి వరకూ సరిగ్గా తెలియరాలేదు. అనుకోవడాలూ, అభిప్రాయపడడాలూ, వాదోపవాదాలూ ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కానీ వేదం జీవనది అయి భారతం నుంచి ప్రపంచంలోకి ప్రవహించింది. జీస్‌సకు పదిహేడు శతాబ్దాల ముందే వేదం అరేబియాకు చేరింది. హీబ్రూ భాషలో ఉన్న పాత టెస్టమెంట్‌లో వేద సాహిత్యపు శైలీ, భావాలూ ఉన్నాయని విన్సెంట్ ఎ. స్మిత్ అనే పరిశీలకుడు తెలియజేస్తున్నాడు. వేదాన్ని దృష్టిలో పెట్టుకుని మహమ్మద్ నబికి కన్నా ముందు ఇప్పటికి 2,400 ఏళ్లకు పూర్వం జీవించిన అరబ్బీ కవి, దార్శనికుడు లబీబ్ ఇలా అన్నాడు "ఓ ఆశీర్వదించబడిన హిందూ భూమీ, నువ్వు గౌరవించతగిన దానివి. ఎందుకంటే నీలో భగవంతుడు తన నిజమైన జ్ఞానాన్ని ప్రకటించాడు". విశ్వ గ్రంథ భాండాగారంలో ప్రథమ గ్రంథం 'వేదం' అని పరిశీలకులు నిర్ధారించిన దాన్ని మనం గుర్తుంచుకోవాలి.

ఆధునిక భావాలెన్నో!

వేదంలోని మొదటి అక్షరం 'అ'. భారత భూమిపై వెలసి నెలకొన్న తాత్త్విక, సాత్విక రచనలకన్నిటికీ వేదమే అధారం. 'ఫిలాసఫీ' అని మనం ఆ రచనల్ని అనకూడదు. 'వాస్తవిక విద్యను దర్శించడంలో హేతువునూ, తార్కికతనూ ఉపయోగించడం 'ఫిలాసఫీ' అవుతుంది. కానీ మనవి వేద జనిత రచనలు కనుక అవి ఫిలాసఫీ అవవు.

'వసుధైక కుటుంబకం' (భూమి ఒక చిన్న కుటుంబం) అన్న విశ్వభావన ప్రపంచ వాఙ్మయంలో తొలిసారి వెలువడింది వేదం నుంచే. శక్తి కేంద్రాల వంటి పలు దేవతలు వేదంలో కనిపిస్తున్నా 'పరమ పురుషుడు ఒక్కడే' (తస్మాత్సర్వే రపి పరమేశ్వర ఏవ హూయతే!) అని వేదం తొలిసారిగా మానవాళికి తెలియజేసింది.

'ఎవరైతే అన్ని ప్రాణులనూ తమలో చూస్తారో, అన్ని ప్రాణులలోనూ తమను చూస్తారో అటువంటి వారికి రోత లేదా విద్వేషం కలగదు' (యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవాను పశ్యతి, సర్వ భూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే) అని మానవజాతికి తొలిసారి చెప్పి సర్వ జీవ సామరస్యాన్ని నిర్దేశించింది వేదమే. ఎన్నో సార్వకాలిక, సార్వజనీన సత్యాలు వేదం నుంచి పుట్టి ప్రపంచమంతా వ్యాపించాయి.

'సంఘాన్ని ప్రేమించు గౌరవించు, ఆకలి చేత పీడించబడిన వాళ్లను రక్షించు' అని వేదం మానవాళికి నేర్పింది. వర్ణ, లింగ వివక్షలు లేని సమాజాన్ని వేదం నిర్దేశించింది. వేదంలో ఒక వధువు, వరుడితో "నేను ఋక్ (సాహిత్యం), నువ్వు సామం (గానం)" అని అంటుంది. స్త్రీపురుషుల సంబంధం ఎలా ఉండాలో ఇక్కడ చెప్పింది వేదం. మరో చోట ఓ స్త్రీ "నేను శిరస్సును, నేను జెండా(పతాకం)ను, నేను నిప్పుల మాటలు పలుకుతాను. నా భర్త నన్ను అనుసరించనీ!" అంటుంది. ఇక్కడ స్త్రీ స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, స్త్రీ స్వాభిమానం వ్యక్తమవుతున్నాయి.

'ఓ నమ్మకమా! మాకు నమ్మకాన్నివ్వు, భయం నుంచి విముక్తి నివ్వు, అంతులేని సంపదలకు మమల్ని అధిపతుల్ని చెయ్యి, శ్రేష్ఠమైన జ్ఞానాన్ని ప్రసాదించు' అని మనతో పరమాత్మను అడిగిస్తోంది వేదం. అమెరికా దేశపు తత్త్వవేత్త ఆర్.డబ్ల్యూ. ఎమర్సన్ (ఎమర్సన్ కాదు) "వేదంలోని భావం ఉష్ణంపై కాంతిలా ఉన్నతమైనది" అని అన్నాడు. "పరమాత్మ మనల్ని రక్షించాలి, మాకు పోషణనివ్వాలి, మాకు విద్యలలో సామర్థ్యం కలగాలి, తేజస్వులైన మాకు బ్రహ్మవిద్య అవగతం కావాలి, మాలో మాకు విద్వేషాలు కలగకుండా ఉండాలి" (ఓం సహనా వవతు సహనౌ భునక్తు, సహవీర్యమ్/ కరవావహై, తేజస్వీ నావధీ తమస్తు మా విద్విషా వ హై) అని వేదం మన చేత ప్రార్థన చేయిస్తూంటుంది.

వేదాన్ని 'శ్రుతి' అని కూడా అంటారు. మనకు తెలుసు గానానికి శ్రుతి ఉంటుందని. గానం శ్రుతిలోనే ఉండాలి. మన జీవన గానాలు శ్రుతిలోనే సాగాలి. మనం శ్రుతిలో కలవాలి. వేదాలలోకి వెళదాం. సత్యాలను ఆస్వాదిద్దాం.

అన్నదాత అవధూత!

"పేదవాడి ఆకలి తీర్చడం, లేనివాడి కడుపు నింపడం... ఇదే నిజమైన మాధవ సేవ!" అని బోధించిన అవధూత కాశిరెడ్డి నాయన. కష్టాలు తీర్చే పెన్నిధిగా ఎందరికో ఆరాధ్యుడైన ఆధ్యాత్మిక గురువు. సామాన్యులను ఆదుకోవడం కోసం జీవితాంతం పాటుపడిన మహనీయునిగా ప్రసిద్ధి చెందిన కాశిరెడ్డి నాయన అసలుపేరు మున్నళ్లి కాశిరెడ్డి. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం బెడుసుపల్లిలో సుబ్బారెడ్డి, కాశమ్మ దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు.

ఒకవైపు ఆటపాటలూ, మరోవైపు ఆధ్యాత్మిక చింతనతో ఆయన బాల్యం గడిచింది. పదహారేళ్ళ వయసులో చదువు చాలించి, వ్యవసాయ పనులు చేపట్టారు. ఒకసారి వేపచెట్టు కింద కాశిరెడ్డి కూర్చొని ఉండగా, ఆయనకు అంతర్వాణి దిశా నిర్దేశం జరిగింది. సొంత ఊరు నుంచి ప్రకాశం జిల్లా వెలుగొండ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ అతిరాచ గురవయ్య స్వామిలో ఆయనకు సద్గురు సాక్షాత్కారం అయింది. గురవయ్య స్వామి శిష్యరికంలో మంత్రోపదేశం పొందారు. తన గమ్యమేమిటో అవగతం అయింది. గురువు సూచన మేరకు తీర్థయాత్రలు ప్రారంభించారు. కన్యాకుమారి మొదలు కాశీ వరకూ దేశంలో కాశిరెడ్డి దర్శించని క్షేత్రం లేదు. కాశీలో మూడేళ్ళు గడిపారు. గరుడాద్రి వద్ద పన్నెండేళ్ళు తపస్సు చేశారు. తరువాత పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ అన్న దానం, గోసేవ, ఆలయాల జీర్ణోద్ధరణలపై విస్తృతంగా ప్రచారం చేశారు.

అన్నాన్ని పంచుకోవాలి!

"అమ్మా.. ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టండి. శక్తి లేకపోతే గంజి పోయండి. పది మంది అన్నం ఒక్కరు తినకూడదు. నలుగురికి సరిపోయే అన్నం పది మంది పంచుకోవాలి!" అని కాశినాయన బోధించేవారు. నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో ఎందరినో ఆదుకున్నారు. నీడనిచ్చారు. ఆకలి తీర్చారు. కష్టాలలో తోడూనీడగా నిలిచారు. భక్తులు ఆయనను తండ్రిగా భావించేవారు. కాశిరెడ్డి నాయన అని ఆప్యాయంగా పిలుచుకొనేవారు. కాశిరెడ్డి నాయన ఎన్నో ఆలయాలను పునరుద్ధరించారు. నెల్లూరు జిల్లాలోని క్రీ.శ 1406 నాటి ఘటిక సిద్ధేశ్వరాలయం 1974లో ఆయన చేతుల మీదుగా పూర్వ వైభవం సంతరించుకుంది. కాశి నాయన 1995 డిసెంబర్ 6న పరమపదించారు.

వందకుపైగా ఆశ్రమాలు

కాశిరెడ్డి నాయన సమాధి ఉన్న కడప జిల్లా నరసాపురం మండలంలోని జ్యోతి క్షేత్రం నిత్యం భక్తులతో సందడిగా ఉంటుంది. ఇది కడప జిల్లా ఆళ్ళగడ్డకు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ నిరంతర అన్నదాన యజ్ఞం కొనసాగుతూ ఉంటుంది. ఏ సమయంలో వెళ్ళినా ఆదరించి, అన్నం పెట్టడం దీని విశిష్టత. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు ఇక్కడకు వస్తూ ఉంటారు.

నరసాపురం మండలం పేరును 'కాశినాయన మండలం'గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్చింది. కాశినాయన పేరిట రాయలసీమ ప్రాంతంలో వందకు పైగా ఆశ్రమాలు నడుస్తున్నాయి. అన్నదానంతో పాటు గోసంరక్షణకు కూడా ఇవి పాటుపడుతున్నాయి. వీటిలో తిరునాళ్ళతిప్ప ఆశ్రమం ఒకటి. ఇది అనేక ఆలయాల సముదాయంతో, పవిత్ర క్షేత్రంగా రూపుదిద్దుకుంటోంది. అలాగే, మహారాష్ట్రలోని షిరిడి నుంచి నాగర్‌సోల్ వచ్చే దారిలో, కర్నూలు, కడప, ప్రకాశం, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో ఎన్నో దేవాలయాలు, ఆశ్రమాలు అన్నార్తులను ఆదుకుంటున్నాయి.

విద్యతో చతుర్విధ పురుషార్థాలు..

సృష్టిలో ప్రతి ప్రకృతి శక్తినీ దేవతగా భావించడం భారతీయ సంప్రదాయంలో విశిష్టత. మన జీవితంలో అత్యవసరమైన ధనం మన దృష్టిలో పట్టి రూపాయి కాదు. సాక్షాత్తూ లక్ష్మీదేవి. అలాగే జ్ఞానాన్నిచ్చే విద్య కేవలం చదువు కాదు. సాక్షాత్తూ సరస్వతీ దేవి. అటువంటి సరస్వతీదేవిని బమ్మెర పోతన తన భాగవతంలో విశేషంగా ప్రార్థించాడు. ఆ పద్యం భారతీయ విద్యావ్యవస్థ మొత్తాన్నీ ప్రతిబింబిస్తుంది.

'క్షోణితలంబు నెన్నుదురు సోకగ
మ్రొక్కినుతింతు సైకత
శ్రోణికి చంచరీకయ సుందరవేణికి, రక్షితామర
శ్రేణికి తోయజాతభవ చిత్త వశీకరణైక వాణికిన్
వాణికి, అక్షదామశుక వారిజ పుస్తక రమ్య పాణికిన్"

ఈ పద్యం చివరిపాదంలో సరస్వతీదేవి చేతుల్లో జపమాల (అక్షదామం), చిలుక (శుకం), పద్మం (వారిజం), పుస్తకం ఉంటాయని వర్ణించాడు. మనం ఇప్పుడు చూస్తున్న సరస్వతి చిత్రంలో జపమాల, పుస్తకం ఉండి మరో రెండు చేతుల్తో వీణవాయిస్తూ ఉంటుంది. పోతన ఈ మూర్తినే వర్ణించి ఉంటే వీణ ఎందుకకు వదిలేస్తాడు? పైగా చేతుల్లో లేని పద్మాన్ని, చిలుకను, చేతుల్లోనే ఉన్నట్లుగా ఎందుకు వర్ణిస్తాడు? అంటే మనం చూస్తున్న సరస్వతీమూర్తి.. పోతన వర్ణించిన మూర్తి వేరని అర్థమవుతోంది కదా! అయితే వీణ లేకుండా అక్షదామ శుకవారిజ పుస్తకాలు చతుర్భుజాల్లో ధరించిన ఈ మూర్తి ఎవరు? పోతన వర్ణించింది 'శారదామూర్తి' అని, ఆవిడ వైదిక విద్యలకు అధిదేవత అని.. మనం చూస్తున్న సరస్వతీ మూర్తి లౌకిక విద్యలకు అధిదేవత అని వేదవిద్యలోను, సంస్కృత సాహిత్యంలోనూ నిష్ణాతులైన పెద్దల అభిప్రాయం. శృంగేరీ శారదాపీఠం వారు ప్రకటించిన శారదామూర్తి ఇందుకు సమర్థన. ఆ తల్లి చేతుల్లో ఈ నాలూగూ ఉంటాయి. వీణ ఉండదు.

కాబట్టి, పోతన ప్రార్థించిన వాణి లలితాదేవి యొక్క జ్ఞానస్వరూపంగా భావించే 'శారదాదేవి' అని బోధపడుతుంది. భారతీయ జీవన విధానంలో ధర్మ, అర్థ, కామ, మోక్షాల సాధనే జీవిత లక్ష్యంగా భావిస్తారు. విద్య ద్వారా ఈ చతుర్విధ పురుషార్థాలను సాధించడమే లక్ష్యమని 'శారదామూర్తి' చేతుల్లోని నాలుగు ప్రతీకలు సూచిస్తున్నాయి. అమ్మవారి చేతుల్లోని పుస్తకం ధర్మానికి ప్రతీక. పద్మం అర్థానికి ప్రతీక. లక్ష్మీదేవి పుట్టింది దాని నుండే కదా! ఇక, మన్మథుడి వాహనమైన చిలుక.. కామ పురుషార్థానికి ప్రతీక. నాలుగోచేతిలోని జపమాల మోక్షానికి ప్రతీక. జపతపాల ద్వారానే కదా సిద్ధిపొందేది! విద్య ద్వారా ఈ నాలుగు పురుషార్థాలనూ సాధించాలని.. అప్పుడే మనిషికి భవబంధాల నుంచి విముక్తి అని తెలియజేయడం కోసమే విద్యాదేవత తన చేతుల్లో ఆ నాలుగు వస్తువులనూ ధరించిందని గ్రహించవచ్చు. 'సావిద్యా యా విముక్తయే' అని గదా ఆర్యోక్తి!!



బ్రెయిన్ స్ట్రోక్...
మామూలు జీవితం సాధ్యమే!

ఆధునిక సమాజం మరో ప్రమాదంలో ఉంది.. ఆ ప్రమాదం పేరే 'బ్రెయిన్ క్'...పేరుకు తగ్గట్టే ఈ బ్రెయిన్ క్ ఒక్కసారి వచ్చిందంటే లైఫ్ ఒక్కసారిగా రివర్స్ అవుతుంది. 50 ఏళ్లు దాటిన ప్రతి అయిదుగురు మహిళల్లో ఒకరికి, ప్రతి ఆరుగురు పురుషుల్లో ఒకరికి ఈ క్ వచ్చే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య గణాంకాల సారాంశం. కానీ సరైన చికిత్సతో, మనో నిబ్బరంతో ఈ క్‌ను తట్టుకొని తిరిగి సాధారణ జీవితాన్ని గడుపుతున్న వాళ్లూ ఉన్నారు.

అసలు ఇంతకీ బ్రెయిన్ స్ట్రోక్ అంటే ఏమిటి? తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి?

మెదడుకు రక్త సరఫరా నిలిచిపోయిన ప్పుడు ఎదురయ్యే సమస్య 'బ్రెయిన్ స్ట్రోక్'. మరో మాటలో చెప్పాలంటే...పక్షవాతం. ఎవరికైనా రావచ్చు. దీనికి వయోభేదం లేదు. ఈ స్ట్రోక్ ఒక్కోసారి మరణానికి దారి తీయడమో లేక ఆ వ్యక్తి పూర్తిగా అంగవైకల్యానికి గురి కావడమో జరుగుతుంది. 2030 నాటికి ఈ స్ట్రోక్ బారిన పడేవాళ్ల సంఖ్య రెండింతలు అవుతుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దురదృష్టవశాత్తూ ఈ మధ్య ఈ స్ట్రోక్‌కు గురైన వాళ్లలో 19 ఏళ్ల వయసు వాళ్లు కూడా ఉంటున్నారు. దీని బారిన పడుతున్న వారిలో ఎక్కువ మంది అంగవైకల్యానికి గురవుతున్నారు. పూర్తిగా తమ పని చేసుకోలేని స్థితిలో పూర్తిగా అన్నిటికీ వేరొకరి మీద ఆధారపడాల్సిన పరిస్థితి వస్తోంది.

కారణాలు

డయాబెటిస్, హైపర్‌టెన్షన్ లక్షణాలు ఉన్న వారే ఈ మధ్య కాలంలో ఎక్కువగా స్ట్రోక్ బారిన పడుతున్నారు.

మరికొన్ని...

1) ధూమపానం, మద్యపానం... ఇవన్నీ ప్రధానమైనవి. కానీ, మన చేతుల్లో ఉన్నవే. వీటిని ఎంత నియంత్రించుకుంటే స్ట్రోక్ రాకుండా శరీరాన్ని కాపాడుకోవచ్చు.

2) వయసు మీరడం, జెనిటిక్ డిస్‌పొజిషన్ వంటివి కూడా స్ట్రోక్ రావడానికి కారణాలే!

పరిస్థితులు మారుతున్నాయి!

ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయి. జంక్ ఫుడ్, వేళకాని వేళలో ఆహారం తినడం, స్ట్రెస్ లెవల్స్ ఎక్కువగా ఉండటం ఇవన్నీ స్ట్రోక్‌కు దారి తీస్తున్నాయి. యువతీయువకుల్లో చాలా మంది ఈ స్ట్రోక్‌కు గురవుతున్నారు. అయితే వీళ్లు రికవర్ కావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలా కొంత మంది పూర్తిగా నయమై మళ్లీ మామూలు స్థితికి వచ్చినవాళ్లూ ఉన్నారు. బ్రెయిన్‌కు ఎదైనా బలమైన గాయం తగిలితే మెదడు వాచిపోతుంది. దీన్ని వైద్య పరిభాషలో 'డిఫ్యూజ్ ఎక్సొనెల్ ఇంజ్యూరీ' అంటారు. ఇలాంటి కేసుల్లో కూడా స్ట్రోక్ వస్తే రికవర్ కావడం ఒకప్పుడు కష్టంగా ఉండేది. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతోంది.

మానసిక స్థైర్యమే అసలైన వైద్యం!

స్ట్రోక్‌కు గురైన వాళ్లకు రీహ్యాబిలిటేషన్ చాలా ముఖ్యం.

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన పేషెంట్లు మానసికంగా ఎంతో క్రుంగిపోతారు. ఒక్కోసారి డిప్రెషన్‌లోకి వెళిపోతారు. ఓ స్నేహితునిగా, ఓ మెంటర్‌గా పేషెంట్ల మానసిక స్థితిని మెరుగుపరచాల్సిన బాధ్యత డాక్టర్‌పైన, కుటుంబసభ్యులపైన ఎప్పుడూ ఉంటుంది.

ఈ స్ట్రోక్‌కు గురైన వారు వారంతట వారు ఏ పని చేసుకోలేరు కాబట్టి ఆ బాధ్యత అంతా రీహ్యాబిలిటేషన్ సిబ్బంది మీదే ఉంటుంది. ఇందులో పేషెంట్ కుటుంబ సభ్యుల పాత్ర కూడా కీలకమే.

పేషెంట్ ఆహారపు అలవాట్లు, అతని ఇష్టాయిష్టాలు కేవలం వారి హెల్పర్‌కే తెలుస్తాయి. ఇవన్నీ రీహ్యాబిలిటేషన్‌లో డాక్టర్లకు సరైన చికిత్స అందించడానికి తోడ్పడతాయి.

పేషెంట్‌కూ అన్ని వేళలా చికిత్స అందించడానికి ఫిజియోథెరపిస్ట్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, సైకాలజిస్ట్, ఫిజియాట్రిస్ట్, పారామెడికల్ డాక్టర్లు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలి.

డైట్ చార్ట్ ఏంటి?

లోకొలస్ట్రాల్, ఫైబర్ కంటెంట్ ఎక్కువ ఉన్న ఆహారం తీసుకోవడం ఎంతో మంచిది.

రీహాబ్‌లో ఇచ్చే డైట్‌నే ఫాలో కావాల్సిన అవసరం ఉంది. ఇంటికెళ్లాక కూడా వీటిని ఫాలో అయితే మళ్లీ స్ట్రోక్ వచ్చే అవకాశాలు తగ్గించుకోవచ్చు.

పూర్తిగా నయం అవుతుందా..?

స్ట్రోక్ పూర్తిగా నయమవుతుందా అంటే కచ్చితంగా చెప్పలేం. పేషెంట్ రీహాబ్‌లో చేరిన మూడు నెలలు చాలా కీలకం. మామూలు జీవితంలోకి వెళ్లి, ఉద్యోగాలకు వెళ్తున్న వాళ్లూ ఉన్నారు. ఒక వేళ వీల్‌ఛైర్‌కే పరిమితమైనా, వాళ్ల పనులు వారు స్వతంత్రంగా చేసుకోగలుగుతారు. అయితే రికవరీ అనేది వారి శారీరక, మానసిక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. ఎవరైతే సరైన సమయంలో స్ట్రోక్‌కు సరైన కారణం గుర్తించి, వైద్యం చేయించుకుంటే వారికి భవిష్యత్తులో ఏ ప్రమాదమూ ఉండదు.

కాలేయాన్ని కడిగేస్తుంది..!

జీలకర్రలో శరీరానికి కాలసినన్ని యాంటీఆక్సిడెంట్లు, ఇతర పోషకాలతో పాటు కొన్ని ముఖ్యమైన తైలాలు, ఫైటోకెమికల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి కాలేయం లోని మలినాలను తొలగించడమే కాకుండా, జీర్ణశక్తినీ, వ్యాధినిరోధక శక్తినీ పెంచుతాయి. ఇతర పోషకాలతో పాటు జీలకర్రలోని, విటమిన్‌సి,కెరోటిన్, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ శరీరంలోని హానికారక ఫ్రీరాడికల్స్‌ను నిలువరిస్తాయి. ఇందుకు ఒక టీస్పూను జీలకర్ర పొడి, అరస్పూను పటిక బెల్లంతో పరగడుపున తింటే చాలు!

శ్వాసకోశాల్లో ఏర్పడే ఇన్‌ఫెక్షన్లను, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ వ్యాధులను నియంత్రించ డంలో జీలకర్ర బాగా తోడ్పడుతుంది. జలుబు, దగ్గును తగ్గించడంలోనూ, ఛాతిలోని కఫాన్ని తొలగించడం లోనూ సమర్థవంతగా పనిచేస్తుంది. అందుకు స్పూను జీలకర్రను నీళ్లల్లో వేసి మరిగించి చల్లారాక తాగాలి.

జీలకర్రలోని కాపర్, జింక్, వంటివి ఎముక మజ్జను ఉత్తేజితం చేయడం ద్వారా, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్ల ఉత్పత్తి మెరుగవుతుంది.

రోజూ జీలకర్రను వాడటం వల్ల చర్మం కందిపోవడం, బొబ్బలు రావడం, మొటిమలు ఏర్పడటం వంటివి దాదాపు ఉండవు. జీలకర్రలో పొస్పరస్‌తో పాటు ఉండే క్యుమినాల్‌డిహైడ్, థైమాల్ వంటివి శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో కీలకంగా పనిచేస్తాయి.

కిడ్నీలు సురక్షితంగా!

నిరంతరం పని చేస్తూ ఉండే కిడ్నీలను సురక్షితంగా కాపాడుకోవలసిన బాధ్యత మనదే! కాబట్టి వాటిలోని మలినాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం కోసం 'కి డ్నీ క్లెన్సింగ్' జ్యూస్‌లు తాగుతూ ఉండాలి.

కాన్‌బెర్రీ జ్యూస్: మూత్రపిండాల సమస్యలకు ఇది దివ్యౌషధం. మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లను పారద్రోలి మూత్రాశయం, మూత్రమార్గాల్లోని బ్యాక్టీరియాను వెళ్లగొడుతుంది.

బీట్‌రూట్ జ్యూస్: దీన్లో యాంటీ కేన్సర్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలుంటాయి. మూత్రం క్షారత్వాన్ని తగ్గిస్తుంది.

పుచ్చరసం: దీన్లో 92 శాతం నీరు ఉంటుంది. ఈ రసం తాగితే మూత్రపిండాల్లోని రాళ్లు కరిగి విసర్జించబడతాయి.

పసిపిల్లల చర్మ సంరక్షణ కోసం..

పసిబిడ్డల మీదున్న ప్రేమ కొద్దీ వారి కోసం ఎంత ఖరీదైన కాస్మొటిక్స్‌నైనా తీసుకొస్తారు. కానీ, ఇప్పుడు మార్కెట్లో లభిస్తున్న చాలా ఉత్పత్తులు రసాయనాలతో నిండి ఉంటున్నాయి. ఇవి పిల్లల చర్మపు మృదుత్వాన్ని సంరక్షించకపోగా, చర్మం పొడిబారిపోయి ఒక్కోసారి దురద, బొబ్బలు వచ్చేలా చేస్తాయి. పెద్దవాళ్లతో పోలిస్తే పసిపిల్లల చర్మం సహజంగానే మరీ సున్నితంగా ఉంటుంది. దాన్ని కాపాడే విషయంలో ఎవరైనా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందే! కాకపోతే, వాళ్ల కోసం కొనే నూనెలు గానీ, క్రీములు గానీ, షాంపూలు, సబ్బులు గానీ సురక్షితమైనవై ఉండాలి. ఒకవేళ అవి రసాయనాలతో ఉంటే వారి చర్మాన్నే కాదు శరీరంలోని అంతర భాగాల్ని కూడా దెబ్బ తీసే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రకృతి సహజమైన ఉత్పత్తులనే పిల్లల కోసం వాడాలంటున్నారు ఆయుర్వేద నిపుణురాలు డాక్టర్ సుభాషిణీ ఎన్. ఎస్. అలాంటి ప్రకృతిసిద్ధమైన ఉత్పత్తుల్లో కొన్ని...

కలబందలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ అంశాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మం మీద వచ్చే బొబ్బలు, దురద సమస్యల్ని తగ్గిస్తాయి.

వట్టివేరులో బ్యాక్టీరియాకు, ఫంగస్‌కు వ్యతిరేకంగా పనిచేసే మూలకాలు చాలా ఎక్కువ. దురద మంటలతో పాటు రక్తస్రావం కాకుండా ఆపే గుణాలు కూడా ఎక్కువే. అందువల్ల వట్టివేరుతో తయారు చేసిన ఏ ఉత్పత్తి అయినా, పిల్లల్ని చర్మ సమస్యల నుంచి కాపాడుతుంది.

శనగలు యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మాన్ని శుభ్రం చేయడమే కాకుండా, చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. శనగల ఆధారంగా తయారుచేసిన షాంపూలైతే, పిల్లల జుత్తును కాంతివంతంగా మారుస్తాయి.

వావిలాకులో కూడా బ్యాక్టీరియాను, ఫంగస్‌ను నశింపచేసే గుణాలున్నాయి. చర్మం కందిపోవడం, ఇన్‌ఫెక్షన్లకు గురికావడం వంటి సమస్యలకు గురికాకుండా, చర్మం మీద వాపు, దద్దుర్లు రాకుండా కాపాడుతుంది.

ఎర్ర తామరలో చర్మ లావణ్యాన్ని కాపాడే మూలకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి పిల్లల చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి.

మొత్తంగా చూస్తే పిల్లల శరీర ఆరోగ్యానికి అవసరమైన పోషకాహారం అందిస్తూనే, చర్మ రక్షణ కోసం, ప్రకృతి సహజమైన తైలాలను, క్రీములను అందించడం అవసరం. వాటివల్ల పసిపిల్లల చర్మం కోమలంగా, మృదువుగా ఉంటుంది.

'సెక్స్ ఎడ్యుకేషన్'... బూతుపదం కాదు!

ఏదో పార్టీలో తల్లిదండ్రులంతా ఓ చోట చేరి చర్చించుకుంటున్నారు. కాదుకాదు, వ్యవస్థ మీద దుమ్మెత్తిపోస్తున్నారు. వాళ్ల బాధేమిటో నాకు అర్థమైంది. ఏది సెక్స్ ఎడ్యుకేషనో తెలియకపోవడం వల్ల వచ్చిన ఇబ్బంది ఇది. లైంగికత మీద సరైన అభిప్రాయం లేనివారికి లైంగిక విద్య మీద మాత్రం గౌరవం ఎందుకు ఉంటుంది?

సెక్స్ ఎడ్యుకేషన్ అంటే... జీవన నైపుణ్య విద్య. పెద్దలతో ఎలా మాట్లాడాలి, పిల్లలతో ఎలా వ్యవహరించాలి, గురువుల్ని ఎలా గౌరవించాలి, రోడ్డు మీద వెళ్తున్నప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి, అపరిచితుల్ని ఏమేరకు విశ్వసించాలి, సైకిలు ఎలా తొక్కాలి, కారు ఎలా నడపాలి... ఇలా జీవితంలో పనికొచ్చే చాలా చాలా విషయాల్ని మనం పిల్లలకు నేర్పుతుంటాం. ఆపాటి జాగ్రత్తలు లేకపోతే... జీవన సమరంలో నెగ్గుకురాలేరు. ఆ పాఠాల్లో సెక్స్ ఎడ్యుకేషన్ కూడా ఒకటి.

చాలామంది భావించినట్టు, సెక్స్ ఎడ్యుకేషన్ వల్ల బాధ్యతా రాహిత్యం పెరగదు. బాధ్యత అలవడుతుంది. బీమా చేసినంత మాత్రాన నష్టాలు సంభవించవని కాదు. ఆ కష్టనష్టాల్ని తట్టుకోగల శక్తి వస్తుంది. లైంగిక విద్య ఏం చేయాలో చెప్పదు. ఏం చేయకూడదో హెచ్చరిస్తుంది. అజ్ఞానాన్ని పటాపంచలు చేస్తుంది. అపోహల్నీ భయాల్నీ తొలగించి... సరైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది. విపత్కర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో ఎరుకపరుస్తుంది. ఫలితంగా కౌమార బాలబాలికలకు బాధ్యత తెలుస్తుంది. విశృంఖలత్వం దరిదాపుల్లోకి కూడా రాదు. అజాగ్రత్త, అశ్రద్ధ ... అన్న మాటలు నిఘంటువులోంచి మాయమైపోతాయి. ఆ ఎరుకతోనే తమచుట్టూ రక్షణ వలయం నిర్మించు కుంటారు. ప్రలోభాలకూ ఉద్వేగాలకూ లోనుకాకుండా... పరిపక్వతతో వ్యవహరిస్తారు.

బాలబాలికలకు కొన్ని సందేహాలు వస్తుంటాయి. ఎవరికి చెప్పుకోవాలో తెలియదు. ఎలా పంచుకోవాలో అర్థం కాదు. సరిగ్గా ఆ అసత్యం కావచ్చు, అర్ధసత్యం కావచ్చు. ఆ సమాచారం వారిని తప్పుదోవ పట్టించినా పట్టించవచ్చు. దయచేసి ఆ పరిస్థితి రానివ్వకండి. నిజాల్ని సున్నితమైన భాషలో, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని జోడించి చెప్పండి. ఉప ప్రశ్నలకూ అనుబంధ ప్రశ్నలకూ ఓపిగ్గా జవాబు ఇవ్వండి.

'అమ్మో! ఈ కాలం పిల్లలు తెలివిమీరిపోతున్నారు'
'నా మట్టుకు నాకు శోభనం గదిలో అడుగుపెట్టే దాకా...'
'సెక్స్ ఎడ్యుకేషన్ అంటూ అవాకులూ చవాకులూ పేలుతున్న మేధావుల్ని అనాలి'
'ఇంటర్నెట్ వచ్చేశాక ప్రతిదీ బహిరంగమైపోతోంది'

పిల్లల ముందు తల్లిదండ్రులు ఒకరి పట్ల ఒకరు ప్రేమను వ్యక్తం చేసుకోవచ్చా, యాదృచ్ఛికంగా ఏ ఇబ్బందికరమైన భంగిమలోనో వారికి కనిపిస్తే? పిల్లల ముందు తలెత్తుకోలేని పరిస్థితే వస్తే?... తదితర ప్రశ్నలు వ్యక్తం చేస్తుంటారు చాలామంది. నిజమే, ప్రతి కుటుంబంలో ఏదో ఒక సమయంలో ఎదురయ్యే ఇబ్బందే ఇది. ఆ సమయంలో ఎలా స్పందించాలన్నది పిల్లల వయసును బట్టి ఉంటుంది. ఆ సమయంలో జీవితభాగస్వామిని ఒళ్లో కూర్చోబెట్టుకుని ఉన్నారనుకోండి, 'ఇది మీ అమ్మ సీటు' అంటూ తేలిగ్గా నవ్వేయవచ్చు. ఆ ఒక్క దృశ్యంతోనే వాళ్ల మనసులు కలుషితం అవుతాయని బెంగపడాల్సిన పన్లేదు.

పిల్లల గదిలోకి పెద్దలు వెళ్లినా..

పెద్దల గదిలోకి పిల్లలు వెళ్లినా... అనుమతి తీసుకున్నాకే అడుగువేయడం మంచి పద్ధతి. బాల్యం నుంచీ కొన్ని ప్రాథమికమైన మర్యాదలు నేర్పితే... ఇలాంటి ఇబ్బందులు ఉండనే ఉండవు.



పాలకూర తింటే కిడ్నీలో రాళ్లు వస్తాయా?

ఆకుకూరను కట్‌చేసి 5 నిమిషాల పాటు ఉప్పు నీటిలో ఉంచాలి. ఆ తర్వాత మంచినీటిలో మూడుసార్లు కడగాలి. దీని వల్ల ఆకు కూరలపై ఉన్న రసాయన అవశేషాలన్నీ తొలగిపోతాయి.

కడిగిన ఆకుకూరను కట్ చేసి తాళింపు వేసుకోవాలి.

ఆకుకూరలో ఉన్న నీటితోనే కూర మగ్గుతుంది. ఇలా ఉడికిన కూరను డైరెక్ట్‌గా తినొచ్చు. పప్పులో తాళింపు వేసుకోవచ్చు. ఇతర కూరగాయలు, మాంసాహారంతో కూడా కలిపి వండుకోచ్చు.

ఇలా వండుకున్న ఆకుకూరల్లో అన్ని పోషకాలు ఉంటాయి. ఉడికించి నీళ్లు పారబోస్తే చాలా విటమిన్లు పోతాయి.

ఇక పాలకూర తింటే కిడ్నీలో రాళ్లు వస్తాయా? అనే ప్రశ్నకు సమాధానం ఏమిటంటే... పాలకూర తింటే రాళ్లు రావు. కానీ రాళ్లు వచ్చే అవకాశం ఉన్నవారిలో ఒక్సాలేట్స్ వల్ల రాళ్లు ఏర్పడవచ్చు. సరైన మోతాదులో నీటి పదార్థాలు తీసుకోనివారు, ఎక్కువగా ఎండలో తిరిగే వారికి కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఎక్కువ. వీలైనంత వరకు ఎక్కువ నీళ్లు తాగాలి. ఆహారంలో నీటి పదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

అనంతపురం టీడీపీలో మారుతున్న సమీకరణాలు

టీడీపీ, జనసేన పొత్తుల నేపథ్యంలో నేతల హడావిడి

సీటు దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు

విజయవాడ,మార్చి2(వెలుతురు): అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీలో టికెట్ ఫైట్ నడుస్తోంది. అనంతపురం అర్బన్ టికెట్ కోసం సీనియర్ నేతలు నువ్వానేనా అంటూ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అధినేతకు విజ్ఞప్తులు పంపుతున్నారు. మొదటి జాబితా విడుదలైన తర్వాత మరింత ఒత్తిడి పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ రాష్ట్రంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఫస్ట్ లిస్ట్ రిలీజ్ చేయడంతో పాలిటిక్స్ మరింత వేడెక్కాయి. టీడీపీ ఫస్ట్ లిస్ట్‌లో సీటు రాని నేతలు.. ఫస్ట్ లిస్ట్‌లో పేరు లేని నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొందరూ వైసీపీకి జంప్ చేస్తే.. మరికొందరూ మాత్రం అధినేతను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇదే క్రమంలో అనంతపురం జిల్లాలోని అనంతపురం అర్బన్ టీడీపీలో సమీకరణాలు మారుతున్నాయి. అనంతపురం అర్బన్ సీటుపై కన్నేశారు మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి. పెనుకొండ టికెట్ సవితకు ఇప్పటికే టీడీపీ అధిష్టానం కేటాయించడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు పార్థసారథి. పెనుగొండ టికెట్ లేదు. కనీసం అనంతపురం అర్బన్ టికెట్ అయినా ఇవ్వాలని పార్టీ అధినేత చంద్రబాబు ముందు ప్రపోజల్ పెట్టారు. పార్థసారథి ప్రయత్నాలతో అప్రమత్తమైన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి.. టికెట్ రేసులోకి తన కుమారుడు మధుకర్ చౌదరిని తీసుకొచ్చారు. టికెట్ తనకు కాకపోతే మధుకర్‌కు ఇవ్వాలంటూ అధిష్టానం ముందు ప్రపోజల్ పెడుతున్నారు ప్రభాకర్ చౌదరి. ఇంకేముంది మధుకర్‌ని అర్బన్ వీధుల్లో ప్రచారంలోకి దించేశారు. అదే స్పీడుతో మధుకర్ చౌదరి సైతం టీడీపీ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్తున్నారు. ఇప్పటికే అనంతపురం అర్బన్ టికెట్ జనసేన తరపున పవన్ కల్యాణ్ పోటీ చేస్తే తప్పా.. ఇంకెవరూ పోటీ చేసిన సహకరించేది లేదంటూ ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు ప్రభాకర్ చౌదరి. వచ్చే ఎన్నికల్లో తాను కానీ.. తన కుమారుడు కాని పోటీ చేస్తారని చెప్తున్నారు. అలాగే అనంతపురం అర్బన్ టికెట్ తనకే వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి క్రమంలో అనంతపురం అర్బన్ టికెట్ అటు బీకే పార్థసారథికి.. ఇటు ప్రభాకర్ చౌదరికి ప్రిస్టేజియస్‌గా మారింది. ఎవరి వైపు అధిష్టానం మొగ్గినా.. మరోనేత అలకబూనడం పక్కాగా కనిపిస్తుంది. ఇప్పటికే రెండో లిస్ట్‌పై కూడా కసరత్తు చేసిన చంద్రబాబు.. వీలైనంత త్వరలో రిలీజ్ చేస్తారని తెలుస్తోంది. రెండో లిస్ట్‌లో పార్థసారథికేనా? లేక ప్రభాకర్ చౌదరికా అనేది తేలనుంది..!

ఓటర్ల జాబితాలో అనేక అక్రమాలు

నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ కీలక వ్యాఖ్యలు

విజయవాడ,మార్చి2(వెలుతురు): ఏపీలో ప్రజాస్వామ్యానికి ఇది పరీక్షా సమయమని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అన్నారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళాజాత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడిందని.. పార్టీ, ప్రభుత్వం మధ్య గీత చెదిరిపోయిందన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా రూపకల్పనలో చోటుచేసుకున్న అక్రమాలు అన్నీ ఇన్నీ కావన్నారు.

ఓటర్ల జాబితా లోపభూయిష్టంగా ఉంది. ఈ విషయంలో పార్టీ నీడ ప్రభుత్వంపై పడకూడదు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు త్వరలో హైకోర్టును ఆశ్రయించనున్నాం. ఎన్నికల అక్రమాలకు ఏపీ ప్రయోగశాలగా కాదు.. వర్సిటీగా మారింది. ప్రజల్లో చైతన్యం ఉద్యమంగా మారాలి. మనదైన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ఓటు ఒక సాధనం. నేటి యువత ఏది మంచి.. ఏది చెడో తెలుసుకోవాలి. మెరుగైన సమాజానికి యువత తన వంతు పాత్ర పోషించాలి" అని నిమ్మగడ్డ పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ఖర్చుతో అధికార పార్టీ ఎన్నికల ప్రచారం

తెదేపా సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం,మార్చి2(వెలుతురు): సీఎం జగన్‌ను సాగనంపాలని ఏపీ ప్రజలంతా కోరుకుంటున్నారని తెదేపా సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దౌర్భాగ్యపు ప్రభుత్వాన్ని గద్దె దించి ఏపీని రక్షించాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. "దొంగ ఓట్లు చేర్చే కార్యక్రమాన్ని అంతా కలిసి అడ్డుకోవాలి. అధికార దుర్వినియోగానికి పాల్పడే అధికారులను బయటకు పంపాలి. ఎక్కువ కాలం ఒకేచోట ఉన్న అధికారులను వెంటనే బదిలీ చేయడమే కాకుండా అడ్డగోలుగా వ్యవహరిస్తోన్న వారిని ఎన్నికల విధుల నుంచి తొలగించాలి. ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్లు పాల్గొనకుండా చూడాలి. ప్రభుత్వ ఖర్చుతో అధికార పార్టీ నేతలు ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు" అని బుచ్చయ్య చౌదరి విమర్శించారు.

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల ధరలు తగ్గించలేం

టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడి

తిరుమల,మార్చి2(వెలుతురు): తిరుమలలో శ్రీవారి లడ్డూ ప్రసాదాల ధరలను ఎట్టి పరిస్థితుల్లో తగ్గించేది లేదని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. లడ్డూ బరువు, సైజు ఏ మాత్రం తగ్గలేదని, రేటు తగ్గించడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భక్తులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. శ్రీవారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి ఒక ఉచిత లడ్డూ అందిస్తున్నామని, బ్రహ్మోత్సవాలు , వైకుంఠ ఏకాదశి తదితర పర్వదినాల్లో తప్ప, మిగిలిన సమయంలో భక్తులు కావాలసినన్ని లడ్డూలు పొందవచ్చని సూచించారు. యువకులైన శ్రీవారి సేవకులు క్యూ లైన్లు, శ్రీవారి ఆలయంలో భక్తులకు సేవలందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తిరుమలలో భక్తులు సేవలందించేందుకు ప్రస్తుతం ఉన్న 65 ఏండ్ల పరిమితిని 60 సంవత్సరాలకు కుదించాలని చేసిన సూచనను తిరస్కరిస్తూ 60 ఏళ్ల వారు సక్రమంగా సేవలందించగలరని తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ ద్వారా దర్శనం, సేవా టికెట్లు పొందిన భక్తులకు వసతి అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు. 50 సంవత్సరాల క్రితం నిర్మించిన సప్తగిరి విశ్రాంతి గృహాలను ఆధునీకరిస్తామని చెప్పారు ఈవో ధర్మారెడ్డి.

ఇష్టమున్నా లేకపోయినా.. చచ్చేవరకు పవన్‌తోనే ఉంటా..

హరిరామజోగయ్య కీలక వ్యాఖ్యలు

విజయవాడ,మార్చి2(వెలుతురు): గత కొద్ది రోజులుగా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు లేఖల మీద లేఖలు రాస్తున్న హరిరామజోగయ్య మరోసారి బాంబు పేల్చారు. ఈసారి పవన్‌కు రెండు పేజీల భారీ లేఖను రాసిన హరిరామజోగయ్య.. కొందరు కావాలనే ఇద్దరి మధ్య తగువులు పెడుతున్నారని ఆరోపించారు. జనసేన బాగుకోసం సూచనలిస్తుంటే, తట్టుకోలేని కొందరు నేతలు, తనను వైసీపీ కోవర్ట్ అంటారా? అని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని కోరుకోవడం తప్పా? అని జోగయ్య ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జనసేనకు మంచి ఆదరణ లభిస్తోందని. మరీ ముఖ్యంగా 40 స్థానాల్లో బలం ఉంటే 24 సీట్లే తీసుకోవడం ఏంటి? అని ఆయన ప్రశ్నించారు. దుర్బుద్ధితోనే తెలుగుదేశం పార్టీ తక్కువ సీట్లు ఇచ్చిందని కార్యకర్తలు అనుకుంటున్నారని హరిరామ జోగయ్య అన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన సహకారం లేకుండా తెలుగుదేశం పార్టీ ఒంటరిగా గెలవడం అసాధ్యమన్నారు. అందుకే, జనసేనతో చంద్రబాబు జతకట్టారన్నారు జోగయ్య. నిజమైన మిత్రులెవరో.. శత్రువులెవరో తెలుసుకోవాలని పవన్ కల్యాణ్‌కు హితవు పలికారు జోగయ్య.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి అరెస్ట్

అనపర్తిలో హైటెన్షన్ వాతావరణం

విజయవాడ,మార్చి2(వెలుతురు): అనపర్తి రాజకీయం మరోసారి హీటెక్కింది. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య మాటల యుద్ధం కాస్తా ప్రమాణాల వరకు వెళ్లింది. ఎమ్మెల్యే 500 కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారనేది టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపణ. తన దగ్గర ఆధారాలున్నాయని చెప్తున్న రామకృష్ణారెడ్డి.. ఇవాళ నిరూపించేందుకు సిద్ధమయ్యారు. దీనికి వైసీపీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి కూడా సై అన్నారు. నడిచి వస్తావో హెలికాప్టర్ ఎక్కి వస్తావో.. వేదిక సిద్ధమంటూ ప్రకటించారు. రామకృష్ణారెడ్డి రాకపోతే ఆధారాలు నిరూపించలేక పోయినట్లే అన్నారు. అయితే తన సవాల్‌ను నిరూపించుకునేందుకు సిద్ధమైన రామకృష్ణారెడ్డిని పోలీసులు ఆయన ఇంటి దగ్గరే అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శుక్రవారం ఉదయం నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇంటి నుంచి బయల్దేరారు. 7 కిలోమీటర్ల దూరంలో టెంట్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి దగ్గరకు బయల్దేరారు. కార్యకర్తలు భారీగా తరలి రావడంతో వారికి అభివాదం చేస్తూ బయల్దేరారు. అయితే పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో సూర్యనారాయణ రెడ్డి ఇంటికి వెళ్లాలంటూ రామకృష్ణారెడ్డి పట్టుబట్టడంతో పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. దీంతో టీటీపీ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాగా.. నేతల సవాళ్లతో అనపర్తిలో టెన్షన్ వాతావరణం నెలకొంది. 70 మంది పోలీసులతో ఎమ్మెల్యే ఇంటి దగ్గర బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పుడే కాదు గతంలోనూ ఇద్దరు నేతల మధ్య సవాళ్లు, ప్రమాణాల చాలెంజ్‌లు కొనసాగాయి. ఇదే రాజకీయ ప్రత్యర్థులు బిక్కవోలు వినాయకుడి దగ్గర 2020 డిసెంబర్‌లో సత్య ప్రమాణాలు చేశారు. అప్పటి ఎపిసోడ్ తెలుగు రాష్ట్రాల్లోనూ సంచలనంగా మారింది. ఈ క్రమంలో పోటీపోటీ సవాళ్లతో మరోసారి ఉద్రిక్తత నెలకొంది.

జనసేన వైఖరితో అయోమయంలో బీజేపీ?

ఒంటరి పోరు బీజేపీ సిద్ధం!

విజయవాడ,మార్చి2(వెలుతురు): జనసేన వైఖరితో భారతీయ జనతా పార్టీ విసిగిపోయిందా? చంద్రబాబుతో అంటకాగుతున్న పవన్‌కి కటీఫ్ చెప్పేందుకు కమలం పార్టీ సిద్ధమైందా? ఏపీలో ఒంటరిగా బరిలోకి దిగాలని కాషాయదళం నిర్ణయించుకుందా? అంటే అవుననే అంటున్నాయి ప్రస్తుత పరిణామాలు. మరి అదే జరిగితే జనసేన - బీజేపీ పొత్తు సంగతి ఏంటి? ఏపీలో రాజకీయ ముఖచిత్రం ఎలా మారబోతోంది? అన్నదీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మొదలైన చర్చ. లెక్కలు, సీట్ల విషయంలో ఓ కొలిక్కి వచ్చిన టీడీపీ %--% జనసేన.. 99 మంది అభ్యర్థులను ప్రకటించి ఉమ్మడి కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. తాడేపల్లిగూడెంలో జెండా ఎత్తిన ఈ రెండు పార్టీలు.. బీజేపీ ఆశీర్వాదం కూడా తమకు ఉంటుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. కానీ వాస్తవంగా చూస్తుంటే పరిస్థితులు మరోలా ఉన్నాయి. టీడీపీ-జనసేనతో కలిసి వెళ్లేందుకు బీజేపీ సుముఖంగా లేనట్టు తెలుస్తోంది. జనసేనతో కటీఫ్ చెప్పి, అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు కమలం పార్టీ కసరత్తు చేస్తోంది. ఒంటరి పోరుకు సిద్ధంగా ఉండాలని జిల్లా నేతలకు ఇప్పటికే ఆదేశాలు కూడా వెళ్లాయి. ప్రజా పోరు యాత్రలు మరింత గట్టిగా చెయ్యాలని పార్టీ నిర్ణయించింది. మరోవైపు అభ్యర్థులను సైతం ఫైనల్ చేసే పనిలో ఉంది రాష్ట్ర బీజేపీ. మరోవైపు 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసే పనిలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిమగ్నమైంది. ఇప్పటికే లిస్ట్ ను ఫైనల్ చేయ్యమని ఢిల్లీ

అధినాయకత్వం నుండి ఆదేశాలు కూడా అందాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటికే 2,500 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో సీటుకు సగటున 8మంది పోటీ పడుతున్నారు. దీంతో వాటిని పరిశీలించి.. అభ్యర్థులను వడబోసే పనిలో ఉంది బీజేపీ రాష్ట్ర నాయకత్వం. శివప్రకాష్ జీ ఆధ్వర్యంలో ఇవాళ, రేపు ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలను బీజేపీ నిర్వహించబోతోంది. ఈ సమావేశానికి ప్రతి జిల్లా నుంచి ఆరుగురు ముఖ్యనేతలు హాజరు కాబోతున్నారు. వారి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ఒక్కో సెగ్మెంట్ నుంచి ముగ్గురిని ఎంపిక చేసి.. ఆ లిస్ట్‌ను అధిష్టానానికి పంపే ఆలోచనలో ఉంది రాష్ట్ర బీజేపీ. ఒంటరిగా వెళ్తే కాపు నినాదంతో వెళ్లాలని బీజేపీ భావిస్తోంది. తెలంగాణలో బీసీ సీఎం తరహాలో ఏపీలో కాపు సీఎం నినాదంతో ఎన్నికలకు వెళ్లేందుకు ప్లాన్ చేస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన చేసే ఆలోచనలో ఉంది బీజేపీ. టీడీపీలో కమ్మ, వైసీపీలో రెడ్డి ప్రాబల్యం ఎక్కువగా ఉందనే ప్రచారం ఉంది. పైగా ఈ రెండు కులాలే ఇప్పటిదాకా రాజ్యాధికారాన్ని దక్కించుకున్నాయి. సీఎం పీఠంపై కూర్చోవాలనే కాపుల కలలు ఇప్పటిదాకా కలగానే మిగిలాయి. ఈ నేపథ్యంలో కాపు సీఎం నినాదంతో వెళ్తే.. రాష్ట్రంలో 20 శాతం ఉన్న కాపులు బీజేపీకి దగ్గరవుతారనే ఆలోచన చేస్తోంది కాషాయదళం. అదే సమయంలో ఆపరేషన్ ఆకర్ష్ సైతం చేపట్టే ప్లాన్‌లో ఉంది. టీడీపీ, వైసీపీ అసంతృప్తులపై ఫోకస్ పెట్టి.. పార్టీలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే 30 మందికి పైగా లీడర్లు బీజేపీకి టచ్‌లోకి వెళ్లారనే ప్రచారం కూడా జరుగుతుంది. ఇప్పటికే పారిశ్రామికవేత్తలను పార్టీలోకి చేరుకున్న బీజేపీ.. ఇతర పార్టీల్లోని అసంతృప్త నేతలను చేర్చుకునే పనిలో పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ - జనసేన ఎలా ముందుకు వెళ్తాయో చూడాలి మరి.

ఓడిపోయేందుకు జగన్ సిద్ధం

జనసేన-టిడిపిలతో వైసిపి షేక్

రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం

రాష్ట్రప్రయోజనాల కోసమే జనసేనతో పొత్తు

ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని దోచేసారు

ఎదరించిన వారిని అడ్డంగా నరికేశారు

40 ఏళ్ల రాజకీయంలో ఇంత అరాచకం చూడలేదు

టిడిపిలో చేరిన వేమిరెడ్డిం దంపతులు

చేరిక సభలో టిడిపి అధినేత చంద్రబాబు విమర్శలు

నెల్లూరు,మార్చి2(వెలుతురు): రాష్ట్రంలో జగన్ అరాచక పాలన అంతమొందించేందుకు మనమంతా ఒక్కటి కావాల్సి ఉందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రప్రయోజనాల కోసమే జనసేనతో కలసి పొత్తులు పెట్టుకున్నామని, దీనిని కూడా వైసిపి జీర్ణించుకోవడం లేదన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ వచ్చి ఎపిని జగన్ దోచుకున్నారని మండిపడ్డారు. నెల్లూరు జిల్లాలో వైకాపా కీలక నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డి తెదేపాలో చేరారు. తెదేపా అధినేత చంద్రబాబు సమక్షంలో వారిద్దరూ పసుపు కండువా కప్పుకొన్నారు. ఇటీవల వైకాపాకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రెడ్డితో పాటు నెల్లూరుకు చెందిన పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు తెదేపాలో చేరారు. నెల్లూరు పీవీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భారీగా తెదేపా-జనసేన కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అజాత శత్రువు. ఆయన.. ప్రజా సేవకు మారుపేరు. యుద్ధానికి సై అంటూ అంతా ముందుకొస్తున్నారు. వేమిరెడ్డి రాకతో సునాయాసంగా గెలవబోతున్నాం. ప్రజలకు సేవ చేసే ఏకైక ఉద్దేశంతోనే వేమిరెడ్డి పార్టీలోకి వచ్చారు. నెల్లూరు కార్పొరేషన్ మొత్తం ఖాళీ అయింది. పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నా. రాజకీయాలకు గౌరవం తెచ్చే వ్యక్తులను పార్టీలోకి స్వాగతిస్తున్నా. ప్రశ్నించిన వారిని వేధించడమే సీఎం జగన్ పనిగా పెట్టుకున్నారు. మనమంతా బానిసలం.. ఆయన రారాజు.. అనుకుంటున్నారు. ఎవరైనా ఆయన్ను వ్యతిరేకించినా.. చేసింది తప్పని చెప్పినా.. ఇక వారి పని అయిపోయినట్లే. అలా ప్రశ్నించినందుకే సొంత పార్టీ నేతలకు సైతం వేధింపులు తప్పలేదు. సీఎం జగన్ అవలంబిస్తోన్న తీరును చూస్తే చాలా బాధేస్తోంది. వ్యక్తులు, ప్రజాస్వామ్యానికి గౌరవం ఇచ్చే పార్టీ తెదేపా. అహంకారంతో ఇష్టానుసారం రాష్ట్రాన్ని నాశనం చేసిన వ్యక్తిని ఇంటికి పంపించాల్సిన సమయం వచ్చింది. ఆ బాధ్యత మన అందరిపైనా ఉంది. ఇది ఏ ఒక్కరి కోసమో కాదు. ఐదు కోట్ల ప్రజానీకం, భావితరాల భవిష్యత్తు కోసం జగన్‌ను గద్దె దించాలి. రాష్ట్రం, ప్రజలపై ఎలాంటి గౌరవం లేని వ్యక్తి సీఎంగా ఉండేందుకే ఏమాత్రం అర్హత లేదు. ఆయన విధానాలు నచ్చక వాళ్ల నేతలే పార్టీకి బైబై అంటున్నారు. కార్యకర్తలు తిరుగుబాటు చేసే పరిస్థితికి వచ్చారు. ఈ ముఖ్యమంత్రికి భంగపాటు తప్పదు. వెయ్యి శాతం చెబుతున్నా.. రాష్ట్రంలో రాబోయేది తెదేపా-జనసేన ప్రభుత్వమే' అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

ఇది ప్రారంభం మాత్రమే. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతోనే ఉధృతమైన తిరుగుబాటు మొదలవుతుంది. వైకాపా నాయకులు రోడ్డుమీద తిరగాలంటే భయపడే పరిస్థితి వస్తుంది. ఇప్పటివరకు విశాఖను దోచేసిన వ్యక్తిని నెల్లూరుకు పంపిస్తున్నారు. అక్కడ మొత్తం ఊడ్చేశారు.. ఇప్పుడు నెల్లూరుకు వస్తే ఇక్కడా ఏమీ మిగలదు. తనకు ఎవరూ ఎదురు ఉండొద్దనే నియంతృత్వ ధోరణిలో జగన్ ముందుకెళుతున్నారు. దోచుకున్న డబ్బుతో ఎక్కడ పడితే అక్కడ సిద్ధం.. సిద్ధం.. అని ప్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. మొదట్లో సిద్ధం అంటే అర్థం కాలేదు. ఆ తర్వాత ఆలోచిస్తే... ఓడిపోయేందుకే జగన్ 'సిద్ధం' అని అంటున్నట్లు అర్థమైందని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి జగన్ విధానాలతో ప్రజల్లోనే కాదు, వైసీపీ కార్యకర్తల్లోనే తిరుగుబాటు మొదలైందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ

సందర్భంగా అన్నారు. వెయ్యికి వెయ్యి శాతం టీడీపీ జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇది ఆరంభం మాత్రమే అని.. ఎన్నికల కోడ్ వచ్చాక ఇంకా మార్పు వస్తుందని తెలిపారు. వైసీపీ రౌడీలని రోడ్లపై తరిమికొట్టే రోజులు వస్తున్నాయన్నారు. విశాఖపట్నాన్ని దోచేసిన వ్యక్తి విజయసాయిని నెల్లూరుకి పంపిస్తున్నారన్నారు. దోచుకున్న డబ్బుతో సిద్ధం అంటూ హోర్డింగులా? అంటూ మండిపడ్డారు. ఇన్నాళ్ల రాజకీయాల్లో ఎన్నడూ చూడలేదని.. దేనికి సిద్ధం... ఓడిపోవడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. 85 మంది జాబితా విడుదల చేసి కిందాపైనా పడుతున్నారు. ఒకాయనకి అధికారంలో ఉన్నప్పుడు బట్టలు కూడా నిలవలేదు.. తంతే నరసరావుపేటలో పోయిపడ్డాడు. బుల్లెట్ దిగిందా? లేదా? పల్నాడులో తంతే చెన్నైకి పోతాడు. ఎంపీలు, ఎమ్మెల్సీలు తమ పదవులకంటే రాష్ట్ర భవిష్యత్తు ముఖ్యమని వచ్చేస్తున్నారు. గంగాధర్ నెల్లూరులో డిప్యూటీ సీఎంని మార్చారు. మంగళగిరిలో ఇప్పటికి ముగ్గురుని మార్చారు. ఇలాంటి పరిస్థితులు చూశామా? జగన్ ఒక మోసగాడు. తప్పుడు లెక్కలతో మోసం చేస్తున్నాడు. సీఎం సభల నుంచి జనం పారిపోకుండా పోలీసుల కాపాలనా?. ఆయన హెలికాప్టర్ లో వస్తే కింద ట్రాఫిక్ ఆపేస్తారు. చెట్లు నరికేస్తారు. ఊరికో సైకోని తయారు చేశారు. మొన్ననే సోమిరెడ్డిపై ఒక సైకో గడ్డపారతో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు గంటల్లో రౌడీల ఆటకట్టిస్తాం. వివేకా హత్య కేసు అయిదేళ్లుగా ఎందుకు తేలడం లేదు?. నిన్ననే చెల్లెలు అడిగింది. సమాధానం చెప్పడానికి సిద్ధమా? గొడ్డలిపోటుని గుండెపోటని ఎందుకు చెప్పావ్?... నీకూ సంబంధం ఉంది కాబట్టే గుండెపోటని చెప్పావు. సొంత చెల్లెలు షర్మిలాకి ఆస్తిపాస్తులు ఇవ్వలేదు. ఎన్నికలకి ముందు గెలుపు కోసం వాడుకుని టిష్యూపేపర్‌లా తీసిపారేశాడు. నీ సొంత సోదరి, నీ తల్లి... నీ చెలెలు మీద నీచంగా సోషల్ మీడియాలో పోస్టింగులు పెడతారా? కనీసం ఖండించారా? ఇంత నీచమైన, దగాకోరు రాజకీయాలా? నేరస్థులు, నేర స్వభావం ఉండేవారు ఎంత నీచానికైనా దిగజారితే పరిస్థితులు ఇలాగే ఉంటాయి' టీడీపీ అధినేత వ్యాఖ్యలు చేశారు. మొన్న ఓ వ్యక్తి లారీ ఓనర్‌గా ఉండేవాడు క్లీనర్‌గా మారాడు. మరో వ్యక్తి అప్పులపాలై హోటల్ అమ్ముకుని, తోపుడు బండి పెట్టుకున్నాడు. రంగనాయకమ్మ ప్రశ్నించినందుకు తీవ్ర ఇబ్బందులు పెట్టారు. గుంటూరు వదిలిపెట్టి హైదరాబాదుకి వెళ్లి పొట్ట పోసుకుంటుంది. చాలా మందిని వీళ్లే చంపేశారు. ఒక్క పల్నాడులో 30 మందిని హతమార్చారు. మంచినీరు అడిగినందుకు ఓ మహిళని ట్రాక్టర్ తో తొక్కించి హతమార్చారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ని వేధించి చంపేశారు. ఈరోజు కులాలని రెచ్చగొడు తున్నారు. టీడీపీ - జనసేన పొత్తుపెట్టుకుంటే వైసీపీకి బాదొచ్చింది. రాష్ట్రం కోసం పొత్తుపెట్టుకుంటే తప్పేంటి?. ఎవరికీ ఇవ్వని గౌరవం పవన్ కళ్యాణ్‌కు, జనసేన శ్రేణులకు ఇస్తున్నాం. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి కలిగాచుకునే రకం వీళ్లు. ఒక్కఛాన్స్ అంటూ ముద్దులు పెట్టి, ఇప్పుడు పిడిగుద్దులు గుద్దుతున్నారు. ఏ ఒక్క వర్గమైనా ఆనందంగా ఉన్నారా? అన్ని రంగాలు, అన్ని కులాలు దెబ్బతిన్నారు. నెల్లూరు జిల్లా రాజకీయ చైతన్యం ఉండే జిల్లా. రెడ్లకి న్యాయం చేసి గౌరవంగా చూసి ఉంటే నలుగురు రెడ్లు టీడీపీకి వస్తారా? అని చంద్రబాబు ప్రశ్నలు కురిపించారు. నెల్లూరు జిల్లాలో గనులు దోచేశారని... ఇసుక, సిలికా వంటివి మొత్తం దోచుకున్నారని ఆరోపించారు. నలుగురు రెడ్లు పెద్దిరెడ్డి, సజ్జల, సుబ్బారెడ్డి, విజయసాయి తప్పించి మరెవరు బాగుపడలేదన్నారు. ఉమ్మడి నెల్లూరులో పదికి పది గెలిపించడానికి టీడీపీ, జనసేన కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. పాలూ నీళ్లులా కలిసి పోయారన్నారు. మాజీ మంత్రి నారాయణను ఎన్ని ఇబ్బందులు పెడుతున్నారో చూస్తున్నామని.. గట్టిగా పోరాడుతున్నారని తెలిపారు. సర్వే రిపోర్టులు చూస్తే... వీపీఆర్‌కు మంచి ఫలితాలొచ్చాయన్నారు. 99 సీట్లు కేటాయించాక, తాడేపల్లి కొంపలో భయపడిపోయారన్నారు. తాడేపల్లి మొత్తం షేక్ అవుతోందని.. అభ్యర్థులని మార్చేస్తున్నారని.. ఏ ఒక్కరూ గెలిచే పరిస్థితులు లేవన్నారు. అధికారులు తప్పుడు పనులు చేస్తే, జగన్‌తో పాటే ఇబ్బందులు పడతారని చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com